వరవిక్రయము

రచన :

శ్రీ కాళ్ళకూరి నారాయణరావు

జయంతి పబ్లికేషన్స్
కారల్ మార్క్స్ రోడ్డు * విజయవాడ-520002

VARA VIKRAYAM

By

KALLAKOORI NARAYANARAO

First Edition :- 1921

JAYANTI PUBLICATIONS
Vijayawada - 520 002

Edition :
MARCH, 1993

Price :
Rs. 10-00

Printers :
SATEESH PRINTERS
Vijayawada-11.

జీవిత సంగ్రహము

శ్రీ కాళ్ళకూరి నారాయణరావుగారు 28-4-1871న పశ్చిమగోదావరి జిల్లా మచ్చపురిలో పండిత కుటుంబంలో జన్మించారు. వీరు కవి, నాటక కర్త, కథ, నవల, చరిత్రలు, వ్యాసాలు మొదలగు సాహితీరంగములో అన్ని కోణాలను దర్శించి; 7 నాటకాలు, 13 ప్రహసనాలు, ఒక నవల, 3 కథలు, 3 విమర్శగ్రంథాలు, 3 చరిత్రకు సంబంధించిన రచనలు, 11 వ్యాసరచనలు, 5 గ్రంథ విమర్శలు, 10 కవితలు, 2 చిత్ర కావ్యములు మొదలగు 58 గ్రంథాలు రచించారు.

నారాయణరావుగారిపై వీరేశలింగంగారి ప్రభావం ఎక్కువగా వుంది. వీరు మహాకవులు, మహాపండితులు కొప్పరపు కవుల శిష్యులు. సంఘసంస్కర్త, బ్రహ్మసమాజికులు, నైతిక సంపత్తిగల శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారికి సహచరులు కూడాను.

నారాయణరావుగారి సోదరి బాలవితంతువు. ఆమెకు పునర్వివాహం చేయాలనే పట్టుదలతో తండ్రితో ఘర్షణపడి ఇంటి నుంచి బయటికి వచ్చారు. ఆ రోజులలోనే కట్నకానుకలు లేకుండా వర్ణాంతర వివాహం చేసుకున్న గొప్ప సంఘసంస్కర్త.

వీరు నాటక రచయితే కాక మంచి నటుడు. టంగుటూరి ప్రకాశం పంతులుగారు దమయంతి పాత్ర వేస్తే, ఈయన నల, బాహుక వేషాలు వేసి ప్రజల మన్ననలు పొందారు. ఈయనకు ఫొటోగ్రఫీ, ఆయుర్వేదం, యోగాభ్యాసంలో మంచి ప్రవేశం వుంది. అంతేగాక మంచి గజ ఈతగాడు. గోదావరిని ఈవల నుంచి ఆవలకు ఈదిన ప్రముఖులు.

అధ్యాపకులుగా, వైద్యులుగా, పత్రికా సంపాదకులుగా, పట్టాలేని ప్లీడరుగా, అన్నిటా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఎన్నో అష్టావధానాలు, శతావధానాలు చేశారు.

సంఘంలో జరిగే దురాచారాల మీద వరవిక్రయము, చింతామణి, మధుసేవ వంటి నాటకాలు రచించారు. అవి ఎంతో ప్రజల మన్ననలు పొంది ప్రసిద్ధికెక్కాయి. వీరి ప్రథమ రచన "లుబ్ధాగ్రేసర చక్రవర్తి" ప్రహసనము; చివరి రచన "సంసారనటన". వీరు 27-6-1927న నిర్యాణము చెందారు.

రెండు మాటలు

తెలుగు సాహితీ వనంలో వెల్లివిరిసి, సంఘంలో నెలకొని వున్న చెడును, సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి సాహిత్య సేవతో కలంపట్టి ఉద్యమించిన గురజాడ, కందుకూరిల కోవలో కాళ్ళకూరి నారాయణరావు ఒకరు;

సంఘంలో వేళ్ళూనుకుపోయిన వరకట్న పిశాచాన్ని పారద్రోలాలనే తపనతో-అవనిలో ఆడదానిగా పుట్టుటే తను చేసుకున్న పాపమా ! అని ఏ స్త్రీ హృదయమూ ఆక్రోశించకూడదని ఆశించి;ఆడపిల్ల పెళ్ళి విషయంలో మొగ పెళ్ళివారి ఆశలు, ఆగడాలు-ఆడ పెళ్ళివారి అవస్థలు కనులకు కట్టినట్టు సజీవపాత్రల జీవన చిత్రణము వరవిక్రయము.

సాహితీ సంద్రాన్ని మథించి పలుప్రక్రియలలో యాబది ఎనిమిది ఆణిముత్యాలతో తెలుగు తల్లికి నీరాజనాలర్పించిన శ్రీ కాళ్ళకూరి నారాయణరావుగారి రచనలలో స్వాతిముత్యమీ వరవిక్రయము.

రజస్వలానంతరం ఆడపిల్లలకు పెండ్లికావడం దుర్లభం. కారణము సంఘం ఆ కుటుంబాన్ని వెలివేస్తుంది. మరి యుక్త వయస్సు రాకుండానే పెండ్లి చేయాలి? 10 సంవత్సరాలు నిండగానే పెండ్లి, పెండ్లి అంటూ తల్లి తపన, తండ్రి ఆరాటం, కాళ్ళు అరిగేటట్లు తిరగటం, సంతలో సరుకులా పెండ్లి కొడుకుల తండ్రులు పెండ్లి కొడుకులను వేలం పెట్టగా, ఉన్న ఆస్తి సర్వస్వం తెగనమ్మి పెండ్లి కొడుకుల దండ్రుల యెదాన కొట్టడం. ఆపైన అలో లక్ష్మణా అంటూ, ఎందుకు కన్నామురా ఆడపిల్లలననే ఆ తలిదండ్రుల ఆవేదన. యిదీ వరస——

కోరికల చిట్టా అగ్రిమెంటు

పెండ్లికొడుకు తండ్రి వ్రాసియిచ్చిన అగ్రిమెంటు:- బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారికి సింగరాజు లింగరాజు వ్రాసి ఇచ్చిన రశీదు. మీ కుమార్తె చి॥ సౌ॥ కాళిందిని చి॥ బసవరాజునకు చేసుకొనుటకును, అందులకై మీరు మాకు కట్నముక్రింద నైదువేల నైదు వందల రూపాయలు రొక్కమును (చిక్కిన నేటి రూపాయలు లక్ష) రవ్వల యుంగరము, వెండి చెంబులు, వెండి కంచము, వెండి పావ కోళ్ళు, పట్టు లాబితాలు, వియ్యపురాలు వియ్యంకుల లాంఛనములు యథా విధిగా నిచ్చుటకును, ప్రతి పూట పెండ్లివారిని బ్యాండుతో బిలుచుటకును, రాకపోకలకు బండ్లు, రాత్రులు దివిటీలు ఏర్పాటు చేయుటకును, రోజుకు రెండుసార్లు పిండివంటలతో భోజనములను, మూడుసార్లు కాఫీ, ఉప్మా, ఇడ్డెనులు, దోశె, రవ్వలడ్డు, కాజా, మైసూరు పాకాలతో ఫలహారములు మా ఇష్టానుసారము అయిదు దినములు మమ్ము గౌరవించుటకు, అంప కాలనాడు మాకు పట్టుబట్టలను, మాతో వచ్చువారికి ఉప్పాడ బట్టలు ఇచ్చు టకును నిర్ణయించుకొని బజానాక్రింద 10 రూపాయలు ఇచ్చినారు గాన ముట్టినది.

—సింగరాజు లింగరాజు వ్రాలు.

పాత్రలు

1.	పురుషోత్తమరావు	— పెండ్లి కుమార్తెల తండ్రి
2.	భ్రమరాంబ	— పెండ్లికుమార్తెల తల్లి
3.	సింగరాజులింగరాజు	— పెండ్లికుమారుని పెంపుడు తండ్రి
4.	సుభద్ర	— సింగరాజులింగరాజు భార్య
5.	కాళింది	మొదటి పెండ్లికుమార్తె } అక్కాచెల్లెండ్రు
6.	కమల	రెండవ పెండ్లికుమార్తె } అక్కాచెల్లెండ్రు
7.	బసవరాజు	— పెండ్లి కుమారుడు
8.	పెండ్లిండ్ల పేరయ్య	} దళారీలు
9.	వివాహాలవీరయ్య	} దళారీలు
10.	న్యాయాధిపతి	
11.	ఘంటయ్య	—సింగరాజులింగరాజుగారి వంటబ్రాహ్మడు

వరవిక్రయము

నాంది

భూరి గరిష్ఠమై, విబుధ పుంగవ మంగళ వాక్సమృద్ధమై,
చారుతరాప్సరోనటన సంభృతమై, సవినోదమై యహం
కార వికార దూరమయి గర్వ్యైతరోభయశుల్క శూన్యమౌ
గౌరి వివాహసంస్మరణ గల్గఁజేసెడుఁగాక! భద్రముల్.

ప్రస్తావన

సూత్ర:— (ప్రవేశించి) ఓహో! యేమి యీ సభాసమ్మర్ధము! ఆ మహాకవి కావ్యములనఁగానే యభిజ్ఞుల కేమి యాదరము! (పరిక్రమించి) ఓ సభాస్తారులారా! వర్తమాన వరశుల్క దుర్నయదూరీకరణమునకై బుద్ధిరాజు వీరభద్రరాయామాత్యులవారి కంకితముగా, మహాకవి కాళ్ళకూరి నారాయణరావు గారిచే రచింపఁబడిన వరవిక్రయ రూపకమునువిలోకించు నిమిత్తము విచ్చేసిన మీయెడ నేనత్యంతము కృతజ్ఞుడను. ఏమనుచున్నారు?

గీ. కవి ప్రసిద్ధుఁడు; కావ్యమా కాలవిహిత
మైన యది; మీరలా భరతాగమమునఁ
జతురు, లటుగాన, మీ ప్రదర్శనముకొరకుఁ
ద్వరపడుచు నున్నవార మెంతయును మదిని.

అనియా! చిత్తము చిత్తము-ఇదిగో యిప్పుడే యుపక్రమించెదము. (తెరవంకఁజూచి) ఓసీ! ఓసీ! యెక్కడ! ఒక్కసారి యిటురమ్మా :

నటి:— (ప్రవేశించి) ఏమా యధికారము! కొనిపొలమువైచినట్లె గొంతు చించుకొనుచున్నారే?

సూత్ర:— ఓసి దెష్టా! కొనిగాక నిన్నుఁ గోసికొని వచ్చితి నంటే? నీ తండ్రి కిచ్చిన వేయి రూపాయల రొక్కము-నీకుఁబెట్టిన వేయి రూపాయల నగలు—ఏ గంగలో గలిసినవి?

నటి:- మీ సొమ్ములు మెడఁదిరుగ నిచ్చివేసిన నాకు విడియాకు లిచ్చెదరా!

సూత్ర:— ఓసి నీ బొడ్డుపొక్క! యిది అమెరికా దేశమను కొంటివా యేమి? కాదు కాదు—ఆర్యావర్తము. అబ్బో! ఆ మాట లిక్కడ సాగవు! బొందు మెడఁగట్టినచో, బొందిలోఁ బ్రాణముండువఱకును బందెగొడ్డువలెఁ బడి యుండవలసినదే.

నటి:— అట్లయిన నా సంగతి రేపాడువారల సభలో నాలోచించెదను కాని—యిప్పుడు నన్నుఁ బిలిచిన పని యేమో సెలవిండు

సూత్ర:- పాత్రములను సిద్ధపఱచితివా?

నటి:- సిద్ధపరచుటయే గాదు — శీఘ్రముగఁ బ్రవేశించవలసినదని చెప్పి కూడా వచ్చినాను.

సూత్ర:— అట్లయిన వారింకను నాలసించుచున్నారేమి?

నటి:- మీ చెవులలోఁ జెట్లు మొలచినవా యేమి? ఆ చరకా గానము వినబడుట లేదా?

తెరలో:— చరకా ప్రభావం బెవ్వరి కెరుక! జగతిలోన మన చరకా
నీడలతోడ! దులదూగుచున్న యల
సీమజాతి చూచుచున్న దేమరక చరకా

సూత్ర:- ఔనే! అవిగో—భ్రమరాంబా, కాళిందీ, కమలా పాత్రములు చరకాగానముతోఁ బ్రవేశించుచున్నవి. మనము పోయి పయిపని చూతము రమ్ము. (ఇద్దరు నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

....o...

వరవిక్రయము

ప్రథమాంకము

ప్రదేశము : పురుషోత్తమరావుగారి లోపలి చావడి.
ప్రవేశము : పంటెను నూలు చుట్టుచు భ్రమరాంబ.
(చరకాగానముతో నూలు వడుకుచు కాళింది, కమల)

కాళింది, కమల:- మోహనరాగము— ఆదితాళము

చరకా ప్రభావం బెవ్వరి కెరుక! జగతిలోన మన చరకా
సిరులతోడఁ దులఁదూఁగుచున్న యల —
సీమవారి చూపుచున్న దేమఱక, చరకా.

చ. నూలున కిరువదికోట్ల యాప్యములు సంపాదించెను వారికె గాక
మేరి నేతపనులు ఏ పృకాను మేటి జాణసలమైన వెనుక చరకా
హాటవమగు సామ్రాజ్యము గూర్చెన్ పరిమితి లేని దనంబును
జేర్చెన్ కాటకరాక్షసి నడిమార్చెన్ సాటిలేని
యొక జాతి నొనర్చెన్. చర.

కాళింది:- అమ్మా! అదేమే—చేతిలోని నూలు చేతిలో యున్నది!

భ్రమ:- ఈ పూట నా దృష్టి ఈ పనిమీఁద లేదే! మీ నాయన గారు మిల్లెగరిబెండు కాఫీనీళ్ళు గొంతులోఁ బోసికొని, ప్రొద్దునబోయిన వోక-యింతవఱ కింటికి రాలేదు! పంన్రెండు కొట్టి పావుగంటయ్యెనది. ఎక్కడికి వెళ్ళినారో యేమి పనిమీఁద నున్నారో తెలియదు!

కమ:- నాయనగారి కిప్పుడింకేమి పని యున్నది?— అహర్నిశలు అల్లుళ్ళను వెదకుట క్రింద సరిపడుచున్నవి.

భ్రమ:- అమ్మా! యేమి చేయుమనెదవు? ఆఁడుపిల్లలఁగన్న వారి యవస్థ యిప్పు డీ స్థితికి వచ్చినది!

గీ. కన్య నొక్కరి కొసఁగి సద్గతులు గాంతు
మనుచు సంతోషపడు కాల మంతరించి,

కష్టములు పోయఁజాలక కన్య నేల
కంటిమా యని వ్యథపడు కాల మొదవె!

కమ :- అట్లే కాని ఆడుబిడ్డల తల్లి వ్యథకు మాత్రము అర్థము లేదమ్మా ఏమందువా?

గీ. కార్యమగుదాఁక నయ్యయో! కాకపోయె
ననుచుఁ దపియించు రేపవ లాత్మలోన;
కార్యమగునంత బిడ్డ నెక్కారిణి విడిచి
యుండనోపుదు నని దిగులొందు మదిని.

కాళిం :- హుష్! ఊరకుండుము! అదిగో చెప్పుల చప్పుడు—నాయనగారు వచ్చుచున్నారు?

పురు :- (ఆయాసముతోఁ బ్రవేశించి) ఔరా! యేమి విపరీతకాల మాసన్నమైనది!

మ. చెడెధర్మంబు నశించెనీతి! హరియించెం బూర్వమర్యాద! లం
గడిఁ గూరాకూ విధాన వేలమునఁ జొక్కా టోపి పాగాల కై
వడి సంతం బశువట్లు పెండ్లికొడుకున్ వ్యాపార మార్గంబునం
బడియంగావలె ద్రవ్యముంగురిసి దైవంబైన నేఁ డిమ్మహిన్
యింతకన్న ఘోర మింకేమున్నది?

మ. పనిలేదంట కులంబుతోఁ బడుచు రూపజ్ఞాన సంపత్తితోఁ
బని లేదంట ప్రతిష్ఠతోఁ బశువుతో బంధు ప్రమేయంబుతోఁ
గనకంబున్మృదుబాంబరంబులునుశుల్కాంభ స్సమర్పించి లాం
ఛనముల్ దండిగ ముట్టఁజెప్పవలె యవశ్యంబట సంబధికిన్!

(అని యనుకొనుచు ముందునకు నడుచును.)

భ్రమ :- (లేచి) ఇదేమి నేఁ డింత సేపున్నారు? భోజనమునకు ప్రొద్దు పోలేదా?

పురు:- వెఱ్ఱిదానా! యెక్కడి భోజనము!-ఎక్కడి లోకము!

సీ. కంటిలోఁ బడు నలుసు నలుసునకంబు చందంబున
నరములపై లేచు కురుపు పోల్కి

తద్దయుఁ గదలిన దంతంబు చాట్పున
మారువాడీ యప్పు మాదిరిగను
వలుసందులం జిక్కుపడిన పీచు విధాన
బెట్ట చెప్పులలోని బెడ్డ పగిది
కుత్తుకం బడు నాకు కుట్టు పుల్లం బలె
పుట్టంబులఁ జొచ్చిన పూతిక గతి
ప్రతి నిమేషము బిడ్డల పరిణయంపుఁ
జింత వేధించునపు డన్య చింత యేద
యీడు వచ్చిన కన్నియ లింటఁ గలుగు
తండ్రి దురవస్థ తెలియును దైవమునకే!

భ్రమ :– ఇంతకు నిప్పుడు చేసికొనివచ్చిన పని యేమిటి?

పుర:– కాళ్ళరుగునట్లు కాలేజియంతయుఁ గలయఁదిరుగుటకంటెఁ జేసిన పని చిన్న మెత్తు లేదు!

భ్రమ:– కాలేజి యంతటిలోఁ బెండ్లి గావలసిన పిల్ల కాయ లెవ్వరును గానుపింపనే లేదా?

పుర:–కానిపింపకేమి –కావలసినంత మంది యున్నారు. కాని యేమి లాభము–గవ్వకుఁ గొఱగానివాఁడు గూడ కాసుల వెలలోనున్నాడు! ఒక్కటే లెక్క, స్కూలు ఫయినలు వానికి రెండువేలు–ఇంటరు వానికి మూఁడు–బియ్యే వానికి నాలుగు! ఆస్తి యేమయిన నున్నచో నంతకు రెట్టింపు. ఈ విధముగా రైలు తరుగతులకు వలె రేట్లేర్పడియున్నవి! ఆ పయిని

సీ. నీటైన యింగ్లీషు మోటారు సైకిలు
కొని పెట్టవలెనను కూళ యొకఁడు
రిష్టువాచియు, గోల్డురింగును, బూట్సును
సూట్లుఁ గావలెనను శుంఠ యొకఁడు
బియ్యేబియల్ పఱకయ్యెడి కర్చు భ
రింపవలె నను దరిద్రుఁ డొకఁడు
భార్యతోడను జెన్నపట్టణంబున నుంచి
చదివింపవలె నను చవట యొకఁడు

సీమచదువు చాల సింపులు నన్నట
కంపవలయు ననెడి యజ్ఞుఁ డొకఁడు
ఇట్లు కొసరుక్రింద నిష్టార్థముల్ వరుల్
దెలుపుచున్న వారు తెల్లముగను!

భ్రమ:- వారి వారి వర్ణనాదికము లెట్టివి?

పురు:- ఆ సంగతి నీ వడగనక్కఱయు లేదు — నేను చెప్ప నక్కఱయు లేదు!

సీ. పంచాద్రి క్రాపింగు ప్రక్కపాపిడి జూలు
లేనివాఁడు ధరిత్రి లేనివాఁడు
కాఫీహోటళ్ళును, ఖాతాలు, బిల్లులు
లేనివాఁడు ధరిత్రి లేనివాఁడు
సిగరెట్లు, బీడీలు, చెక్కిడి ఖిల్లీలు
లేనివాఁడు ధరిత్రి లేనివాఁడు
చలువ యుద్ధములు, సైకిలుకట్టు పెడగోచి
లేనివాఁడు ధరిత్రి లేనివాఁడు
తనదు తలమించినట్టి వృధావ్యయంబు
లేనివాఁడు ధరిత్రిలో లేనివాఁడు
ఇట్టులున్నారు విద్యార్థు లిప్పు డక్క
డక్కడొకరిద్ద రెవ్వరో దక్క సుదతి!

భ్రమ:- వారి తలిదండ్రు లీ పాటికి వారిచేత చదువులకు స్వస్తి యేల చెప్పింపరో!

పురు:- వెట్టిదానా! ప్రస్తుతము చాలమంది బాలురను పాఠశాలల కంపుట విరివిగా కట్నములు లాగుటకుఁగాని విద్యకొఱకుఁ గాదు. అందు వలన మనువు కుదిరిన మరునాడు కాని మానిపింపఁ దలంపరు.

భ్రమ:- అట్లయిన నా చూపుడు గుఱ్ఱములతో మన కవసరము లేదు.గానీ మీతోపాటు సంఘసంస్కరణముకొఱకు సన్నద్ధులైన వారెందరో కలరు గదా-వారిలో నెవ్వరికిని వయస్సు వచ్చిన పిల్లకాయలు లేరా?

పురు:-లేకేమీ ఉన్నారు. ఉండి యేమి లాభము? ఉపన్యాస వేదిక పై

నుక్కిరి బిక్కిరి చేసుకొనుటయే కాని-పని వచ్చినప్పుడు పట్టుదల సున్న! బాల్య వివాహములనఁ బటబట పండ్లుకొఱుకు బాపిరాజుగా రేమి చేసినారో విన్నావా?:-అథము శుభము నెఱుంగని యాఁతేండ్ల పిల్లను నలుబది యేండ్లు గడచిన నాల్గవ పెండ్లి వానికి ముడిపెట్టి-అదే మన-అత్తగారి పట్టన్నారు! స్త్రీ పునర్వివాహముల కొఱకుఁ జిందులు తొక్కిన శివయ్యగారు బంగారు బొమ్మవంటి పదునారేండ్ల చెల్లెలికి భర్త చావగాఁనే, పంటలక్కను మాని పించి, వంట తపేలా చేతికిచ్చి—అదేమన, మా యమ్మ చావనిమ్మన్నారు శవవాహనమును గూర్చి శంఖములు పూరించు శరభయ్యగారు-ప్రక్క యింటి యిల్లాలు భర్త చచ్చి, శవవాహకులకు డబ్బిచ్చు శక్తి లేక దేవుఁడాఁ గోడా యని దేవులాడచుండ వీధి తలుపునకు గొండ్లెము పైచి, విత్తెడు నైవేద్యముపట్టి, పెరటి త్రోవన పేకాటకు జక్కబోయి-అదేమన, ఆమె వచ్చి అడుగలేదన్నారు! విన్నావా? వీరేకాదు. ఈ యూరి సంఘ సంస్కర్త లందఱు నిదే మాదిరి!

భ్రమ:—అయిన నొకసారి యాలాపించి చూడకపోయినావా?

పుర:-ఆహా! ఆయాశ కూడా దీర్చుకొనియే వచ్చినాను. ఎవరితోఁ బ్రస్తావించిన నొక్కటియే పల్లవి!:- నా కిష్టమే కాని మా వాళ్ళు పడనివ్వ రండి" యను మాటతప్ప మాఱుమాట లేదు.

భ్రమ—:వారన్నదియు వాస్తవమే. కట్నము లేవన్న నాఁడుది కంఠమున కురిపెట్టుకొను దినములు వచ్చి-మాటదక్కుటకవకాశము లేన ప్పుడు, మాబాగని తలయూఁ పవలసినవారె కాని-మగవారు మాత్రమేమి చేయగలరు?

పుర:—అదేమన్నమాట—ఆఁడుదానిమాట కింత యడుగుదాఁటలేని యథములు దేశారాధన యేమి చేయగలరు!

సీ. చదువులు మాని స్వేచ్ఛగ దేశభటకు లై
నట్టివారికి లేరె యాడుఁవారు
రాజకీవుల నెట్టి రాట్నముల్ చేఁపట్టి
నట్టివారికి లేరె యాడుఁవారు

వృత్తులు రోసి, సంపత్తు లర్పణచేసి
నట్టివారికి లేరె యాడుఁవారు
భోగముల్ వీడి, కారాగారముల మాడి
నట్టివారికి లేరె యాడుఁవారు
కొంద ఱీ రీతి పందలై? గోడుమాలి
మగదనము చంపుకొని, తమ మగువల కెదు
రాడ నేరక వారలేమనిన శిరము
లూఁచుచుం గుక్కలై పడి యుండ్రుగాని!

భ్రమ:-చివరకేమి సిద్ధాంత పఱచినారు?

పురు:—అదే పాలుపోవుట లేదు.దారిలో దైవికముగా పెండ్లిండ్ల పేరయ్య యెదురుపడ-మా యింటి కొకసారి రమ్మని మఱి మఱి చెప్పి మాత్రం వచ్చినాను.

భ్రమ :—పెండ్లిండ్ల పేరయ్య యెవరు?

పురు:- ఎవరా? పెండ్లిండ్ల పేరయ్య యనియు, వివాహాల వీరయ్య యనియు నీ యూరిలో నిరువురు బ్రాహ్మణులుఈ చుట్టుపట్ల నే వివాహము జరిగినను వీరి చేతులపై జరగవలెను.

భ్రమ:-సరిసరి తెలిసినది. చక్కని పని చేసినారు. ఆయనతో నాలోచించి, అతిశీఘ్రముగాఁగార్యములగు సాధనము చూడుఁడు. పెద్ద మ్మాయికిఁ బదుమూఁడవ యేఁడు కూడా వెళ్ళవచ్చినది. చిన్నమ్మాయి దానికన్న నొక యేఁడాది మాత్రమే చిన్నది. కట్నములు పట్టుదలచేత నిప్పటికే కాలహరణమైనది. ఈ మాఘముతో నిరువురకును ముడిపడ కున్నచో ముప్పు వాటిల్లకమానదు. ఏ ఎండ కాగొడుగు పట్టకతప్పదని నే నెంత మొత్తుకున్నను వినిపించుకొన్నారు కారు. ఈపాటి మార్పు మీ మన స్సున కిదివరకుఁగలిగినచో అల్లురతో నీపాటికి హాయిగా నుండెడివారము!

పురు:-వెర్రిదానా! అల్లురనెదవేమి? అల్లురుగారు-అధికార్లు కావు ననే-ఆడుబిడ్డలం గన్న యపరాధము క్రింద-సొగదీసి సంచుల కొలది జరిమానాలు వసూలు చేయుచున్నారు. కాకున్న కాళ్ళు కడిగి కన్యనిచ్చు వారి కీ కట్నముల దండన యెందులకు?

గీ. అప్పొసంగినవాఁడును, అల్లుఁ, డద్దె
యింటియజమానుఁడును, జీతమిచ్చువాఁడు!
కులవినోదయు, పన్నులు కూర్చువాఁడు
బుస్తె కట్టని మగలె పో పూరుషులకు!

అందును, నల్లుర బాధ యనుభవించిన వారికి గాని తెలియదు!

సీ. ముడుపులు పూర్తిగా ముట్టుదాఁకను బుస్తె
ముట్టక చేతులు ముడుచుకొనును
తరువాతఁబాన్పెక్కఁదాఁచఁ బెట్టినయట్లు
జిలుగు కోరికలకు సిద్ధపడును.
ఆవల గర్భాధాన మనినంతనే బిఱ్ఱ
బిగిసి లంచం బటఁబెట్టుమనును
అవి గాక పండుగ లరుదెంచినపుడెల్ల
తండ్రి తద్దినము చందాన దిగును
ఇన్నియుం బుచ్చుకొని, యెన్నఁడేని పిల్ల
నంపుమని ప్రార్థన మొనర్ప నదరిపడును.
అఁడుపడుచుల, నల్లుర నాటకత్తె
యల నెవండేని తనియింపఁ గలఁడె వసుధ!

పెక్కుమాటలేల :

గీ. అప్పిడినవాని, నధికారి నతిశయించి
యల్లురొందించు బాధల నెల్లఁ గాంచి,
అడలి, నిజముగా హరిహరు లంతవారు
కూతులం గంటయె మానుచున్నవారు.

భ్రమ:- మరల వెనుకటి దారినబడి మనసు పాడు చేసుకొనుచున్నారు.
అమ్మయ్యో! ఇదిగో ఒంటి గంట! రండు స్నానమునకు రండు.

పురు:- స్నానము క్షణములో ముగించెదను. వడ్డనకానిమ్మని వంట లక్కతోఁజెప్పుము. పెద్దమ్మాయి! పేరయ్యవచ్చినచోఁగూర్చుండుమను. (అని భ్రమరాంబతో లోనికేగును)

కాళిం:- చెల్లీ ! మనవారి మాటలన్నియు వింటివి కదా—నిజంగా

నీకేమి తోఁచుచున్నదే?

కమ:- (దివాలుక లేచి) చెప్పమనెదవా?

గీ. తండ్రులకుఁ గట్నబాధయుఁ దల్లులకు వి
యోగ బాధయు దమకు నింకొకరి యింటి
దాస్యబాధ దమకు దరిద్రంపు టాఁడు
పుట్టువే పుట్టరాదని బుద్ధి నెంతు.

కాళిం- (లేచి కౌఁగలించుకొని) బళి బళి! బాగుగా జెప్పితివే!

ఉ. కట్టగృహంబు లమ్ముకొని కట్నమునీయక పెండ్లి కాని యీ
కట్టడి వక్రకాలమునఁ గానల మధ్యము నందు బుట్టగాఁ
బుట్టగఁ జెల్లుఁగాని యొక భూపతి కేమియు నాఁడుబిడ్డగాఁ
బుట్టగరాదు! పుట్టునెడఁ బుట్టినయప్పుడె గిట్టఁగాదగున్.

కమ:- అక్కా! ఒక్క సందేహము.

గీ. వెండికాసెంబె పెనిమిటి వేశ్యః కటులె
కట్నములె భార్య లిప్పటి కర్కశులకు!
వేశ్య వెలయా లనంబడె వెల గ్రహించి
కట్నములచేత వెలమగల్ కారె వీరు?

కాళిం:- కాకేమి, కాని మనమిప్పుడు కావింపదగిన దేమియు లేదా?

కమ:- లేకేమి?

చ. తనువు లశాశ్వతంబులు గదా? క్షణభంగుర జీవితార్థమై
ధన మిడి, భర్తలం బడసి దాస్య మొనర్చుటకంటె: పెండ్లియే
యనువుగమానిపించుకొని హాయిగ రాట్నముత్రిప్పుకొంచు యో
గినులగతి స్మెలంగిన సుఖింపమె? తీఱదె తండ్రి దీక్షయున్.

కాళిం:- సెబాసునే చెల్లీ! వయసునకు జిన్నదానివైనను వరహాల కెత్తు కెత్తయిన మాట్లాడితివి! ఇదిగో,

గీ. నాదు ప్రతినంబు వినుము ప్రాణములనైన
విడిచెదంగాని యడిగిన విత్తమిచ్చి
వరుని గొనితెచ్చినట్టి వివాహమునకు
సమ్మతింప నా రాట్నము సాక్షిగాను.

కమ:- హుష్! ఊరకుండు యెవరో వచ్చుచున్నారు.

పేర:- (ప్రవేశించి) అమ్మా! పంతులుగారేంచేస్తున్నారు?

కాళిం:- మీ పేరు?

పేర:- నా పేరా? నాపేరొక విధంగా గడచి చచ్చిందా? చిన్నప్పుడు పేరడని, పేరగాడనీ, అనేవారు. కాస్త ముదిరిన తర్వాత, పేరన్ననీ, పేరయ్యనీ, అంటూ వచ్చేవారు. ఇప్పుడిప్పుడు పేరిశాస్త్రులనీ, పేరిబొట్లనీ, పేరావధాన్లని, పేరిచైన్లనీ అంటున్నారు. ఇక ముందేమంటారో ఈశ్వరునికే తెలియాలి.

కాళిం:- నాయనగారు భోజనము చేయుచున్నారు. అదిగో. ఆ కుర్చీపై గూరుచుండుడు.

పేర:- (కూర్చుండి) అయ్యో! నా యిల్లు బంగారము కానూ! అప్పటినుంచి యిప్పటిదాకా భోజనమేనా! బజార్లో పంతులుగారు కనుపించిన తర్వాత పంతా కొండయ్య యింట్లో బారసాల సంభావన పుచ్చుకొని, పీసెడు వంకాయలూ, విస్తళ్ళూ కొనుక్కుని, యిద్దరితో మాట్లాడి యింటికి బోయి స్నానంజేసి, సంధ్యావందనం చేసుకొని, జపంచేసుకొని దేవతార్చన చేసుకొని, భోజనం చేసి పొడుం చేసికొని, కాస్త మంచి శకునం కనపడేవరకూ గడపలో నుంచొని అయిసర బొజ్జా అని అప్పుడు చక్కా వచ్చాను. అయితే, అమ్మా! మీరిద్దరూ పురుషోత్తమరావు పంతులు గారి పుత్రిక లనుకుంటాను. అంతేనా? ఆఁ అదుగో! ఆ పోలికలే చెప్తున్నాయి! అయితే మీ పేర్లేమమ్మా?

కాళిం:- నా పేరు కాళింది. మా చెల్లి పేరు కమల.

పేర:- ఏం చదువుకుంటున్నారు?

కమ:- ఇదివరకు ఇంగ్లీషు, తెలుగు చదివేవారము. ఇప్పుడు హిందీ, సంస్కృతము చదువుచున్నాము.

పేర:- ఓ యబ్బో నా యిల్లు బంగారమైతే, నాలుగు భాషలే! అయితే ఆరుమోయన మేమయినా వాయిస్తారు?

కమ:- (నవ్వి) హార్మోనియము కావలయును! ఆఁ వాయించ గలము.

పేర:- అల్లిక, కుట్టూ—యివేమయినా చేతనవునా? ఇదిగో? ఈ బ్రాహ్మడేమి, యిన్ని ప్రశ్నలు అడుగుతున్నా డనుకుంటారేమో? ఈ రోజులలో పెళ్ళి కుమార్తెలకు కావలసిన లక్షణా లివ్వే. అందుకోసము అడుగుతున్నాను. అదుగో పంతులుగారు వస్తున్నారు. చిటికెడు పొడుం పీల్చుకొని సిద్ధంగా వుంటాను. (అని యట్లు చేయును)

పురు:- (ప్రవేశించి) ఏమి! పేరయ్యగా రెండలోనే వచ్చినారేఁ రవంతసేపు పండుకొని గాని రార నుకున్నాను. (అనుచు నింకొక కుర్చీలో గూరుచుండును.)

పేర:- సరిసరి యెంతమాట? తమ సెలవైనాక తక్షణం చేతులు కట్టుకొని వచ్చి వాల్తాను గాని, నిద్రపోతానా!

పురు:- అమ్మాయిలను జూచినారు గదా? వీరికే యిపుడు వివాహములు కావలసియున్నవి. అమ్మా! మీరిఁక భోజనమునకు వెళ్ళి మీ యమ్మ నొకసారి యిటు పంపుఁడు.

కాళి, కమ:- (లేచి నిష్క్రమింతురు)

పేర:- తమ గోత్రమేమిటి?

పురు:- కౌశిక గోత్రము

భ్రమ:- (ప్రవేశించును)

పురు:- ఇదుగో! ఈయనయే పేరయ్యగారు. పాపము, నా మాట మీఁద పడక కూడ మాని చక్కా వచ్చినారు.

భ్రమ:- సంబంధము లెవ్వియైన సానుకూలపడు నన్నారా?

పేర:- అమ్మా! సంబంధాల కేమి లోటు? కో అంటే కోటి సంబంధాలు! అయితే సరా. వేలు పెట్టి చూపడానికి వెల్తి లేని సంబంధం సందర్భపడాలి. ఏం బాబూ! ఏమంటారు?

పురు:- అంతేకాని, అసలు సంగతి మీతోఁ జెప్పలేదు. నేను వర శుల్కము దూష్యమనే వాదములోని వాఁడను. ఈ దురాచారము మాన్పింపవలెనని యిప్పటికి, ఐదేండ్ల నుండి పాటుపడుచున్న వాఁడను. ఈ కార

ణములచేత నీ పిల్లలకుఁ గట్నమిచ్చి పెండ్లి సేయుట కష్టములేక...

పేర :- తెలిసింది తెలిసింది. అక్కడి కాగి, ఒక్క మాటకు సమాధానము చెప్పండి? పదేళ్ళ నుండి పాటుపడుతున్నారు గదా యిప్పటి కొక్కరిచేత నయినా మానిపించగలిగారా? పట్టిది బాబూ! పట్టిది! మచ్చుకైనా మానేవారుండరు. వ్రేలెడు కుర్రవాడు కనబడితే వేలకు వేలు వేలం పాడేటప్పుడు వెర్రా, పిచ్చా, మానడానికి! ఇంత యెందుకూ? ఇదివఱకు కోర్టులో, ఇంత ఇన్కమ్టాక్సు యిస్తున్నామంటే ఘరానా. ఇప్పుడో-మా అబ్బాయి కింతకట్నం యిచ్చారంటే ఘరానా. ఈలాటి స్థితిలో యెవరు మానుతారు! వద్దు బాబూ వద్దు! ఈ పిచ్చి మాత్రం యిక విడిచిపెట్టండి. అమలాపురంలో, వెనక, అయ్యగారి అంబయ్యగారిల్లాగె కట్న మివ్వనని భీష్మించి కూర్చుండేసరికి కన్య సమర్తాడి వూరుకుంది! ఆ పాటున, నలుగురూ ఆంక్షచెయ్యడం, ఆ బ్రాహ్మణుడా పిల్లనో బ్రహ్మసమాజిగాడి కంట గట్టడం, ఆ పిల్ల కాపరానికి వెళ్ళి అయిదుగురు బిడ్డలను కనడం యిన్ని జరిగాయి !

పుర:- అట్లయిన, గట్నములేని సంబంధము కన్నొడుచుకున్నను లభించదన్న మాటయేనా ?

పేర :- లక్ష యేళ్ళు తపస్సుచేసినా లభించదు. ఎవరైనా తేగలిగితే కుండనాలు పెట్టుకుందామని కుట్లు పెంచుకుంటు వున్న నా చెవులు కుదుళ్ళలోకి తెగగోయించుకపోతాను! ఇంతెందుకు పెద్ద పెద్ద లిప్పుడు బేరాలతో పనిలేకుండా ఇల్ల మీద రేట్లు రాయించి, బయట తగిలిస్తున్నారు. వెంగలేటివారు వేయిన్నూటపదహార్లు, రెటూరివారు రెండువేలు, ముంజులూరివారు మూడువేలు, నందరాజు వారు నాలుగువేలు, అయ్యంకివారు అయిదువేలు, చింతలూరివారి చిన్నవాడు తూగినన్ని రూపాయలు, యెవరి మట్టుకు వారీవిధంగా యేర్పాట్లు చేసుకొని కూర్చున్నారు. ముందు ముందు చీట్ల మీద రేట్లువ్రాసి షాపులలో వస్తువుల కంటించినట్లు పెళ్ళికుమాళ్ళ ముఖాలకు అంటిస్తారని గూడా అనుకుంటాను !

పుర:- రామరామా! రానురాను దేశ మే స్థితిలోనికి వచ్చినది?

పేర:- అయ్యా ! మీరు దీనికే ఆశ్చర్యపడుతున్నారు, కట్నాల

తమాషా కమ్మవారిలో చూడాలి? వారిలో నల్ల బంగారమే కాని తెల్ల రూపాయలు పనికేరావు. ఆ నల్లబంగారం కూడా యకరాల లెక్క పోయి పుట్ల లెక్కలోనికి దిగింది. పది పుట్ల భూమికి వచ్చినవాడు పనికిమాలినవాడే? ఈ మధ్యనో యాత మొద్దుకు ఇద్దరు భార్యలుండగా ఇరవై పుట్ల భూమితో ఇంకో పిల్లను కట్టబెట్టారు? నాలుగురోజుల క్రిందట నలభయ్యారేళ్ళ నలుగురి బిడ్డల నాలుగో పెళ్ళి పెళ్ళికొడుకుకు నలభై పుట్ల యీనాంభూమి, నలభై వెయ్యిన్నూట పదహార్ల రొక్కమూ, నలభై తులాల గోపతాడు, నాలుగుతులాల చుట్లూ, నాలుగుజతల యెడ్లూ, రెండు బళ్ళూ పదివందల గజాల పాటిమన్నూ, ముప్పయిబళ్ళ ముక్కిన పెంటా, సమర్పిస్తూ వియ్యపురాలికి అరుపాడిగేదెలూ, వియ్యంకుడి కైదుబళ్ళ గోగునార యిస్తె, పుస్తె ముడేశాడు విన్నారా!

గీ. బ్రాహ్మణులయింటఁ దొలుఁదొల్తఁ బ్రభవమొంది
కోమటింటను ముద్దులు గొనుచుఁ బెరిగి
కమ్మవారింట పెళ్ళునఁ గాఁపురంబు
సేయుచున్నది కట్నంపుఁజేడె నేఁడు,

భ్రమ—సరికాని సంబంధము లేమున్నదో చెప్పినారు కారు.

పేర :- అలాగైతే, సంబంధాల విషయంలో మీ యభిప్రాయము ఏమిటో సంగ్రహముగా ముందు సెలవివ్వండి. మీకు కావలసింది, చదువా? చక్కదనమా? సంపత్తా? సంప్రదాయమా? లేక చదువు, సంప్రదాయమూ, సంప్రదాయమూ, సంపత్తూ; సంపత్తూ, చక్కదనమూ; చక్కదనమూ: చదువూ: చదువూ, సంపత్తూ ఈ విధంగా వుండవలెనా?

పురు :- నాకేమో చదువు, సంప్రదాయము వీనిపై నున్నది. దానికేమో చక్కదనము, సంపత్తు వీనిపై నున్నది. మీరు మా యుభయుల కోరికలు తీరునట్లు చూడవలెను.

పేర :- అంటే నాలుగూ వున్నవాడు కావాలన్నమాట. కాని, నాలుగూ వున్నవాణ్ణి నేనుగాక సరిగదా నన్ను పుట్టించిన బ్రహ్మదేవుడు కూడా తేలేడు, ఏమంటారా? వారాలు చేసుకొన్న వాజెమ్మకుగాని చదువబ్బదు. రువొల్లని పీనాసికికాని భాగ్యం పట్టదు! ఇట్టి స్థితిలో నాలుగూ వున్నవాణ్ని తేవడానికి నా తరమా, నా యబ్బతరమా?

భ్రమ:- అట్లయినచో, నేటి స్థితినిబట్టి, నేను గోరినవే ముఖ్యంగాఁ జూడదగినవి ఏమనెదరు? బియ్యే ప్యాసయినవా రుద్యోగములు లేక, ప్లీడరు గుమాస్తాపనికోసము పిచ్చెత్తినట్లు తిరుగుచున్నారు! ప్లీడర్లు బోణీ లేక, వీసెడు వంకాయల ఫీజునకు విలేజి కోర్టులకు సిద్ధపడుచున్నారు. చదువుల సంగతి యీ సరణిగా నున్నది. ఇఁక సంప్రదాయము సంగతి చూచినచో అయిన కుటుంబము లడుగునఁబడినవి. కాని కుటుంబములు గణనకు వచ్చినవి! ఇంత యేల! నిత్యము మనము చూచు నిర్భాగ్యులలోఁ జాలమంది సంప్రదాయ కుటుంబములలో జన్మించిన వారే! ఏమి లాభము! సంపత్తులేని కులీనుఁడు శ్మశానములోని తులసి మొక్క వంటివాఁడు! కాబట్టి ఈ దినములలో నింత కలిగిన సంబంధమే యాలోచింపఁదగును.

పేర :- అమ్మా! మీ మాటలు నాకు అరటి పండొలిచి చేతిలో పెట్టినట్లున్నాయి. కాని కలిగినవారి కోసం చూస్తే కట్నం కాస్త హెచ్చు కాకమానదే! నిన్నగాక మొన్న, నీళ్ళ కావిళ్ళ నీలకంఠం గాడి కొడుకుకు వెయ్యిన్నూటపదహార్లు రొక్కం, వెండి కంచం, వెండి చెంబులు, బంగారం బరువు, పట్టు తాబితా, రిస్టువాచీ, సిగరెట్ల కేసూ ఇంకా ఏమిటో వాటిపేర్లు నాకు తిన్నగా రావు, బ్యాట్టట, సెల్ఫు షేవింగు రేజరట, ప్యాకెట్టు టాయిలెట్టు బాక్సట, వ్యాసలైను సీసా అట, వల్లకాడట, యిన్నిస్తే పుస్తె ముడేశాడు. గొప్పవారిమాట చెప్పవలసిందే ముంది?

భ్రమ :- సరే కానిండు, సమయమును బట్టి నడువక తప్పునా?

పేర:- అయితే యింకేమి! అపాటి ధైర్యమిచ్చారంటే కొండమీని కోతిని తేగలను. ఇదిగో ఇప్పుడు చెపుతాను వినండి. మంత్రిప్రగడ మాధవరావుగారి పిల్లవాడికి మాన్యాలమీద రెండువేలు వస్తాయి. మాటాడమంటారా?

భ్రమ :- ఆ పిల్లవానిది అడ్డతలండీ!

పేర :- అయితే పోనివ్వండి. పచ్చమట్ల బాపిరాజుగారి పిల్లవాడికి పన్నెండు వందలు వస్తాయి. ప్రేమరీ పేసయ్యాడు. కుదర్చనా?

భ్రమ :- రంగు.

పేర:- రంగుకేమీ రాజా రంగు. అంత యెఱుపూ కాదు, అంత నలుపూకాదు, చక్కని చామనచాయ.

భ్రమ :- చామనచాయ యిప్పటివారికి సరిపడుట లేదండి.

పేర:- అలాగైతే నాదెగ్గిరనారి పిల్ల వాడు మీ నాకాని కాగుతాడు. పచ్చిగా పనసపండు! నలుగు రన్నదమ్ములు. నలుగురకూ నాలుగైదు వందలు రెండువేలు వస్తాయి.

భ్రమ :- అబ్బే, ఐనువంద లీ దినములలో నొక యాదాయమా?

పేర:- ఐతే, ముంజులూరి ముత్తయ్యగారి దత్తపుత్రుడికి మూడు వేలు వస్తాయి. ముఖం చంద్రబింబాన్ని మించి వుంటుంది.

భ్రమ :- అవునుగాని అతఁడు మా పిల్ల కంటె ఆరంగుళాలు పొట్టి!

పురు :- ఓసీ, నీ యెంచుబడి యేట గలియా! ఈ విధముగా నెంచుటకు మొదలు పెట్టినచో లోపము లేనివాడు లోకములో నుండునా?

పేర :- బాబూ! యింకా యేం చూశారు! ఇతర్లతో పోల్చిచూస్తే యీ యమ్మ చాలా మెరుగు. ఒక్కొక్క ఇల్లాలి సంగతి చూస్తే వొళ్ళు మండిపోతుంది! సర్వవిధాల నచ్చిన సంబంధమేమైనా వచ్చి యడిగినప్పుడు వంకలు పెట్టడం, మించిపోయాక మిడకడం.

భ్రమ:- అయ్యో! ఆడపిల్ల లకుఁ గావలసిన హంగులు మగవారి కేమి తెలియును? ఆఁడుబిడ్డ పెండ్లి యన మగవారికి అప్పుడీర్చుకొనుటఁ యని యభిప్రాయము !

పేర:- అవునమ్మా అవును. అవశ్యం ఆలోచించవలసిందే కాని మీ మాటనుబట్టి, మీ మనసులో ఏదో సంబంధం తగిలే వున్నట్టు తట్టుతోంది. అట్టే మమ్మల్ని చంపక, అదేమో చెప్పితిరా బ్రతుకుతాం.

భ్రమ:- (నవ్వి) చెప్పమనెదరా? సింగరాజు లింగరాజుగారి దత్తపుత్రుడు, నా బుద్ధికి రవంత నచ్చినాడు.

పురు :- ఆ పిల్లవాఁడాలోచింప దగినవాఁడే. స్కూలు ఫయినలు చదువుచున్నాఁడు. చూపరి, నడతగూడ నాణెమయినదే యని విన్నాను. కాని, రెండు సందేహము లున్నవి. మొదటిది యేఁబదియవ వడితో మూఁడవ పెండ్లి చేసికొన్న మూఢునితో సంబంధము చేయనాయని, రెండ

వదిపిల్లవానికిఁ పదునారేండ్లకు బయినుండవు. వరహీన మగునేమోయని.

పేర:- మీ రెండుసందేహాలూ మిథ్యాయించ తగ్గవే, ఏమంటారా? దీపం పెట్టే దిక్కు లేనప్పుడు ఏ గడ్డి కరవక యేం చేస్తారు? ఇక వర హీనం మాటా? ఆ పిల్లవాడికీ, మన పెద్దమ్మాయికి ఒకటి కాదు రెండా కాదు మూడేళ్ళు తేడా! ఇంకా వరహీనమేమిటి? కోమట్లలో యిప్పుడు కొంచెం పెద్దపిల్లలను కూడా చేస్తున్నారు. అంతగా వాదస్తులెవరైనావుంటే అబ్బాయి కధికమాసాలు చేర్చి అమ్మాయికి తగ్గించి సరిపుచ్చుకొంటు న్నారు. అందుకూ వప్పరనితోస్తే జాతకాలు ఫిరాయిస్తున్నారు. ఇన్నెం దుకూ?

గీ. వయసుతోడనే బనిలేదు వానితోడ
నంతకన్నను బనికల్గ దరయ నొల్ల
రింటి పేరును: గోత్ర, మింకేదియుఁ గూడ;
ఆస్తియొక్కటియే యిపు డన్నిటికిని.

భ్రమ:- అన్నట్లు మఱచినాను వారికిని, నాకును మూడేండ్లే తేడా!

పురు:- అవునుగదా? యింకేమీ?

పురు:— సరే యిక నా సందేహములమాట విడచిపెట్టి, ఆ సంబం ధము పెద్దమ్మాయి కాలోచింపుఁడు.

పేర:- ఆలోచించడాని కభ్యంతర మేమియులేదు. కాని లింగరాజు గారు మాత్రం లిక్కికి లక్కనే మనిషి కట్నం దగ్గర కంఠానికి ముడి వుండదు. సరే, సర్వవిధాల ప్రయత్నంచేద్దాము. అయితే అమ్మాయి లిద్దరికీ బాలతొడుగు లేపాటి వుంటాయి!

పురు:- వేయేసి రూపాయలకు వెలితియుండదు. అవికాక వారి బారసాలలనాఁడు వారి మాతామహుఁడు వారికి వ్రాసి యిచ్చిన పదేసి యెకరముల భూములవల్లను నైదేసి వందలు వచ్చుచున్నవి.

పేర:- అలాగైతే యిఁక నంత భయపడవలసిన పనిలేదు. అమ్మ గారన్నట్లు పెద్దమ్మాయి సంగతి ముందు తేల్చుకుని ఆ వెనుక చిన్న మ్మాయి సంగతి ఆలోచింతాము. (అని లేచును)

పురు:- మరల మీ దర్శన మెప్పుడు?

పేర:- రేపు దుర్ముహూర్తం పోగానే లింగరాజుగారి ఇంటికి వెళ్ళి సంగతి సందర్భాలు చూచుకొని సాయంకాలంలోగా వస్తాను.

భ్రమ:- యేమో, యేమి చేసికొని వచ్చేదరో? పిల్లలు వివాహము భారము మీది. మిమ్ములను సంతోషపెట్టు భారము మాది!

పేర:- అమ్మా! ఆ మాట మీరు వేరే సెలవివ్వాలా! కార్యమయిందాకా కన్ను మూస్తే ఇది గాయిత్రి కాదు? శలవు!

(తెరపడును)

ఇది ప్రథమాంకము

—o—

ద్వితీయాంకము

(ప్రదేశము : లింగరాజుగారి వ్యాపారపు గది)

లింగ:- (ఆయాసముతోఁ బ్రవేశించి) ఇస్! అబ్బా!

చ. పిడుఁకలు వంటకట్టెలను, బీటలు, చేటలు, లెక్కచూచి, యే
ర్పడ, బొయిబొగ్గులం గొలిచి, పాదుల కాయల నెంచి, దూడ పా
ల్విడిచిన దాఁక నిల్వఁబడి; వాకిటి కొబ్బరిచెట్ల కాయలన్
గడనమొనర్చి; యిప్పటికిఁ గాఁడఁ గల్గితి నింటి లోపలన్.

ఇకఁ స్తిమితముగా గూరుచుండి, యీఁ పూఁటతో గాలదోషము పట్టు కాగితము లేమయినఁ గలవేమో చూడవలెను. వాయిదా నోటీసులు వ్రాయవలెను. ఈ పూట కోర్టులో హియరింగు లేమున్నవో చూడవలెను. దేనిపట్ల రవంత యేమఱినను దెబ్బ తినక తప్పదు! పనివచ్చినచో ప్రాణములనైనఁ బోనీయఁదగునుగాని పయిన సొమ్ము పోనీయఁగూడదు! ప్రాణములలో నేమున్నది? గాలియేగా! పైకమట్టిదా! ప్రపంచమంతయు దానిలో నున్నది కనుకనే, "ధనమూల మిదం జగ"త్తన్నాడు.

సీ. కులలోప, గుణలోపములు మాపుకొనుటకు
ధనము ప్రధాన సాధనము నేడు
వరకట్నములకు సభాకట్నములకును
ధనము ప్రధాన సాధనము నేఁడు
మున్సిపల్, లోకలు బోర్డన్ యెన్నికలకు
ధనము ప్రధాన సాధనము నేఁడు
మడులు మాన్యములుఁ గొంపలు వచ్చిపడుటకు
ధనము ప్రధాన సాధనము నేఁడు
అట్టి ధనమును దన పాడు పొట్టకొఱకో,
బట్ట కొఱకో; లంక పొగాకు చుట్టకొఱకో,

వెనుక ముందులు చూడక వెచ్చపెట్టు
నిజముగవారు మతిలేని వారు కారె!
భాగ్యము పెరుగుటకు బహుప్రజ్ఞలు కావలెను.
సీ. తలలు మాటిబియొ, మూటలు విప్పియె, కొల్ల
గొట్టియో సిరి కూడబెట్టవలయు
ఆస్తులనెల్ల భార్యల పేర వ్రాయించి
మాయ దివాలాలు తీయవలయు
వడ్డికి వడ్డి, యా వడ్డికిఁ బైవడ్డి
పెంచి గిజా యనిపించవలయు
రాత్రులు మేల్కొని రామకీర్తనలను
పాడుచు గొంపఁ గాపాడవలయు
అప్పుగొన్నవారి యాస్తులెల్లను వచ్చి
పడెడుదనుక నిద్ర విడుపవలయు
దొంగ లెక్కలుంచి దొరల కంటను దుమ్ము
గొట్టి పన్ను మాన్పుకొనగవలయు,
పెక్కు మాటలేల...
సీ. పరువుఁ బ్రతిష్ఠయుఁ బాటింపగారాదు
పొట్టికేమియుఁ గర్చుపెట్టరాదు
బంధువు లేతేరఁ బల్కరింపరాదు
వేఱు విస్తరి యింట వేయరాదు
కష్టజీవులఁజూచి కటకటపడరాదు
త్రిప్పక తన యప్పు తీర్చరాదు
దారకేనియు పెట్టె తాళ మీయగరాదు
వేయి కల్లలకేని వెఱవరాదు
ఇన్ని విధముల గాపాడకున్న ధనము
దక్కనేరదు; ధనముచేఁ దక్క నింటఁ
బె త్తనము లేదు! బయటను పేరు లేదు!
పలుకుబడి లేదు! బ్రతికిన ఫలము లేదు

వెఱ్ఱివెంకటాయలు? పత్రికలనియుఁ బరిశోధని లనియుఁ సంఘ సంస్కా-
రణము లనియు, సహాయ నిరాకరణము లనియు, స్వరాజ్యమనియు,
చుట్టు బండలనియు, పనిలేని గొడవలు పయిఁబెట్టుకొందురు. కాని వడ్డీలు
పెరుగుటకు వాటమైన సాధన మొక్కరును జూడరు!

ఆ. కలుపు పెరుగునట్లు: కంచెలుం బాదులు
పెరుగునట్లు నాచు పెరుఁగునట్లు:
వడ్డి పెరిఁగెనేని వహ్వా! యదృష్టము
పండె ననఁగ నిండ్లు నిండిపోవె!

వాస్తవమునకు వడ్డికి సాటియైనది మరియున్నదా?

ఆ. నిజముకన్న గల్లఁ నిశ్చయంబుగఁ దీపి
బిడ్డకన్న ముండ బిడ్డ తీపి
కరము, వేతనంబు కన్న లంచము తీపి
వసుధ, మొదలుకన్న వడ్డి తీపి!

[అంతలో స్మృతినభినయించి] అన్నన్నా యెన్నడునులేని దీపూట ప్రాతఃకాల లక్ష్మిప్రార్థనము మాట పరాకుపడితిని గదా! [అని చెంపలు వైచుకొని, యినుపపెట్టె యెదుట నిలిచి చేతులు జోడించి]

దండకము : భగవతీ! భాగ్యలక్ష్మి! ప్రణామంబు! నీ దాస దాసానుదాసుండ. నీ పాదముక్తుండ, నీ దివ్యరూపంబె నిత్యంబుగా వింతు నీ దివ్య నామంబె నిక్కంబుగా నిద్రలోఁగూడఁ జింతంతు, నాదిక్కు, నా మ్రొక్కు, నా యండ నా దండ నీవే సుమా! భార్యయుం, గీర్యయుం, బిడ్డలుంగిడ్డలు, దేవుడుం, గీవుడున్, మోక్షముం, గీక్షమున్ సర్వమున్నీవె సత్యంబు! నీకై నిరాహారినై యుందు, నీకైనిశల్ నిద్రమాన్కొందు నీకై శరీరాభిమానంబు వర్జింతు, నీకై యసత్య ప్రమాణంబు లెన్నేనియు గావింతు నీ యాన! ఈ పెట్టెయే నీ పవిత్రాలయం, నేనె నీ యర్చకుండన్, యదార్థంబుగా నాదు ప్రాణంబులెనీదు పూజాసుమంబుల్. శరీరంబె నైవేద్య కుంభంబు, నాయింటనేయుండి, నా పూజలం గొంచునే యింటికే నంపినంబోయి యా యిల్లు మట్టంబు గావించి నా ఇంటికిం దెచ్చినాకిచ్చుచేఁ చుండంగదే కన్నతల్లీ! నమస్తే నమస్తే నమః

ఘంట:- [ప్రవేశించి] బాబూ! పది కావచ్చింది. వంట సామా నిస్తారా!

లింగ:- నీ వంట వల్లకాడుగాను! నీకింత తిండియేవ యేమిరా! ధనుర్మాసము దప్పళముని కెవరైన పిలుతురేమో కాసింతసేపు కనిపెట్టఁ గూడదా?

ఘంట :- సరే, మీ యిష్టం. రాత్తిరి పద్దులు రాసుకుంటారా?

లింగ :- అదిగో ఆ మాటన్నావు సరి! (అని దసుకు పెట్టె దగ్గఱఁ గూరుచుండి పద్దుల పుస్తకము పైకిఁదీసి) ఏది చెప్పు, బియ్యె మెన్ని?

ఘంట :- మణిమెడు తక్కువ మానెడు.

లింగ :- [వ్రాయుచు] వంటకట్టెలు?

ఘంట :- మూడు.

లింగ :- పిడకలు?

ఘంట :- రెండు.

లింగ :- నిప్పు పుల్ల!

ఘంట :- నిన్న మధ్యాహ్నము చీల్చిన పుల్లలో నిలవ బాపతు సగము.

లింగ :- ఉప్పు?

ఘంట :- వుద్దరిణేడు,

లింగ :- చింతపండు?

ఘంట :- నిన్న మధ్యాహ్నము పులుసుకోసము పిసగ్గా నిల్వవున్న తుక్కు.

లింగ :- ఉప్పేమి చేసినావు!

ఘంట :- వుంచా నీ పూటకు.

లింగ :- మిరపకాయలు?

ఘంట :- మూడు.

లింగ :- మాగాయ?

ఘంట :- అమ్మగారి కోటెంకా, అబ్బాయిగారికో ముక్కాను.

లింగ : [illegible]

ఘంట :- గరిటెడు మీకు, అరగరిటెడు అబ్బాయిగారికి పోశాను.

లింగ :- మిగిలిందీ?

ఘంట :- చద్దన్నాల్లో సరిపెట్టాను.

లింగ :- నీవో?

ఘంట :- బజార్లోంచి బంగాళాదుంపల కూర తెచ్చుకున్నాను.

లింగ :- ఏడిచినట్లే యున్నది. కాని యెన్నడు నీలాంటి వెధ నింటికి గొనిరాకు! ఆ వాసన తగిలి అబ్బాయికూడా పాడుకాఁగలడు. తెలిసినదా! ఇదిగో కరివేపచెట్టు మీఁద కాకి గూడు పెట్టినది. ఇంతలో డొంకినితో దానిని బద్దదోసి ఈ పూఁట పొయిలోనికి సిద్ధము చేసికో, కరివేపమండ రాలినచో కడుపు చీల్చెదను సుమా!

ఘంట :- రామరామా! పక్షిగూడు పడగొట్టడం పాపం కదండీ?

లింగ :- పాపమేమిటి నీ బొంద! ఖరసంవత్సరంలో మా ఇంటి వంటంతయు కాకిగూళ్ళతోనే వెళ్ళిపోయింది

ఘంట :- ఇదేమిటండీ! యింత ఘోర మెక్కడా చూళ్ళేదు. ఇల్లాంటి పనులు మాత్రం ఇంకెప్పుడూ చెప్పకండే [నిష్క్రమించును]

లింగ :- దరిద్రపుఁ గుంకలకు ధర్మపన్నములు మెండు. ఆ వాజె వన్నెల విసనకర్ర యిగుటంబట్టి వంటకుంకలను బెట్టుకొనక వల్ల పడ కున్నది. కుర్రవానికి వివాహమై, యా కుర్రది కాఁపురమునకు వచ్చు వఱకు నీకుంక కుద్వాసన చెప్పుటకు వీలులేదు.

బస :- (ప్రవేశించి) నాన్నా! అమ్మకు మొన్న బండికట్టినవాడు అద్దెకొఱకు వచ్చి యఱచుచున్నాడు.

లింగ :- ఇంటిలో లేరని చెప్పకపోతివా? బాబూ! పదునారేండ్లు పయింవడినవి ఇప్పటికైనా నీకిపాటి యూహ పుట్టలేదేమిరా?

బస :- ఉండఁగా లేరని చెప్పుట కూహ యెందులకు నాన్నా? అబద్ధమాడఁగూడదని మా టీచర్లనేక పర్యాయములు చెప్పినారు.

లింగ :- మీ టీచర్లిట్టి మెట్టవేదాంతములు కూడఁజెప్పుచున్నారుగా సరే, యిఁకనేమి చదువు సంగతి చక్కగానే యున్నది!

బస :- ఫవుంటెను పెన్నుకుఁ బయిక మిచ్చెదవా?

లింగ :- బాబూ! కానీకిఁ గలము వచ్చుచుండగా ఫవుంటెను పెన్ను యెందులకు పనిలేక? అంతగా మనసైనచో అలుక పాన్పుమీఁద అన్నిటితోపాటు ఫవుంటెను పెన్నుగూడ నత్తవారినడిగి పుచ్చుకొన వచ్చును. గాని బండివానికేదో చెప్పి పంపివేయుడు.

బస :- అదిమాత్రము నావల్ల గాదు! [అని నిష్క్రమించును]

లింగ :- ఆ వన్నెల విసనకర్ర సంగతి యీ విధముగా నున్నది. యీ పాడుకట్టె సంగతి యీ విధముగా నున్నది! పాడు టీచర్లు కుఱ్ఱవాండ్రను పాడుచేయుచున్నారు! పయిగా కలము క్రిందను, కాగితముల క్రిందను ఖర్చుపడుచున్న డబ్బునకు లెక్కయే లేదు! కనుకనే గాంధీ మహాత్ముడు చదువులకు స్వస్తి చెప్పింపుమన్నాడు. వివాహమగువఱకును వీనిని మాన్పించుటకు వీలులేక చూచుచున్నాను. ఇదేమి ప్రారబ్ధమో యీ దినములలో కాలేజీకి వెళ్ళుచున్న వానికిగాని కట్నములబిగువు లేకున్నది! ఈ కసుగాయ కుంకను కట్నములకొఱకు గాకఁగతుల కొఱకుఁ బెంచుచున్నా నా! నా మొదటి పెండ్లికి రెండువేలుఁ, రెండవపెండ్లికి నాల్గువేలు, మూడవ పెండ్లి కెనిమిదివేలు, మొత్తము పదునాలుగువేలు వచ్చినవి. ఈ కుంకకుఁ గూడ నిదేవిధముగా వచ్చునని యాశ. ఇదేమి పాపమో ఇంతవఱకు వేయి, రెండు వేలు ఇచ్చెదమనెడివారే కాని, పట్టుమని పదివేలీయగలవా రగపడలేదు! నియోగ మంతకంతకు నిర్భాగ్య యోగమయి పోవుచున్నది! ఎవరు చెప్పమా వచ్చుచున్నది! చవటకుంక తలుపు దీసి చక్కబోయినాఁడు కావలయును! బండివాడో, పరదేశ బ్రాహ్మణుడో యైయుండును. కానిమ్ము గది తలుపుమూసి యేమియు నెత్తుకొనిపోకుండ కంతలగుండాఁ గనిపెట్టుదను, [అని లేచును]

పేర :- [అంతలో బ్రవేశించి] మహదైశ్వర్యాభివృద్ధిరస్తు! మనోవాంఛాఫల సిద్ధిరస్తు! రాజ ద్వారే, రాజ భవనే, రాజ సభే, రాజ సమీపే, సర్వదా దిగ్విజయమస్తు!

లింగ :- ఏమీ! పేరయ్యయ్యే! ఏదో పనిమీద వచ్చినట్లున్నారే.

పేర :- ప్రభువుల వద్దకు పనిలేన్దే రాగలమా?

లింగ :- అట్లయినఁ గూర్చుండి అదేమో చెప్పుము. (అని కూర్చుండును.)

పేర :- (కూర్చుండి తనలో) ఈ ముండాకొడుకుదగ్గర ముక్కు సూటిగా పోగూడదు. ముందీదారి త్రొక్కుతాను. (పయికి) చెప్పుట కేముంది? ఫష్టుకళాసు పద్దుమీద బదులు కావలసి వచ్చాను.

లింగ:- ఎవరికి? ఏపాటి?

పేర:- యెవరికో తర్వాత చెపుతాను. బదులు కావలసింది పాతిక వేలు.

లింగ:- వడ్డీ యేమయిన వాటముగ వేయించగలవా?

పేర:- వడ్డీకేం? వాజబీ ప్రకారం పుచ్చుకోండి.

లింగ:- వడ్డీకి వాజబీ యేమిటి! ఆసామిని బట్టియు, ఆస్తిని బట్టియు. అవసరమును బట్టియు నుండును. నీతోడు. రూపాయ తొమ్మి దణాలకాని చొప్పున నిన్ననే ముప్పది వేలిచ్చాను.

పేర:- అయితే కుదరదు. ముప్పావలా అంటే ముద్దుపెట్టుకొని ఇచ్చేవారున్నారు. సెలవు! (అని లేవబోవును)

లింగ:- ఆగు! ఆగు! అంత తొందర పడకూడదు. ఆస్తి మాట చెప్పవేమి?

పేర:- ఆస్తికేం! అవల్ రకం ఆస్తి. అరవై యెకరాల సర్వ దుంబాలా యీనాం భూమి. పది యెకరాల బత్తానారింజతోట, ఆరెకరాల అంటు మామిడితోట, తొమ్మిదెకరాల తుమ్మబీడు, ఇదే ప్రథమ తనఖా, ఇక విడిపించుకునేది కూడా కాదు.

లింగ:- సరే ముప్పావలార్ధణా చొప్పున పయిసలు చేయుము.

పేర:- ముప్పావలార్ధణా లేదు. గీవళార్ధణా లేదు. నా కమీషను దగ్గిర సలుపులు పట్టకపోతే రూపాయివరకూ రుద్దుతాను.

లింగ:- నీ కమీషను మాట కేమి? నీ వెక్కడికిఁ బోదువు? నే నెక్కడికిఁ బోదును? ముందు కాగితములు తెమ్ము, చూతము.

పేర:- కాగితాల కేం? రేపీపాటికి కాకిచేత రప్పిస్తాను. (అని లేవఁ బోయి, మరలఁ జతికిలబడి) అన్నట్టు అడగడం మరచాను. అబ్బాయికి

యింకా వివాహము చేశారు కాదు. సమయము కాకనా? సంబంధాలు రాకనా?

లింగ:- సంబంధాలు రాకేమి! సమాధానము చెప్పలేక చచ్చిపోవు చున్నాను. అన్నట్లు నీవు పెండ్లిండ్ల బేరగాడవు గదా! నీ యెరుకలో జక్కని సంబంధ మేదయిన నున్నదా?

పేర:- చక్కందో, గిక్కందో నాకు తెలియదు, మీకు సానుకూల పడుతుందో లేదో అంతకంటే తెలియదు. పడితే మాత్రం బంగారాని కెత్తు కెత్తయిన సంబంధం వొకటి సర్వసిద్ధంగా వుంది.

లింగ:- ఎవరు వారు?

పేర:- పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారికి యిద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తెకు పదమూడవయేడు. పక్వానికి వచ్చిన పండు. ముఖం ముద్దురోడు తూంటూంది. కళ్ళచూస్తే కడుపు నిండ వల సిందే. చక్కగా చదువుతుంది.

లింగ:- సరేకాని కన్యకు గావలసిన చదువు, చక్కదనమువిగావు.

గీ. తిండి యొకప్రక్క వెలితిగాఁ దినవలయు,
చెప్పకయె యింటిపనులెల్లఁ జేయవలయు
ఊరికే కొట్టినను పడియుండవలయు,
ఇట్టి కన్యను వెతకి గ్రహింపవలయు.

పేర:- అలాగైతే మీరు చెప్పిన లక్షణాలన్నీ అచ్చంగా ఆ పిల్ల వద్దనే ఉన్నాయి. మూడు మెతుకుల కంటె ముట్టదు. లేచింది మొదలు పరుండే వరకూ లేడిపిల్లలాగు పని చేస్తుంది.

లింగ:- ఇంతకును కట్నమేపాటి యీయగలరు?

పేర:- అదిగో అక్కడే వుంది తంటా! ఆ పిల్లలిద్దరికి వంటిని వెయ్యేసి రూపాయలు బాలతొడుగు లున్నాయి. అయిదేసి వందలు వచ్చే మాతామహు డిచ్చిన మాన్యాలున్నాయి. అందువల్ల కట్నంలేకుండా చేసు కుంటామని కావలసినంత మంది కాళ్ళకాడికి వచ్చి తిరిగి పోతున్నారు.

లింగ:- అయితే పేరయ్యా! ఆ పిల్ల యొంటిని అచ్చంగా బంగారపు తొడుగుండుఁగాక. అయవది పుట్ల మాన్యముండుగాక. గౌరవము కోరువాఁ డెవ్వఁడైనఁ గట్నంలేని సంబంధముల కిష్టపడునా!

పేర:- అలాగైతే, గౌరవార్ధమని మెడలు విరిచి కాస్తోకూస్తో ఇచ్చేలాగు చూడాలి. ఏ మాత్రం అనమంటారు?

లింగ:- అసలు ఆయనకున్న ఆస్తియేమో చెప్పినావు కావు.

పేర:- ఆయనకున్న ఆస్తి యేమిటో అందరూ యెఱిగినదే. పది సంవత్సరాలు రెవిన్యూ యినిసిపేటరు పనిచేశారన్న మాటే కాని పయిసా పుచ్చుకొని యెరుగరు. మధ్య నానుకోపరేషాన్ని నమ్మి ఆ వుద్యోగానికి కూడా హస్తోదకాలిచ్చి హాయిగా రాట్నం ముందు పెట్టుకొని కూర్చున్నాడు. అయితే పిత్రీయం బాపతు పదియెకరాల భూముంది. పన్నులు పోగా పది యెకరాల వల్లా పదిపదులు నూరుబస్తాలు వస్తాయి. వారు కాపురం వున్న మేడ వుంది.

లింగ:- అట్లయినచో, నటువంటి పెద్ద మనుష్యులను మనమంత యిబ్బంది పెట్టుట న్యాయము కాదు, ఆ మేడ వారుంచుకొని ఆ పదియెకరముల పొలమును మనకు వ్రాసి యిచ్చి అందము కొఱకు వేయినూటపదహార్లు రొక్కము, వెండి చెంబు, వెండి కంచము, వెండి పావకోళ్ళు, ఐదు దినముల నైదు పట్టుతాబితాలు ఇటువంటివి మాత్రమిమ్మనుము. నా బారీతనము బాగుగా నున్నదా?

పేర:- బాగేమిటి బంగారు తునక లాగుంది! కాకపోతే కార్యమయిన మర్నాటినుంచి వారు అన్నమో రామచంద్రాయని ఆ వీధినీ, ఈ వీధినీ అడుక్కు తినవలసి మాత్రం వుంటుంది! బాబూ! మీ బేరము కుదిరే బేరము కాదు. సెలవు పుచ్చుకుంటా (అని లేవఁబోవును)

లింగ:- (రెక్క పట్టుకొని) ఆగు, ఆగఁవోయ్! అన్నిటిలోనొక్కటే తొందరా! నీ యభిప్రాయ మేమిటి?

పేర:- వేయినూటపదహార్ల కయితే వెంటనే కుదురుస్తాను. అంతకు పయినైతే ఆ సంబంధం మీకు దక్కదు.

లింగ:- సరికాని ఈ పిల్లవాని క్రింద నా కెంత సొమ్మయిందో యెరుఁగుదువా! తృప్తిగా వారివల్ల రాఁబట్టి తృణమో కణమో, నా వల్ల చినవలెనేగాని నీ సొమ్మే పోయినట్లు నిగెడెదవేమి? పురుషోత్తమరావుగారు నాకంటె బూర్వపుఁ జుట్టమా యేమిటి నీకు!

పేర:-అలాగన్నారు గనుక అసలు సంగతి మనవి చేస్తాను వినండి. ఆయన కట్నంలేని సంబంధం ఖాయం చెయ్యాలని ఆలోచిస్తున్నారు. నా బలవంతం మీద మహా పెడితే రెండువేల కంటె పెట్టరు. అందుచేత మనం కొంచెం మార్మత్రోవ తొక్కాలి. ఆయనతో కట్నం మాటేమి కచ్చితంగా చెప్పక మంచిరోజు చూచి మాట్లాడే నిమిత్తం మన ఇంటికి తీసుకువస్తాను. సరిగా ఆ సమయానికి వివాహాల వీరయ్యగాడు వచ్చి, వేలం పాటలోకి దించేలాగు ఏర్పాటు చేస్తాను. ఆ పాటలో పంతులుగారి కావేశం ఎక్కించి మూడువేలవరకూ పాడిస్తాను. నా కేమిస్తారో సెలవివ్వండి!

లింగ:- ముష్టి మూడువేల కోసమిన్ని ముచ్చటలా! ఆ మూడు వేల లోనే నీ ముడుపా! చాలు చాలు! అధమపక్షమైదువేలయినా లేకున్న మనకా సంబంధ మక్కఱలేదు.

పేర:- అబ్బ, లింగరాజుగారూ! అసాధ్యులు గదా! సరే చచ్చో ముతమారో అయిదువేలూ అనిపిస్తాననుకోండి అందులో, అయిదు వందలు నావి, మిగతావి మీవి. ఇష్టమేనా?

లింగ:- అదిగో అదే పనికిరాదు! అందులో అణకాని బొత్తి జాఁగూడదు. నీ యైదువందలు నీవు పయిగా రాబట్టుకొనవలసినదే.

పేర:- సరే, నా తంటాలు నేనే పడతాను. వీరయ్యగాణ్ణి పంపు తాను. గాని వాడూ, మీరూ ముందు కాస్త కూడబలుకుకోండి. పని జరిగాక వాడికి పదిరూపాయలు మాత్రం పార వెయ్యండి.

లింగ:- దానికేమీ, తరవాత నీవో, నేనో లేదనిపింతము లెమ్ము.

పేర:- అన్నట్లు ఆభరణాల సంగతి చెప్పారు కారు. ఆభరణాల మాట చెవిన పడితేగాని ఆడంగులకు వేడే పుట్టదు.

లింగ:- వెఱ్ఱివాఁడా! మా పిల్లకు మేము వెలితి చేసి కుందుమా? అప్పు దడావడి పడవలసి వచ్చునని అయిదువేల రూపాయల నగలు

చేయించి సిద్ధముగా నుంచినాను.

పేర:- సరే యింతేసి! నా కిప్పటికి శలవు. (అని లేచి నిష్క్రమించును.)

లింగ :- అన్ని విధములచేత నీబేర మనుకూలమయినదే. పది యెకరముల భూమియుఁ బదివేలు, బాలతొడుగు వేయి, కట్నము అయిదు వేలు, మొత్తము, పదునారు వేలు ! లాంఛనము లనియు, గించనము లనియు లాగుట కింకను లక్షమార్గాలున్నవి. ఆ మీఁదనలుక పాన్పున్నది. ఆ వెనుక నాషాఢపట్టీ యున్నది. ఆపైని గర్భాధానపు బెట్టున్నది!

గీ. స్వామి కృతచేత నిధి కొనసాగెనేని
లాటరీలోనఁ బలె మంచి లాటువచ్చు :
ఇంటి పనులెల్ల నేర్చిన గుంట కాన
వెంటనే వంటవానిని గెంటవచ్చు

(తెర పడును)

ఇది ద్వితీయాంకము

o—o

తృతీయాంకము

మొదటి రంగము

(ప్రదేశము : లింగరాజుగారి పడక గది)

సుభ:- (చదువుకొనుచుఁ బ్రవేశించి చటుక్కునఁ బుస్తకమునుమూసి సెబాసు వివాహమన్న నీవిమలా విజయులదే వివాహము. సమాన వయో రూప సంపత్తిలేని దాంపత్య మేమి దాంపత్యము!

చ. ధనమె ప్రధాన భూతముగ దంతము లూడినవానికేనియుం దనయ లఁగట్టిపెట్టు తలిదండ్రులు హెచ్చగుచున్న యిట్టి దుర్దినములలోన, నింతిగ, ధరిత్రియిం జనియించుకంటె నిర్జన వనవాటిలో నజగ రంబుగ నేని జయింపఁగా దగన్!

ప్రాయముడిగిన ప్రారబ్ధమునకు దోడు, పిసినిగొట్టుపీను గుఁగూడ నగుచో నిఁకఁ జెప్పవలసినదేమున్నది? నాకుఁబట్టిన యవస్థయే పట్టును! భగవంతుడా! తండ్రీ! నా భర్తవంటి భర్తను మాత్రము పగవారికైన, బ్రసాదింపకుము?

సీ. నగపేరు చెప్పిన నవ్వులఁ బుచ్చును
కోకలు కొనుమన్న గొల్లుమనును
వొత్తంబు దేమన్న విత్తంబు లేదనుఁ
గాగిత మడిగినఁ గాక పడును
విడియ మొనర్చిన విసవిసలాడును
కాని పూవును గొన్న కస్సుమనును
వ్రత మొనర్చెద నన వలవల యేడ్చును
ముష్టి పెట్టిన నెత్తి మొత్తుకొనును
పండుగకు పబ్బమునకైన బిండి వంట
మాట యెత్తిన బిగ్గన మండిపడును

కటకటా! యిట్టి మగనితోఁ గాపురంబు
సలుప శక్యమె యెంతటి సాధ్వికైన
ఇంతటితోఁ దీఱినదా ?

సీ. జడవైచుకొన సాని పడఁచువఁటే యనుఁ
జీరగట్టిన షోకు మీఱె నను
వంటవానిం బిల్వ వెంట నేతెంచును
పోరితో మాటాడఁ బొంచి వినును
చదివిన వ్రాసిన జగడమాడఁసు, దొడ్డి
లోని కేగిన నను మానపడును
గడపదాఁటిన, వెన్కఁగొడుకు నంపించును
బాడిన సతి కిది కూడదనును
ఇంటికెవరైన వచ్చిన వెంటబడును,
తగునె యీ చేష్ట లన పెంకి దాన వనును
కటకటా ? యిట్టిమగనితోఁ గాపురంబు
సలుప శక్యమె యెంతటి-సాధ్వికైన.
ఇఁక-సంసార సందర్భములు సరేసరి!

సీ. పుడకలుం బిడుకలు బోషాణమున దాఁచి
యెట్ట కేలకు లెక్క పెట్టియిచ్చు
ఉప్పును బప్పుఁదా నుండెడు గదినుంచి
తులముల చొప్పునఁ జూచిఁ యిచ్చు
పెరటికూరల నెల్లఁ బెరవారి కమ్మించి
యేర్చి చచ్చుం బుచ్చు నింటికిచ్చు
వండినదెల్ల దా వడ్డించుకొని మెక్క
మిగతవారల కంట్లు మిగులనిచ్చు
తిరుగుచుండగనే యింటి దీప మార్పుఁ
బలుకుచుండఁగనే గొంతు పగుల నార్పుఁ
గటగటా? యిట్టి మగనితోఁ గాఁపురంబు
సలుప శక్యమె యెంతటి సాధ్వికైన !

లింగ:- [తెరలో] మావన్నెల విసనకఱ్ఱ యేమి చేయుచున్నది?

సుభ:- ఏమి చేయుచున్నదా? ఉసూరుమని యేడ్చుచున్నది!

లింగ:- [ప్రవేశించి] ఓసీ! యెప్పుడు చూచిననెందులకో కొఱకొఱ లాడుచునే యుందువు. సంతోషముగా నుండు సమయ మెప్పుడే?

సుభ:- చచ్చిన మరునాడు!

లింగ:- నీవా, నేనా ?

సుభ:- మీకుఁ జావేమిటి! ఎన్ని కట్నము లందుకొనవలసి యున్నదో! యెందరి గొంతు లింకమ గోయవలసి యున్నదో ?

లింగ:- కట్నములమాట కలకంఠుఁ డెరుఁగునుగాని పెన్నిధివచ్చి నను నేనిఁక బెండ్లి మాత్రము చేసికొనను! బుద్ధి వచ్చినది!

సుభ:- దాని కేమిలెండు: కలిమినిబట్టి యెవరికో గంగవెఱ్ఱులెత్తక మానవు, సిగ్గు బుగ్గి చేసుకొని మీరు సిద్ధపడక మానరు!

లింగ:- సరే యదృష్టము పట్టినప్పు డాలోచించవచ్చును గాని, నా మీఁద నీకింత కోప మెందులకే ?

సుభ:- మీ మీఁదనే కోపము! నా తండ్రి మొఱ్ఱోయని మొత్తుకొనుచుండ ఆయన మెడలు విరిచి అన్యాయముగ నా గొంతుకోసిన మాయమ్మ మీఁదఁ దప్ప నా కెవ్వరిమీదఁను కోపములేదు.

గీ. విద్యయు, వయస్సు, పరువును విడిచిపెట్టి
భాగ్య మొక్కటియే చూచి ఖసుగు పిసిని
గొట్టు పీనుఁగుకుం దన కూఁతు నిచ్చు
తల్లి కుత్తుక తరిగినఁ దప్పు గలదె!

లింగ:- ఓసీ! భర్తయన భగవంతుడుగదా ! భర్త నిట్టి పాడు మాటవలన వచ్చునని యే పుస్తకములోనైన నున్నదా ?

సుభ:- ఆలియన నర్ధాంగిగదా! అర్ధాంగి కన్న మైనఁబెట్టక;కూడ బెట్టిన ధనము కూడఁ గొంపోయిన వారెవ్వరైన నున్నారా ?

లింగ:- ఆహాహాహా! అంటించినావే ముక్కకు ముక్క! వెఱ్ఱి దానా! గడించినవాఁడెవ్వఁడు కప్పుపెట్టి చచ్చినాఁడే! చూడు.

సీ. ప్రాయకంబుగ బెట్టు పాఁతువాఁ డొక్కఁడు
వరుసఁ బండ్లను మెక్కు వాఁడొకండు

కష్టపడి గృహంబు గట్టువాఁడొక్కఁడు
వసతిగ నివసించు వాఁడొకండు
ఆస్తికై వ్యాజ్యంబు లాడువాఁడొక్కఁడు
వచ్చిన నది మ్రింగువాఁడొకండు
కోరి ముండను బెట్టు కొనెడివాఁడొకండు
వలపుకాఁడై పొందు వాఁడొకండు
అట్లె ధనము కూర్చు నిట్టివాఁడొక్కండు
వడిగఁదగులబెట్టు వాఁడొకండు
ఇది ప్రపంచధర్మ మీ నాడు పుట్టిన
లీలగాదు దీని కేల గోల?

సుభ:— సరే కాని నా సమాధానము కూడా వినెవరా?

లింగ:- ఆక్కరలే దక్కరలేదు, ఈ వితండవాదమున కిప్పుడు తీరిక లేదు. నీకొక శుభవార్త చెప్పిపోవలెనని వచ్చినాను.

సుభ:- ఏమిటది? ఎవరైన బదులుకొరకు వచ్చుచున్నారాఏమి!

లింగ:- బదులుగాదు బందలుగాదే. అబ్బాయికి బిల్ల నిచ్చుటకై పెండ్లి కొడుకు చూపులకు వచ్చుచున్నారు.

సుభ:- మనకు బిల్లనిచ్చునంతటి మతిమాలినవా రెవ్వరబ్బా?

లింగ:- ఎవరా? పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారు.

సుభ:— ఏమిటీ? కాళిందినా? కమలనా?

లింగ-:కాళిందియో,గీలిందియో నాకు తెలియదు. పెద్ద కుమార్తె.

సుభ:- పేరుతో మీకేమిపని! కట్నము మాత్రము గళ్ళనపెట్టులోఁ బడిన జాలును! ఏపాటి?

లింగ:-ఏమో వారియిష్టమే మిచ్చినమసరే.

సుభ:—అట్లయినఁగాలమున కేదియో అంతరాయ మున్నదన్న మాటే! సరే కాని క్షౌరము చేయించుకొననే లేదుగద?

లింగ:— అబ్బా అగపడినప్పుడెల్లా క్షౌరపుగోలయే కదా? నేను జావఁగానే, సర్వస్వము నీ క్షౌరముల క్రిందనే చెల్లును గాఁబోలును!

సుభ:-మీకా విచార మెందులకు?మీరు పోవునప్పుడు మీ యినుప పెట్టె మీ నెత్తి కెత్తెదనులెండు!

లింగ:-ఆహా! అట్టి యవకాశమేయున్న నదృష్ట మేమనవచ్చును.

గీ. సంపద మహత్వ మెపఁగని చవట బ్రహ్మ
చావు లేకుండగా నేవి సలుప డయ్యె
చచ్చునప్పుడు వెను వెంట సకలధనము
తీసికొనిపోవు విధమేని తెలుపడయ్యె (తెరపడును)

రెండవ రంగము

ప్రదేశము :లింగరాజుగారి కచేరి చావడి

(ప్రవేశము: పురుషోత్తమరావుగారు, లింగరాజుగారు, బసవరాజు, పేరయ్య పీరయ్య చాపలపైఁ గూరుచుండి)

లింగ:-విన్నావా? మున్నంగివారికిని, మాకును మూడుతరముల నుండి సంబంధ మవిచ్ఛన్నముగా సాగుచున్నది. మూర్తిరాజు పంతులుగారా సంగతులన్నియు నెత్తుకొని మూరెడుత్తరము వ్రాసినారు. అందుచేత నింత దూరమాలో చించవలసి వచ్చింది-

పీర:- మూడు తరాలనాటి సంబంధ మొకటేనా? మూడువేల రూపాయల కట్నమో!

పేర:-పీరయ్యా! నీ గొడవ మా విపరీతంగా వుందే! మూడు వేలు మూడువేలని యిక్కడికి ముప్పయిసార్లన్నావు. ముష్టి మూడువేలు మీరేకాని మేమివ్వలేమనుకున్నావా? లింగరాజుగారు! ఆ మొత్తం మే మే యిస్తాము. మా కింద ఖాయం!

పీర:-అదేమన్నమాట? మీరథికంగా అన్నదేముంది?

పురు:-అట్లయిన నింకొక యైదువంద లధికముగా నిచ్చెదము.

పీర:-మా పంతులుగారు మరియైదువందలు.

పేర:-వొయ్యోయ్? వద్దుసుమా వొద్దు! మా పంతులుగారి సంగతి తెలియక మాజోరుగా వస్తున్నావు!మాట దక్కదు సుమా.

పీర:-పేరయ్యా నీ బెదిరింపులకు నేను జడిసేవాడ్ని కాను! మా పంతులుగారు పెట్టమన్న మొత్తం వరకూ పెట్టిమరీ తీరుతాను.

పుర:- (రోషముతో)సరే కానిమ్ము నాలుగువేల నాలుగు వందలు.
వీర:- అయిదువందలు.
పుర:- ఆరు; రా యెంతవరకు రాగలవో రా.
వీర:- రాక విడిచి పెడుతానా? యేడువందలు.
పుర:- ఎనిమిది ?
బస:- (తనలో) బాగు బాగు! పొర్పులాగునే యున్నదే !

గీ. పేకల నోకులం బాడు వీఁక నడి బ
జారులో గుడ్డలం బాడు సరణి; పెండ్లి
కొడుకు నిటు మధ్య నిడి, కసి గొన్న యట్లు
వేలముం బాడు చెన్నఁడు యెరుంగ !

లింగ:- వీరయ్య! వీరి క్రింద ఖాయపరుప వచ్చునా!
వీర:- అప్పుడేనా? అయిదువేలు?
పేర:- (లేచి) బాబూ, యీ బేరం మనకు కుదిరేదికాదు లేవండి.
పుర:- అయ్యో! సెలవు తీసుకొను మనెదరా?
లింగ:- సందర్భము లన్నియుఁ దమరు స్వయముగా జిత్తగించుచు నన్ను నెప పెట్టుట న్యాయమా?
పుర:- సరే మీ చిత్తము. (అని లేచి పేరయ్యతో బైటకేగును)
వీర:- కొంపతీసి, బేరం గోవిందా కొట్టదుగద?
లింగ:- వెఱ్ఱివాఁడా! పేరయ్య అంత పెయ్యమ్మ యనుకొంటివా?
వీర :- నన్ను మెచ్చుకోరేం? నా పాఠం నేనెల్లా వప్పగించాను?
లింగ:- నిత్యము గోర్టులలో బ్రతుకు ముండకొడుకవు; నీకిదిలెక్కా (అని యేదియో వ్రాయుచున్నట్లు నటించును.)
బస:-(తనలో) వీరి ప్రసంగంబట్టి వీరేదియో కుట్ర సాగించునట్లు కనబడుచున్నది. వీరయ్య పొల్పు పాటగాడై యుండును.
పేర:-(బయటను)పంతులుగారు!బహుదూరం వెళ్ళాతు.ఇంతదూరం వెళ్ళడం నాకిష్టంలేదు. వెళ్ళకచేసేదీ కనపడలేదు. ఆ ఏల్నాటి శనిముండా కొడుకులేకపోతేఏంచక్కా ఫయిసలయ్యేది!చెరపడానికి చేటపెయ్యచాలును!

నిజానికినిలిపెడుధనమిచ్చినాయీహెదిపిల్లవాడుమాత్రంఇకసందర్భపడడు.

పురు:-పోనిండింకను రవంత దూరము పోయి చూతమా ?

పేర:- పోవుటకేం పోవచ్చును ఆసులువు బలుపు లాలోచించుకో వలసిన వారు మీరు. అమ్మగారితో ఆలోచింతా మంటే అవకాశంలేదు. మనం మళ్ళీ వచ్చేసరి కిముండాకొడుకు మంగళం పాడేస్తాడు.

పురు:- అనవసరమగు నాలస్యమే కాని అది మాత్రమేమి చెప్పఁ గలదు? ఇంకొక మాట యని చూతము రండు.

పేర:-అయితే,ఒకపనిచెయ్యండి.ఆవెధవతోవేలంపాటనాకిష్టంలేదు. ఆఖరుమాటని యింకో ఐదువందలమాంతంగా పెట్టండి, దానితో దిమ్మతిరిగిందా,తిరుగుతుంది.తిరక్కపోతే,తిన్నగాఇంటికిచక్కాపోదాం ఏమిశలవు?

పురు:- సరేరండు,(అని పేరయ్యతో మరలలోపలికేగి)లింగరాజుగారు!మరియొక్కమాట యనిపోవుదమని మరల వచ్చినాను. ఇంకొకయైదు వంద లిచ్చెదము. ఇష్టమున్న మా క్రింద స్థిరపరుపుడు, లేదా, యింతటితో మాకు సెలవు.

లింగ:-మూర్తిరాజుగారి క్రింద స్థిరపరచి నట్టుత్తరము వ్రాయుటకు మొదలు పెట్టినానే, సరే సమాప్తి కాలేదు కనుక దోషములేదు. ఏమి పేరయ్యా! వీరి క్రింద స్థిరపరుప వచ్చునా?

పేర:-వారు నాకిచ్చిన వర్డీ యెంతవరకో, అంతవరకూ పాడాను. టెల్లిగ్రాపిచ్చి తిరిగి ఆర్డరు తెప్పించుకునేవరకూ ఆగండి.

లింగ:- అదేమన్నమాట,అయిదు నిమిషము లాగను.పెద్ద మనుష్యుల కడ పేచీలు పనికిరావు! అయ్యా తమక్రింద ఖాయము.

పేర:- తథాస్తు! పంతులుగారూ! తమవద్ద పదిరూపాయలు లుంటే ప్రస్తుతము ఖజానాక్రింద జమకట్టించండి.

పురు:- (రూపాయలు తీసి యిచ్చును.)

పేర:- తమరు కాస్త రసీదుముక్క వ్రాసి యిప్పించండి.

లింగ:-అభ్యంతరమేమీ? (అని రసీదు వ్రాసి చదువును)

"బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారికి సింగరాజు లింగరాజు వ్రాసియిచ్చిన రశీదు. మీ కుమార్తె చి॥సౌ॥ కాళిందిని నా కొమారుడు చి॥ బసవరాజునకు చేసికొనుటకు అందులకై మీరు మాకు కట్నము క్రింద నైదువేల ఐదువందల రూపాయల రొఖ్ఖము, రవ్వల యుంగరము, వెండి చెంబులు, వెండి కంచము, వెండి పావకోళ్ళు, పట్టు తాబితాలు, వియ్యపురాలు, వియ్యంకుల లాంఛనములు యథావిధిగా నిచ్చుటకును, ప్రతిపూట పెండ్లివారిని బ్యాండుతోఁ బిలుచుటకును, రాక పోకలకు బండ్లు, రాత్రులు దివిటీలు నేర్పాటు చేయుటకును, రెండుసారులు పిండి వంటలతో భోజనములు, మూడుసారులు కాఫీ, సోడా, యుప్మా, యిడ్డెను, దోసె రవ్వలడ్డు, కాజా, మైసూరు పాకాలతో ఫలహారములు చొప్పున మా యిష్టానుసారమైదుదినములు మమ్ము గౌరవించుటకును, అంపకాలనాడు మాకు పట్టుబట్టను, మాతో వచ్చువారికి కుప్పాడ బట్టలు నిచ్చుటకును నిర్ణయించుకొని బజాన క్రింద పది రూపాయలిచ్చినారు. గనుక ముట్టినవి.

"సింగరాజు లింగరాజు వ్రాలు" చాలునా?

పేర:- చాలుబాబూ! చాలు! మచ్చుకోసం దాచిపెట్టి తేవలసిన మతలబు! (అని రసీదు తీసుకొని పురుషోత్తమరావుగారి కిచ్చెను.)

పురు:- బావగారూ! మాకిఁక సెలవా?

లింగ:- చిత్తము, చిత్తము. తాతగారు పిల్లపేర వ్రాసి యిచ్చిన దస్తావేజొకసారి పంపెదరా?

పురు:- అభ్యంతరమేమీ? అట్లే పంపెదను.

(తెరపడును)

ఇది తృతీయాంకము

చతుర్థాంకము

మొదటి రంగము

కమ:- (కాగితము చుట్టుకట్టిన ఛాయాపటము పట్టుకొని ప్రవేశించి) ఎప్పుడో మేడమీద నుండి యేమరుపాటుగఁ జూచుటయే అని సూటిగ నెన్నఁడుఁ జూచియుండలేదు. అందువల్ల ముందుగానే నేను జూచి ఆ వెను కక్కకుఁ జూపెద (అని కట్టువిప్పి, పటమును బయటకి దీసి, పరికించి) సెబాసు! చేసికొన తగ్గవాఁడే.

ఉ. కన్నులు చాల పెద్దయవి: కన్బొమలుం గడు దీర్చిదిద్దిన
ట్లున్నవి: సోగయై తనరు చున్నది నాసికయున్, లలాట మ
త్యున్నతమై యొసంగు; గురులొత్తనియే యనవచ్చు; జాలునీ
వన్నెయు నన్నిటం దగినవాఁడై లభించెను నేఁటి కక్కకున్.

(బిగ్గరగా) అక్కా! అక్కా! ఒక్కసారి యిటు వచ్చితివా...సికొక చక్కని తాయం చూపెద!

కాళిం:- (చటాలునఁ బ్రవేశించి) ఏమా తాయము?

కమ:- (పటమును దాఁచి) ఒక చిత్రము చూపిన నా కేమిచ్చెదవే?

కాళిం:- అబ్బా? చంపక అదేమో చెప్పవే?

కమ:- చెప్పితినిగా చిత్రమని.

కాళిం:- ఎవరి చిత్రము?

కమ:- బావది.

కాళిం:- ఏ బావది?

కమ:- ఇంతే బావ. అయిదు వేలా అయిదు వందల బావ! ఇదుగో చూడు! (అని పటముఁ జూపబోవును)

కాళిం :- (తొలగి) చాలు ! చాలు ! చూడనక్కరలేదు ?

చూచినందులకుఁ గూడ సుంకమీయవలె నేమో!

కమ:- సుంక మిచ్చియైనఁ జూడఁదగిన యందమే యక్కా!

కాళిం:- అందమున కేమిలే అయిదు వేల అయిదువందల కిమ్మతు గల బొమ్మ కాపాటి యందమైన నుండకుండునా?

కమ:- అంత బెట్టుకూడదక్కా! అరకంటనైన నీ యంద మొక్క సారి చూడుము! (అని మరలఁ బటమును జూపఁబోవును)

కాళిం:- (త్రోసివేసి తప్పించుకొని) అబ్బా! అంతకంతకు నీ యాగడ మధికమగుచున్నది సుమా! అంత యందగాఁడని తోఁచినచో హాయిగ నీవు పెండ్లి యాడుము!

కమ:- ఔనౌను! ఎక్కడ మగఁడు దొరకని యెడల నక్కమగఁడే దిక్కను సామెత యుండనే యున్నది గదా? ఇరువురము నింటఁబడితిమి, ఇచ్చిన సొమ్మునకు వడ్డీయైనఁ గిట్టించుకొందము.

కాళిం:- లేదా యిరువురము నీళ్ళబిందెలు మోసి యింటి వెచ్చములయినఁ గడుపుదుము.

కమ:- హాయి హాయి! ఆ ముక్క యందముగా నున్నదే!

కాళి:- సరికాని ఆ పటము నీకెట్లు వచ్చినది?

కమ:- శుభలేఖలలో వేయించుటకై మొన్న మన ఫోటోలు తీసిన నరేంద్రునిచేత నాన్నగారు తీయించినారట.

కాళి:- వ్యవహారమప్పుడే శుభలేఖల వరకు వచ్చినదా?

కమ:- రాదా మరి? ముహూర్తమింక మూడు వారములే గదా యున్నది? అదుగో నాన్నగారు వచ్చుచున్నారు.

కాళి:- (ఒక నిట్టూర్పు విడిచి లోపలికి జక్కంబోవును)

కమ:- నాన్నగారు! నరేంద్రుఁడీ ఫోటో యిచ్చి వెళ్ళినాఁడు.

పుష:- (చూచి) సరే నీ యొద్ద యుంచుము. మీ యమ్మ ఏమిచేయుచున్నది? (అని పడక కుర్చీలోఁ గూలఁబడును)

కమ:- ఇదిగో యిచ్చటకే వచ్చుచున్నది. (అని నిష్క్రమించును)

భ్రమ:- అదే మట్లున్నారు? ఎక్కడికి వెళ్ళినారింత సేపయినది?

పురు:- ఎక్కడికని చెప్పుదును. ఊరంతయుఁ దిరిగి వచ్చినాను.

భ్రమ:- అంత త్రిప్పుట కిప్పు డవసర మేమి వచ్చినది? కమల సంగతి ప్రస్తుతం కట్టిపెట్టఁ దలంచితిమిగా!

పురు:- అందులకుఁ గాదే! అప్పుకొఱకు కట్నము సొమ్ము, ముందు పంపినగాని కార్యసన్నాహ మారంభింపమని లింగరాజుగారు వర్తమాన మంపినారు. అందుచేత బదులుకొఱకు బయలుదేరినాను.

భ్రమ:- యెక్కడనూ జూడలే దెక్కడిదీ పద్ధతి. కట్నమన కళ్యాణ సమయమున నిచ్చునది కాని,లంచమువలె రహస్యముగా నింటికిఁ దీసికొనిపోయి ఇచ్చునదియా?

పురు:- లింగరాజుగారి సంగతి యెఱిఁగియు వెఱ్ఱిపడెదమేమి? ఐన నీ పాడుపని యందరిలో జరుగుట కంటె నిది మేలు.

భ్రమ:- అందుల కిప్పుడయిన పని యేమీ?

పురు:- అప్పు బుట్టుట యెంత కష్టమో అది తెలుసుకొనుటయైనది.

సీ. మానాబిమానముల్ మాపుకోవలయును
        విసుగును గోపంబు విడువవలెను
సమయంబు గనిపెట్టి సంధింపవలయును
        త్రిప్పిన ట్లెల్లను దిరుగవలెను
నీవె దేవుండవని సేవింపవలెను
        ఇచ్చకంబుల మురియింపవలెను
బ్రోకరు రుసుమును బొడిగింపవలెను
        దరి గుమాస్తాగానిఁ దనుపవలెను
నాల్గు రెట్లేని యాస్తి కన్పఱుపవలెను
వడ్డి యెంతన్నఁ దలయొగ్గవలెను షరతు
లేమి కోరిన శిరసా వహింపవలెను
పుట్టునెడ నప్పటికిఁగాని పుట్ట దప్పు

భ్రమ:- ఇంతకు, మన కెచ్చటనైనఁ బుట్టినట్లా?

పురు:- పుట్టినచో నీ పురాణ మంతయు వెందులకు? ఆ పది ఎకరముల భూమిమీదను అయిదువేల కంటె నిచ్చువా రగ పడలేదు.

భ్రమ:- మనకు గావలసిన దెంత?

పురు:- ఐదువేల యైదువందలు కట్నము గదా? ఆమీఁద వానికొక యైదువందలైనఁ గావలయును గదా? ఎటు జూచినా మొత్త మేడువేలైన లేకున్నఁ గార్యము జరిగి గట్టున బడలేము.

భ్రమ:-అందులకేమి యాలోచించినారు?

పురు:- అయినమట్టున కమ్మివేయుటకు నిశ్చయించుకొన్నాను. కాని యది మాత్ర మంత పయిపయి నున్నదా? అమ్మబోయిన నడవి, కొనబోయిన కొఱవి యన్నట్లు యేడువేల యైదువందలకన్న నెవ్వని యేఁగాని పెట్టువా రగపడలేదు. పాపము పేరయ్యగా రీ విషయమునఁ బడుచున్న పాట్లకు మేర లేదు.

భ్రమ:- అరుగో మాటలోనే యాయనయు వచ్చినారు.

పేర:- (వగర్చుచు ప్రవేశించి)బాబూ, తమవద్ద శలవు పుచ్చుకొని ఇంటికి వెళ్ళేసరికి అదృష్టవశాత్తూ మా అల్లుడీపూట రైలులో వూడి పడ్డాడు. సందర్భవశాత్తూ ఇతనితో సంగతంతా చెప్పవలసి వచ్చినది. ఆతగాడు విని విని "మాఁవా! అటువంటి గృహస్థుల కీలాటి సమయములో అడ్డుపడడం కంటె కావలసిన దేమిటి? ఇంకో ఐదువందలు వేసి ఆ పొలం నా పేర వ్రాయించం" డన్నాడు. ఆపాటున బ్రతుకు జీవుడా అని ప్రాశన కూడా చెయ్యకుండా పరుగెత్తుకు చక్కా వచ్చాను. ఏమి శలవు?

పురు:- సెలవున కేమున్నది? చెడి యమ్ముకొన్నను బది ఎకరములకుఁ బదివేలయిన రాకపోదనుకొన్నాను. ఎక్కడను చిక్కనప్పుడేమి చేయగలము? పోనిండు, అన్యులకుఁ బోవుటకంటె. మీ యల్లున కగుట నా కధిక సమ్మతము. దస్తావేజు వ్రాయింపుఁడు.

పేర:- దస్తావేజు వ్రాయించడమే కాదు, తక్షణం రిజిష్టరీ కూడా కావాలి. యేమో అతగాడికి మళ్ళీ యేం బుద్ధి పుట్టునో ఎవరు చెప్పగలరు? క్షణములో దేవతార్చన చేసుకొని చక్కా వస్తాను తమరుకూడ భోజనము చేసి, దానికి సంబంధించిన కాగితాలన్నీ దీసి వుంచండి శలవు. (అని పోవుచుఁ దనలో) అదృష్టముగా యిదీ అధమం రెండువేలైనా లాభిస్తాయి. ప్రస్తుతం అల్లుడు పేర వ్రాయించి, పదిరోజులు పోయాక ఫిరాయించు కొంటాను. [నిష్క్రమించును]

పురు:- ఏమే స్నానమునకు లేవవచ్చునా?

భ్రమ-: లేవవచ్చునుగాని యీ పది ఎకరముల భూమియుఁబోయి నచో నిఁక మన బ్రతుకు తెరవేమిటి?

పురు-: వెఱ్ఱిదానా! యెంత మాటాడితివే!

సీ. కూలి నాలియు లేక కుడువ తోవయు లేక
మలమల పస్తులు మాడువారు
ఇల్లూ వాకిలి లేక యిల్లాలు లేక, యే
చెట్లు నీడనొ నివసించువారు
పయిని పాతయు లేక, పండఁ జాపయు లేక
వడవడఁ జలిలోన వడకువారు
కాళ్ళుఁ గన్నులు లేక, కదల మెదల లేక
దేవుఁడా! యనుచు వాఁపోవువారు
కలరు మనదేశమునఁ గోట్లకొలది నేఁడు
వారి నెల్లర నెపుడు గన్నాఱఁ గనుచు
బందలంబోలె మనమికఁ బ్రతుకు టెట్టు
లనుచుఁ జింతింపవచ్చునే యజ్ఞురాల!

భ్రమ:- నిజమే! నిజమే!

సీ. ఱాతిలోఁ గప్పను రక్షింపఁ గలతండ్రి
బొరియలోఁ జీమను బ్రోచు తండ్రి
గంగలోఁజేపను గాపాడఁ గలతండ్రి
మంటిలో నెఱ్ఱను మనుచు తండ్రి
పుట్టలోఁజెదలను బోషింపఁగల తండ్రి
కలుగులో నెలుకను గాంచుతండ్రి
నాభిలోఁ గ్రిముల కన్నము పెట్టఁగల తండ్రి
పేడలోఁ బురుగును బెంచుతండ్రి
భూజములకెల్ల నీరము పోయు తండ్రి
శిశువుతో స్తన్యముం దయసేయు తండ్రి
దయయె స్వస్వరూపంబుగాఁ దనరు తండ్రి
మనలఁ బోషింపఁడే వెఱ్ఱిమాటగాక! [తెరపడును]

చతుర్థాంకము

రెండవ రంగము

ప్రదేశము:- పురుషోత్తమరావుగారి లోపలి చావడి.

(ప్రవేశము:- భ్రమరాంబ, కాళింది)

భ్రమ:- అమ్మాయీ! యీ పూఁట నీ వన్నమునకు రా లేదేమి?

కాళిం:- ఆఁకలి లేదమ్మా!

భ్రమ:- అదేమే! యే పూఁట కాపూఁట యాకలి లేదని మొదలు పెట్టినావు. పెండ్లి తలపెట్టఁగానే పెండ్లికూతుల కెక్కడలేని కళ వచ్చును. నీవేమిట్లు నీళ్ళు కారుచున్నావు?

కాళి:- అమ్మా! అడిగితివి కనుకఁ జెప్పుచున్నాను. ఈ పెండ్లి నా కిష్టము లేదే!

భ్రమ:- అదేమి? ఆ పెండ్లి కొడుకు నచ్చలేదా యేమిటి?

కాళిం:- పెండ్లి కొడుకు కాదు. పెండ్లియే నచ్చలేదు.

ఆ. మీకుఁ గులము లేద మాకు రూపము లేద!
యింత దైన్యమునకు హేతువేమి?
కట్నమిచ్చి వరుని గడియించుకొనుకంటెఁ
జిన్నతనము వేఱే మున్న దమ్మ?

భ్రమ:- యింతియే కద. ఈ దురవస్థ యిపుడు మనకే పట్టినదా?

ఉ. కొంచెముపాటి వారలును గొంపను గోడులు నమ్మియేనియున్
సంచులు చంకఁబెట్టుకొని సంతకుఁ బోయినట్లుఁ బోయి శో
ధించి బిగించి తండ్రులు విధించిన విత్తము ముందె చేతిలో
నుంచియ కాదె తెచ్చుకొను చుండిరి కూఁతుల కిష్ట భర్తలన్.

కాళిం:- అగుఁగాక. మనము కూడా వారినే యనుసరింపవలెనా?

గీ. అడుగువారికిఁ బాప భయంబు లేక
యిచ్చువారికి సిగ్గును నెగ్గులేక
నడచుచున్నట్టి వరశుల్క నాటకమున
నకట! మనమును బాత్రలమగుట తగునె?

భ్రమ:-కాక చేయవలసిన దేమి?

ఆ. అప్పుకన్నఁ దలగ యావళీ దక్షిణ
కన్నఁ బన్నుకన్నఁ గన్నతండ్రి
తద్దినంబుకన్నఁ దప్పనిసరియయి
యున్నదిపుడ కట్నమన్నియెడల

కాళిం:- అమ్మా! అదేమన్న మాట?

చ. తిరముగ నింటిముందుఁ బెను దేవళముండఁగ మ్రొక్కుబళ్ళతో
దిరుపతి కేగినట్లు కులదీపకు లెందఱొ లేమిచే వివా
హ రహితులై కనంబడెడు నప్పుడు వారిని రోసి కట్నమే
పరువుగ నెంచువారికయి పర్వులిడం బనియేమి వచ్చెనే?

భ్రమ:- తెలివిమాలినదానా! నీ విప్పటి దేశకాలపాత్రముల సంగతి తెలియక మాటలాడుతున్నావు!

ఆ. పిండిబొమ్మయైనఁ బిల్లఁ నిచ్చెదమనఁ
గానె చేయిచాచుఁ గట్నమునకు;
ఇట్టి తరిని కట్న మీయకుండఁగఁ బుస్తె
కట్టువరుఁడు జగతిఁ గానఁబడునె?

కాళిం:- పోనిమ్ము. లోకమంత గొడ్డుపోవునప్పు డీతొచ్చు పని కంటె వివాహమే విసర్జింపఁగూడదా!

గీ. కట్నమే కోరి వచ్చిన ఖరముతోడఁ
దగుదునని కాఁపురము సేయు దానికంటెఁ
బెండ్లియే మానుకొని మగబిడ్డవలెనే
తల్లి దండ్రులకడ నుంట తప్పిదంబె!

భ్రమ:- అవివాహితయగు నాఁడుబిడ్డ యింటను గల తల్లి యవస్థ అమ్మా! నీకిపుడేమి తెలియును?

సీ. పెరవారి పిల్లకు వరు డేరుపడె నన
మనపిల్ల కెవ్వడోఁ మగఁడటంచు
పరుల పిల్లల పెండ్లి పరికించు నపుడెల్ల
మనపిల్ల కెపుడో మనువటంచు
ఎదుటి యింటికి నల్లుఁ డేతెంచినపుడెల్ల
మన యిల్లుఁ డెపుడింట మసలు ననుచు
పొరిగింటి పిల్ల కాఁపురము విన్నప్పుడెల్ల
మన పిల్లకెట్టిదబ్బునో యటంచు
నాఁడుబిడ్డ జనించుటే యాదిగాను
బుస్తె మెడబడువరకు మాపులను బవలుఁ
గుడుచుచున్నను గూర్చున్నఁ గునుకుచున్న
దల్లి పడుబాధ తెలుపఁగ దరమె బిడ్డ?

కాళిం:- అమ్మా! యిన్ని బాధలుపడి పెంచిన బిడ్డకు ఇట్టి లంచగొండులకు గట్టబెట్టుటకంటె నవమానమింకేమున్నది.

భ్రమ:- అయ్యవమాన మా లంచమాసించు వారికిగాని మనకేమి?

కాళిం:- అదేమన్న మాట?

గీ. త్రాగువా రుంటచేతనే తాళ్ళగీత!
గొనెడువా రుంటచేతనే గోవుల వధ
పోవువా రుంటచేతనే భోగవృత్తి;
అట్లె ప్రోత్సాహమే హేతు వన్నిటికిన్ని.

భ్రమ:- [వినుట నభినయించుచు] ఆగుమాగుము. అదిగో! మీ నానగారు కావలయును దలుపు తట్టుచున్నారు. ఆ! వచ్చె వచ్చె [అని నడచి తలుపు తెరచుట యభినయించును.]

పురు, పేర:- (ప్రవేశింతురు)

భ్రమ:- వెళ్ళిన పని అయినదా?

పేర:- అవడంలో అఖండ దిగ్విజయంగా అయింది. ఆ రిజిష్ట్రారు

ముండాకొడుకు చేతుల్లో ఐదురూపాయల నోటూ పెట్టగానే, అదివరకు వచ్చిన వారినందరిని వెనకబెట్టి అరగంటలో తేల్చేశాడు.

పురు:— పెండ్లి కొడుకు ముడుపు పేరయ్యగారిచేత ఐంపివేయమనె దవా? అదేమి నీ వట్లున్నావు?

భ్రమ:- కాళింది నాకీ పెండ్లి వలదని కావలసినంత గందర గోళము చేయుచున్నది! ఏమి చెప్పినను దాని తల కెక్కుటలేదు!

పురు:- అదేమి?

భ్రమ:- కట్నమిచ్చి వరుని దెచ్చుకొనుట గౌరవహీనమని, అన వాయత లట్టెపోవుచా? మీ పోలికలు పుణికి పుచ్చుకున్నందులకు మీ తిక్కయే దానికిని బట్టుకొన్నది!

పురు:- నా తిక్క నా బిడ్డలకు గూడ నంటుకొనుట నాకానందమే కాని భగవంతుడు ప్రతికూలుడైనందున మా తిక్కతీరుమార్గముమాత్రమే లేకపోయినది! ఏది! యెక్కడనున్న దొకసారి యిటు పిలువు.

కాళిం:- [తలవంచుకొని ప్రవేశించి] ఇదిగో యిక్కడనే యున్నా నండి!

పురు :- (దగ్గరకు దీసికొని, తలనిమురుచు) అమ్మా! మీ యమ్మతో నేమో యన్నావా టేమిటి?

కాళిం:- అమ్మతో నన్నమాట మీతోగూడా ననుటకే వచ్చినాను. నాన్నగారు! నాయెడ మీకు నిజముగా ప్రేమయున్నదా?

పురు:- అమ్మా! నీ కట్టి సందేహమేల గలిగినది?

కాళిం:- ఉన్నయెడల——

ఆ. కూతురనుచు బరుల చేతిలోబెట్టక
కొడుకటంచు నన్ను గొంపలోనె
యుంచుకొనుడు, మీరు పెంచలేకున్న గ
ష్టించి మిమ్ము నేనే పెంచుదాన.

పురు:- (గడ్డము పుడుకుచు) వెర్రితల్లి! బిడ్డను బెరవారికిచ్చుట ప్రేమలేక కాదు, మరేమందువా!

ఆ. ఆఁడుబిడ్డ యెపుడు నన్యుల సొత్తౌట
దాని వారికడకు దానిఁ జేర్చ
భారమెల్లఁ దండ్రిపైనుండుఁ గావునఁ
దండ్రి జాలిగుండెఁ దాల్పవలయు!

కాళి :- నాన్నగారూ! నాకీ పెండ్లి ఎంతమాత్రము నచ్చలేదు. ఎందుచేత నందురా?

గీ. కట్న మర్పించి వరునిచే గంతమునకు
బుస్తె కట్టించుకొని తృప్తిఁ బొందుట కంటెఁ
దనకుఁ దానుగ ముప్పేట త్రాటితోడఁ
గంఠమునకు నురియిడుకొంటె గౌరవంబు!

పుర-: [చటాలున గౌఁగలించుకొని] నాతల్లి! నా తల్లి నాకడుపున బుట్టి, నాకు బుద్ధి చెప్పగలదాని వైనందులకు, నా యాయువు గూఁడ బోసికొని బ్రతుకుము!

చ. సొరిదిగ హెచ్చుచున్న వరశుల్క విపద్దశ మాన్పఁబూని బి-
ట్టఱచితి వేదికాస్థలుల, నాడితి బెక్కు సభాంతరంబులం
బఱబఱ వ్యాసముల్ బరికి పత్రికలం బ్రచురింపఁ బంపితిన్,
హరహర! నీదుపాటి తెగువైనను లేక భ్రమించితిం దుదన్!

భ్రమ:- సరి సరి! చక్కగానే యున్నది? దాని పాటకు మీరు తాళము గూడా మొదలు పెట్టినారా ?

పుర:- తాళమును లేదు, తప్పెటయు లేదు గాని దాని నేమియు ననక, తగు మాటలతో నచ్చజెప్పుము.

కాళిం:- నాన్నగారూ! నాకీ యేహ్యకృత్య మే మాటల చేతనూ నచ్చదు. నా యెడ నిజముగ దయకలదేని నా పలుకులను పాటించి, ఈ యవమానపు వివాహప్రయత్న మింతటితో విరమింపుడు. లేదా, (అనిపై మాట రాక, యేడ్చుచుఁ గాళ్ళపై బడును)

పుర:- [లేవనెత్తి] అయ్యోఁ తల్లీ! నేనేమి చేయుదును? ఆడుపడుచు అవివాహితయై యింటబడియున్న, అపనిందలు పాలు గాదా?

ఆ. లోటులేని యెడనె లోపంబు కల్పన
చేసి దానఁ దుష్టిఁజెందు జగము!

ఇక, రవంత లోపమే నిక్కముగఁ గాన
వచ్చెనేని బ్రతుక నిచ్చు నమ్మ.

కాళిం:- అయ్యయ్యో? మీరుగూడ నట్లనెదరేమి? నాకింగ్లీషు చెప్పిన దొరసానికి నలుబది యారేండ్లున్నవి. ఇప్పటికిఁ బెండ్లి లేదు. ఆమె యేమి అపనిందపాలైనది ?

భ్రమ:- సరే యిఁక నేమి! చక్కని యుపమానమే దొరికినది. ఆమెకును, మనకును గల యంతరమేమో తెలియునా! మన దేశములో, నాఁడుది యాడుదే, మగవాఁడు మగవాఁడే. అక్కడనో ఆఁడుది మగ వాఁడు, మగఁవా డాడుది తెలిసినదా? ఈ మంకుతన మికఁ జాలునుగాని, ఈపాటికి లోపలికి బోవుదము రమ్ము. (అని బలవంతముగా కాళిందిని దీసికొని పోవును.)

పురు:- పేరయ్యగారూ! విన్నారా సంగతి.

పేర:- విన్నాను బాబూ, విన్నాను. ఏమిటో యెరిగి ఎరగని పిల్లల కేం తెసుస్తాయి కష్టసుఖాలు.

పురు:- ఇప్పుడేమని మీ సలహా!

పేర:- తమకు నేనే సలహా చెప్పాలా. అయినా దీనికంత సల హాతో పనేముంది? కట్నం సొమ్ము పంపివేసినట్లు తెలిస్తే కార్యం లేదని ఆ చిన్నదే వూరుకుంటుంది. ఆ కాస్త ముడి పడిందా పెనిమిటి బెల్లమే అవుతాడు.

పురు:- అట్లయిన నిఁక నాలస్య మెందులకు?ఇదిగో సొమ్ము ఇచ్చి చక్క రండు. (అని నోట్లు లెక్క పెట్టి) ఖజానా క్రింద నిచ్చిన పదిరూపా యలు మినహాయింతమా?

పేర:- ఆ బ్రాహ్మణుడు నోట్లకు మారకం అడక్కుండా విడిచి పెడతాడా. ఆ పదిరూపాయలూ అందు కింద సరిపుచ్చుతాను.

పురు-: అట్లే కానిండు. (అని నోట్లిచ్చి) మీరొకసారి చూడుడు.

పేర:- (లెక్కచూచి) ఐదు వేలా ఐదువందలు సరిగా వున్నాయి. ఈదారినే వెళ్ళి యిచ్చివేసి,ముట్టినట్టు ముక్క కూడా వ్రాయించుకు వస్తాను. శలవు (అని కొంచ మావలికి వచ్చి) బ్రతుకుజీవుడా, బ్రాహ్మడు పప్పులో అడుగువేస్తాడేమో అని ప్రాణాలు కొట్టుకొన్నాయి. లేచిన వేళ మంచిది.

ఐనా ఆడపిల్ల నింత హద్దు మీరనివ్వగూడదు. అందుకనే ఆడు పిల్లలకు చదువంటే, నా అరికాలు మంట నెత్తి కెక్కుతుంది. వెనక నోసారి మా పెంకిముండ ప్రక్కయింటి పిల్లతో బళ్ళోకి వెళ్ళానికి సిద్ధపడితే నేనేం చేశాను? స్తంభానికి కట్టి చావగొట్టాను అక్కడితో ఆ రోగం వదలి అయిదుగురు బిడ్డల తల్లయ్యింది (అనుకొనుచు నిష్క్రమించును).

పురు:- (రవంత నడయాడి) ఔరా! దురదృష్టము.

చ. కరమును నీతిబాహ్యములు కట్నపుఁ బెండిళు లంచు సుద్దులన్
గురిసెను నిన్నదాఁక దన కూతుఁ వివాహముపట్ల నేఁడు కి
క్కురు మనకుండఁ గాళ్ళకడకు న్నడిపించెను గట్నమంచు న
ల్లురు ననుఁగురించి లేవిడులు గొట్టెడు యోగముపట్టె నేమనన్.

(తెరపడును)

ఇది చతుర్థాంకము

—o—

పంచమాంకము

ప్రదేశము : కాళిందీ, కమలల గది

కాళిం:- (విచారముతో బచారుచేయుచు) కటకటా! కట్నము కాళ్ళ కడకుఁ బంపుట కూడ జరుగునపు డిఁక కార్యమేమున్నది?

ఉ. తెల్లముగా మనోగతము తెల్పినఁ నేడ్చిన, మొత్తుకొన్న, నా
తల్లికిఁ దోచదాయె విది తప్పిదపుం బని యంచుం దండ్రియుం
జల్లగ గ్రిందిమెట్టునకు జారి ననుం గమనింపఁ డాయె! నన్
జెల్లని దబ్బు క్రింద నిటు చేసితి వేమిటి కయ్య దైవమా!
ఔరా! ఆఁడుదాని బ్రతు కెంత యలుసు బ్రతు కైనది!

ఉ. లేదు స్వతంత్ర మొక్క లవలేశము కూడ, నొకింతయేనియున్
లేదు యదార్థ గౌరవము లేదొక యింతయు మెప్పు, పెండ్లియే
కాదు గృహంబు లమ్ముకొని కట్నము లర్పణ సేయకున్న నీ
మాదిరి నాఁడు పుట్టు నవ మానపుఁబుట్టువు క్రింద నేర్పడెన్,
ఇంతకునూ మూల మిప్పుడు నేను జేయవలసిన దేమిటి?

గీ. పయిక మాశించి దిగిన యబ్బాయి చేత
బొందు కట్టించుకొని తృప్తిఁ బొందఁ దగున?
తల్లిదండ్రుల నెదిరించి, తగవు పెంచి
మొండికెత్తినయట్లు కూర్చుండఁ దగున!

కమ:- అక్కా, అక్కా! యీ యాశ్చర్యము విన్నావే. (అని యఱచుచు వార్తాపత్రిక చేతఁబట్టుకొని చరచరఁ బ్రవేశించును)

కాళిం:- ఏమిటది?

కమ:- ఇదిగో చదివెద వినుము. "ఓరుగల్లులో నొక యువతి యొక యువకుని వరించెను. ఆ యువకుఁ డారువేలు కట్నమిచ్చినఁ గాని యామెను బెండ్లి యాడనని నిరాకరించెను. ఆమె తల్లి దండ్రులా విత్త

మీయలేక, అన్య సంబంథమును సిద్ధపఱిచిరి. ఆ యువతి ఆ యువకుం దక్క నన్యుని బెండ్లియాడుట కిష్టము లేక యారాత్రి విషపానముచేసి మరణించెను ఈ వరశుల్కములు ఫలితమింతవఱకు వచ్చినది.

కాళిం:- సెబాసు! చాల చక్కనిపని చేసినది!

గీ. పుట్టినపుడె లిఖియించు గిట్టు మనుచు
సకల జీవుల నొసట జలజభవుఁడు
ఇట్టిచో నంతరాత్మ స హింపని పని
కొడ, బడుటకంటె జచ్చుటే యుత్తమంబు.

కమ:- అట్టిసాహస మందఱకు నలపడుట యెక్కడ? కాని అమ్మ యన్నమునకుఁ బిలుచుచున్నది. పోవుదము రమ్ము.

కాళిం:- నాకింకను నాఁకలి యగుటలేదు. నీవుపోయి భుజింపుము.

కమ:- అయ్యో! నీయాకలి అక్షయముకాను! ఇప్పుడెంత ప్రొద్దు పోయినదో యెఱుగుదువా? నాన్నగారు భోజనముచేసి, నారాయణ దాసు గారి హరికథలోనికి వెళ్ళినారు. అమ్మ మనకొఱకట్టె యున్నది.

కాళిం:- సరేకాని యొక్కమాట, ఇంటనిప్పుడు సొమ్మేమియులేదు గదా, యీ కట్నపుసొమ్మెట్లు వచ్చినదో నీకేమైన తెలియునా?

కమ:- పోతునూరులోని పొల మమ్మివేసినారు.

కాళిం:- శ్రీరామ రామా? చివర కిదికూడానా?

కమ:- ఏమి చేయమనెదవు? ఈ దినములలో బిడ్డలం బడయుట యిందులకుఁ గాక మరెందులకనే నీ యభిప్రాయము?

ఆ. కొడుకు పుట్టి చదువు కొఱకుఁ దాతలనాటి
మడులు మాన్యములును దుడిచివేయఁ
గూఁతు రవతరించి కొంపలుం గోడు ల
మ్మించుచుండె పెండ్లి లంచములకు?

కాళిం:- నిజమే! నిజమే! అదిగో అమ్మ పిలుచుచున్నది. వెళ్ళు.

కమ:- నీవు కూడా రమ్ము?

కాళిం:- నా కాకలి లేదని చెప్పలేదా? తలకూడా నొచ్చుచున్నది. తక్షణమే పండుకొనినగాని తగ్గదు. (అని తివాచిపైఁ గూలఁబడును)

కమ:- సరే నీ యిష్టము! (అని నిష్క్రమించును)

కాళిం:- హా హా! అపది ఎకరములు విక్రయించి అల్లునకుఁజెల్లించుచుంటిరిగా గదా! అవల నీగతి యేమి కావలసినది? మా ప్రాణముల కుసూరుమనుచు మలమల మాడవలసినదేనా! ఈ మాట వినికూడా నేనీ దుర్న్యయ కార్యమున కెట్లు సిద్ధపడుదును దైవమా? యింతల కేదియు దారి యగపడుపవా? (స్మృతితో) అన్నట్లు దారికేమి? అపూరూపమైనదారి యాయోరుగంటి యువతి యగపఱచియే యున్నది. ఆ దారిని నేను మాత్రమేల యనుసరింపగూడదు? ఈశ్వరాదేశమున కూడా నదియె కాకున్న ఈ పూటనె యావార్త యేల చెవిని బడవలెను? కమలయేమన్నది? "అట్టిసాహస మందఱకు సులవడునా యెక్క" దనియా? కాళిందీ? నీవీపాటి సాహసమునకు గన్నులు మూసికొని సిద్ధపడలేవా? మానము కాపాడుకొనలేకున్న మానవతి యనిపించుకొనఁగలవా? చెఱుపునుండి మరలించినదే స్నేహము. పాపరహితమైనదే పని. పుణ్యమార్జించినదే బుద్ధి. అనుభవించినదే యైశ్వర్యము. స్వాతంత్ర్యము కలిగినదే జన్మము. మర్యాద గాపాడుకొన్న వాఁడే మగవాడు. మానము దక్కించుకొన్నదే మగువ. ఇప్పుడు తప్పిన నీవిక నెన్నఁడును జావకుండ బ్రతకగలవా? ఏనాడు ప్రాణులుతల్లికడుపున బడునో ఆనాడె మృత్యువు కూడ వెంటపడును. శిశువు పుట్టగానే ముందు మృత్యువు ముద్దుపెట్టుకుని తరువాత దాదికిఁ బిదపఁ దల్లి కిచ్చును. అట్టి స్థితిలోఁ జావున కంత సందేహింపవలసిన పని యేమున్నది? లెమ్ము. లేచి నీతల్లిదండ్రులకొక లేఖ వ్రాసి అవమానకరమైన నీయాడుబొందినింతటితో విడిచిపెట్టుము (అని దిగ్గునలేచి గదితలుపు మూసి) అవునుగాని ఆత్మహత్య అపకీర్తిని, అధోగతికిని గూడా గారణము కదా. అట్టిపని చేయవచ్చునా (క్షణమాలోచించి) అయ్యో! నా మతికాల! నన్ను నేనేఘోర పెట్టుకొనుచుంటి నేమి? బుస్సీ కంట పడనొల్లక బుగ్గియైన బొబ్బిలి వెలమ యాఁడువారి పోడిమి తగ్గినదా? రుస్తుంఖానుని వశమగుట కిష్టములేక రుధిరాంబరములతో వగ్నిఁబడి రూపుమాసిన పెద్దాపురం క్షత్రియాంగనల పెంపు సన్నగిల్లినదా? ఆయుధముచే నరులం బరిమార్చుట హత్యకాక వీర ధర్మ

మగునపుడు, భర్తతో సహగమనము సలుపుట బలవన్మరణము కాక పాతివ్రత్యమగునప్పుడు, అవమానమును, దప్పించుకొనుటకై ప్రాణములను విడుచుట ఆత్మారాధనము కాక, ఆత్మహత్య యెట్లగును? కాదు ముమ్మాటికిని గాదు. ఈత్యాగమువల్ల నాగౌరవము నాకు దక్కుటయేకాక తల్లిదండ్రుల ధననష్టము కూడఁదప్పును. (అని వ్రాఁతబల్లకడకుఁ బోయి యుత్తరము వ్రాసి మడిచి, బల్లపై నుంచిలేచి) ఓ గదీ నీకొక నమస్కారము! ఓ శయ్యాదులారా మీకు సాష్టాంగప్రణామములు [రాట్నముకడకుఁబోయి ముద్దు పెట్టుకొని) నా ముద్దుల రాట్నమా యింతటితో నీకును, నాకును ఋణము సరి గడియారపు ముల్లువలె నీయాకులెప్పుడును గదులుచునే ఉండుఁగాక! నీ మధురగాన మెల్లప్పుడు నిఖిలదిసలయందును ధ్వనించుచునే యుండుగాక! కడపటి సేవగా నిన్నొక్కసారి కదిపి మఱిపోయెద! (అని రాట్నము తిప్పి నూలుతీసి) ఈ బారెడు పోగును నాభక్తికి నిదర్శనంగాఁ ప్రపంచమున నుండునుగాక! (అంతట తెర యెత్తగా పెరడును, బావియు గోచరించును. అటునిటు జూచుచు, మెల్లగాఁ బెరటిలోని కరిగి) నా కంటె ముందు పుట్టిన నవమల్లికా నమస్కారము కమలయు నేనును గష్టపడి పెంచిన చేమంతులారా! మీకుఁజేమోడ్పు (అనుచు బావికడకుఁబోయి) ఓ పరమేశ్వరా! ప్రయోజనార్థమై నీవు ప్రసాదించిన యీ శరీరము నిట్లు బావిపాలు చేయుచున్నందులకు మన్నింపుము. ఓ తల్లిదండ్రులారా, నన్నుఁ గని పెంచినందులకు మీకివిగో నా కడపటి వందనములు. కాళింది యను కూఁతును గననే లేదనుకొనుఁడు గాని గర్భశోకముచేఁ గృశింపకుఁడు! భరతమాతా! ప్రణామములు. తల్లీ నీవే నిర్భాగ్యస్థితిలో నుండునప్పుడు నీ తనయుల కేమిదారి చూపగలవు? ఓ పాలకులారా మీ పన్నులగౌరవమే మీది కాని ఆపన్నులగు నాఁడుపడుచుల పన్నుల గౌరవ మేకక్కఱలేదు. గదా! వంగరాష్ట్రి శిక్షాస్మృతులేకాని, వరశుల్క శిక్షాస్మృతులను గల్పింపరు గదా, ఓ సంఘ సంస్కర్తలారా! ఉపన్యాసవేదికలపై నూఁదర గొట్టుటయే గాని, మీరేకరు పెట్టు ధర్మముల నైన మీరనుష్ఠింపరేమి? పాచినోటనె కాఫీ ప్రాతఃకాలము కాఁగానే క్షౌరము, మై గుడ్డతో తిండి, మదరాసు కాఫీ

హోటళ్ళలో టిఫిను ఇంటిలోఁగూడా నింగ్లీషు, బయటకు గూడ పాడు మొగము, గొల్లవాని చేతి రొట్టె, గొడారువాని చేతిసోడా, స్వమతము నెడ రోత, స్వధర్మమునెడ విముఖత, పదవులకై ప్రాకులాట, బిరుదులకై పీకులాట, దాస్యమునకు ముందడుగు, త్యాగమునకు వెనుకడుగు, ఇవితప్ప యింతవరకూ సంఘమునందు మీరు ప్రవేశపెట్టిన సంస్కారములగపడ వేమి? ఓ దేశసేవా దురంధరులారా! ఈ కట్నములదుర్న్యయమునుగూర్చి మీ రించుకయిననాలోచింపరేమి? శుల్కమననేమి సుంకము సుంకమననేమి పన్ను. ఈ పన్ను చెల్లించినఁగాని బాలికలకు భర్తృ యోగము లేదట. ఇంతకు మించిన యవమాన మింకేమున్నది. మీ బిడ్డల యావమానమును దప్పించలేని మీరు, మీ దేశమాతయవమానమేమి తప్పింపగలరు? మీయల్లుర పన్నుల నడ్డుకొనలేని మీరు, మీ దొరతనమువారి పన్నులనేమి యడ్డుకొనఁగలరు? ఎన్నెన్ని సంసారము లేటఁ గలసిపోవుచున్నవో యెఱుఁగుదురా! ఎందఱాడుఁబిడ్డల తండ్రులు ఏమిగతి దైవమా యని యెత్తుపడియున్నారో చిత్తగించితిరా, కాసునకు గతిలేనిఁవాడు, కడుపుచీల్చి కంచుకాఁగడాలతో వెదకిన గాసింత యక్కరముక్క కానిపింపనివాడు, కన్యనిచ్చెదమనగాఁనే కట్నము కొఱకెంత బిఱ్ఱబిగియుచున్నాడో గమనించితిరా? ఆఁడుపడుచుల యవమానమునిట్లలక్ష్యము సేయుచున్న దేశమున కయ్యయో అన్న వస్త్రములుండునా! మగబిడ్డలంగన్న యొయార్యులారా కొడుకు పుట్టినది మొదలు, కొండంత యాశతో, కలలోగూడ కట్నములనే పలవరించు కలికాల పిశాచములారా! మీరు పుట్టినదిమాత్ర మాఁడుపుట్టువు కాదా? ఆడపడుచు,నిట్లవమానపరచుట యిమ్ములను మీరవమాన పరుచుకొనుటకాదా? ఇకనైన బుద్ధితెచ్చుకుని మీదురాచారమును విడువుఁడు, విడువకున్న కాళింది యుసురు మీ కంఠములకు జుట్టుకొనక మానదు. ఓయాఁడుబిడ్డలంగను నదృష్టహీనురాండ్రా, ఆఁడుబిడ్డ పుట్టగానే అవలనైనఁబారవేయుఁడు గాని అడిగిన లంచమిచ్చి పుస్తె కట్టించి అవమానముపాలు, మాత్రము చేయకుఁడు! చెల్లీ కమలా! యిరువురమొక కంచమునఁ దిని యొక మంచమునఁ బరుండి పెరిగినవార మగుటచే నిన్ను విడిచి పోవుట

నాకు నిజముగ దుస్సహముగానే యున్నది. తప్పనిసరియైనచో, నీవుగూడ నీదారినే యనుసరింపుము కాని, అవమానమున కొడంబడి, నీయక్కక ప్రతిష్ఠమాత్రము కలిగింపకుము! ఓ శరీరమా నీయవమానమును దప్పించుటకై, నిన్ను విడనాడి పోవుచున్నాను. ఓ జీవితమా నీకు జీరకాలచింత లేకుండ జేయుటకై, నీ లెక్క ముగించుచున్నాను? ఏమి హృదయమా యేమి చేయుచున్నావు? నీవు నిర్మలముగా నుండవలసిన నిముసమిదియే! సాహసమా నీవు సాయపడవలసిన సమయమాసన్నమైనది. పిరికితనమా! నా దరికి రాకుము. దాక్షిణ్యమా నీవు దవ్వులకుం బొమ్ము. మోహమా నీవు మొద్దువలె బడియుండుము. ధైర్యమా! నీవు దాపునకురమ్ము. కన్నులారా మీ కడసారి చూపులు కానిండు (చీర చెంగును బిగించుకొని బావికి ప్రదక్షిణము చేసి) ఓ కూపమా నా తొలిస్నానము నీ నీటితోనైనది, నా శరీరము నీ నీటితో బెరిగినది. నా తుదిస్నానము కూడ నీ నీటితోనె కావించి నీవు పెంచిన శరీరమును నీకే సమర్పించుచున్నాను. వినుట అభినయించి అదిగో ఆకాశవాణి-నన్నమ్మాయీ రమ్మని పిలుచుచున్నది. అమ్మా, ఇదిగో వచ్చుచున్నాను హా పరమేశ్వరా (అని బావిలో పడును).

ఇది పంచమాంకం

0...0

షష్ఠాంకము

మొదటి రంగము

(ప్రదేశము: లింగరాజుగారి వ్యాపారపు గది)

లిం:-(బల్లకడ గూరుచుండ ప్రవేశించి) ఈ క్రొత్త గింజల దిన ములలోఁ గోమట్లు బదుళ్ళకొరకు గొంపచుట్టు దిరిగెడివారు, ఈయే డింత వరకు వచ్చి యగిడిన వారే లేరు!

గీ. ఆస్తి కలిగి తీఱుపలేని యప్పె యప్పు,
నూరు గొని వేయికై వ్రాయు నోటె నోటు,
పసిడి తాకట్టుపై నిచ్చు బదులె బదులు.
రోజు వడ్డీలు వచ్చిన రోజె రోజు.

ఘంట:-(వచ్చి) బాబూ! బట్టలు కొనుక్కుంటాను. జీతమిస్తారా?

లింగ:- నీ బట్టలు పాడుగాను! ఎందుకురా బట్టలు! గాంధి మహాత్ముని జూదరాదా, గావంచ కట్టుకొని తిరుగుచున్నాడు.

ఘంట:- గాంధిగార్ని మెచ్చుకుంటారు గదా ఖద్దరు కట్టరేం మీరు?

లింగ:-ఆ విషయంలో, ఆయనకు మతిలేదురా? కట్టు కట్టు మనుటయే కాని, ఖరీదు తగ్గే సాధనము చూచినాడు కాడు.

ఘంట:—మీకున్నమతి ఆయనకు లేదుగాని నా జీతం మాటేమిటి?

లింగ:-అనక చెప్పెదగాని అమ్మగారేమి చేయుచున్నది?

ఘంట:- గదిలో కూర్చుండి కథలు చదువుకుంటున్నారు.

లింగ-:నిన్నా వైపునకు వెళ్ళవద్దంటిని గదా! యెందులకు వెళ్ళినావు?

ఘంట-: బాగానే వుంది? ఏవైపూ వెళ్ళక యెలాగండీ? ఆవైపుకు

వెళ్ళితే అమ్మగార్ని కొరుక్కుతినేస్తానా? [అని నిష్క్రమించును]

లింగ:- పెంకికుంక! ఫెడేలున నెంతమాటన్నాఁడో! అయినను వానిననవలసిన పనిలేదు! ఈడు కడచిన వెనుకఁ బెండ్లి యాడిన బుద్ధిహీనుల కిట్టి చెప్పుదెబ్బలు తఱచుగా తగులుచునే యుండును!

సీ. ప్రాయఁ ముడిగి యేండ్లు పైఁబడ్డ తరి భ్రాంతిఁ
  జెంది రెండవ పెండ్లి చేసికొనుట
ఆస్తి దాయాదుల కగు నను చింతచేఁ
  బెరవారి బిడ్డను బెంచుకొనుట
క్రొత్తలోఁ జూపు మక్కువ లెల్ల మది నమ్మి
  అత్తవారింటను హత్తుకొనుట
అప్పుల వారిని దప్పించుకొన సొత్తు
  లితరుల పేర వ్రాయించి యిడుట
పుడమి, నీనాలుగుం జాల బుద్ధిమాలి
నట్టి పనులని పల్కుదు రార్యులెల్ల
రందు, మూడవ పెండిలి యాడినట్టి
బడుగు నగు నన్నుఁ గూర్చి పలుకనేల

బస:- [పత్రిక చేతఁబట్టుకొని ప్రవేశించి] నాన్నా! ఆ సంగతి పత్రికలో గూడ పడినది సుమా!

లింగ:- ఏ సంగతి?

బస:- ఆ పిల్ల బావిలో పడి చచ్చిన సంగతి. నా క్లాసు పిల్లలందరు నిది చదివి, నన్నుఁ గాకులవలెఁ బొడుచుకొని తినుచున్నారు! పాడు కట్నము కొఱకు నీ వెందుల కంత ప్రాకులాడవలెను నాన్నా!

లింగ:- ఓరి దామోదరుఁడా! సర్వము విడిచిపెట్టిన గాంధికి స్వరాజ్యము కొఱకంత ప్రాకులాట యెందులకురా?

బస:- ఆయన ప్రాకులాట యంతయు నాయన కొఱకా?

లింగ:- నా ప్రాకులాట మాత్రము నా కొరకా? నీ తెలివి తెల్లవారినట్లే యున్నది. కాని ఏది ఏమి యేడ్చినాఁడో చదువు!

బస:- [చదువును]

"మా పురమునందలి పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులు గారి కుమారైను లుబ్ధాగ్రేసర చక్రవర్తి యగు సింగరాజు లింగరాజుగారు తన కుమారునకుఁ జేసుకొనుటకై, అయిదువేల అయిదువందల రూపాయల కట్నము విధించి, యా సొమ్ము కార్యమునకు ముందే కాఁజేసిరి! కట్నపు పెండ్లి యెడ నిష్టము లేక కాళింది యను చిన్నది తల్లిదండ్రుల కొక యుత్తరము వ్రాసి తన బల్లపైనుంచి బావిలోపడి ప్రాణములు విడిచెను! ఆ యుత్తరము నందున్న మాటలివి-

"నా ప్రియమైన తల్లితండ్రులారా! నమస్కారములు! కట్నమిచ్చి తెచ్చిన వరునిచేఁ గళ్యాణసూత్రము కట్టించుకొనుట గౌరవహీనమనియు-నా వివాహమునకై మీరు సర్వస్వము సమర్పించుట నా క్షేమమునకును, మీ సౌఖ్యమునకు గూడ భంగకరమనియు భావించి-ఈ రెంటియొక్కయు నివారణమునకై నేనీ లోకమును విడిచిపోవ నిశ్చయించుకొని, యీ జాబు వ్రాసి యిచ్చటి నుంచి యనుజ్ఞ తీసుకొనుచున్నాను. అమ్మకాని, మీరు కాని, నాకై అణుమాత్రమును జింతింపవలదని ప్రార్థించుచున్నాను. మీ యిరువురకును బునః ప్రణామములు. చెల్లెలికి ముద్దులు!

ఇట్లు విన్నవించు మీ యనుంగు పుత్రిక "కాళింది"

"ఒక పౌరుడు"

లింగ:- [ఆగ్రహముతో] ఈ పౌరుఁడెవ్వడో తెలిసికొని పరువు నష్టము క్రింద బదివేలకు దావా పడవేయవలసిందే! ఈ లుల్లిగానికి నేను లుబ్ధాగ్రేసర చక్రవర్తినట. ఏమి పొగరు.

పేర:- [అంతలోఁ బ్రవేశించి] అంతమాట మిమ్మనగలవాడెవడు!

బస:- [లేచి చక్కఁబోవును]

లింగ:- రావోయి పేరయ్యా! రా; ఏమిటి విశేషాలు?

పేర:- [కూర్చుండి] ఏం చెప్పమ? భ్రమరాంబగారి దుఃఖం పట్ట లేకున్నాం.

లింగ:- అది సరే కాని ఆ చచ్చిన దెష్ట ఆ ముడి కాసింతయు పడిన తరువాతనైన జచ్చినది కాదేమోయి?

పేర:- అవునవును. అలాజరిగితే ఈ భూమిదక్క, ఈ అయిదు

వేలూ దక్కి యీపాటి కింకో అయిదువేలకు ఒేరం తగిలేది.

లింగ:- అదిగో అదే నాకు పట్టుకున్న బాధ! చావునకేమి యెప్పు డైనఁ జావవలసినదే. రవంత సందర్భానుసారముగఁ జచ్చినబాగుండెడిది! సరికాని యీ సొమ్ము మాట యేమయిన వచ్చినదా?

పేర:- ఎందుకురామా? ఆ సొమ్ముకోసమే నేనిపుడు వచ్చింది.

లింగ:- అలాగునా? అయితే, ఆ సొమ్మంత మీద మీదఁ నున్నదా? నే నెంత ప్రయత్నము చేసినానో ఎంతైనదో ఎరుగుదువా?

పేర:- ఆ నష్టం మినహాయించుకొని మిగతా సొమ్మే యివ్వండి?

లింగ:- ఇవ్వని యెడల?

పేర:- దావా వేస్తాడు.

లింగ:- సాక్ష్యము?

పేర:- మీ రసీదులే!

లింగ:- పేరయ్యా! నేనంత పెయ్యమ్మనా? నా దస్తూరివలె వ్రాయ లేదు, నా సంతకము వలె చేయలేదు. నన్నా రసీదు లేమి చేయును?

పేర:- [తనలో] ఆరి ముండాకొడకా! అయిదువేలూ మింగి వెయ్యాలనే కావోసు! [పయికి] అంత పనొస్తే మేమందరం లేమూ!

లింగ:- అందఱ మాటయు నావల చూతముగాని ముందు నీమాట చెప్పు. నీ యెదువందలు మరల క్రక్కుట నీ కిష్టమేనా?

పేర:- కార్యం తప్పి వచ్చినప్పుడు కక్కక ఏం చేస్తాం?

లింగ.- ఇదిగో యిదే వైదికము! ఈ మాట నియోగియైన వాఁడనునా?

పేర:- అదుగో ఆ మాటలు మాత్రం నేనంగీకరించను. మావాళ్ళి ప్పుడు మీవాళ్ళ నమాంతముగా మింగేసే వాళ్ళయినారు. మీవాళ్లమీసాల మీద నిమ్మకాయలు నిలబెడితే, మా వాళ్ళు మామిడికాయలు నిలబెడు తున్నారు? మీవాళ్ళు జుట్టుమానేస్తే మావాళ్ళు బొట్టు కూడా మానేశారు! మీవాళ్ళు మూరెడు గోచీ పెడితే మావాళ్ళు బారెడు గోచీ పెడుతున్నారు! మీవాళ్ళు వ్రేలెడు చుట్టకాలిస్తే మావాళ్ళు జానెడుచుట్ట కాలుస్తున్నారు!

మీవాళ్ళు కాఫీహోటేళ్ళకుపోతే మావాళ్ళు రెవరేషుమెంటు రూములకు పోతున్నారు విన్నారా? ఇన్ని మాటలెందుకూ? ఇప్పుడు మీరన్న మాటల్లో యేం నియోగముంది? ఆనక కొట్టమాట ఆలోచించుదాం. యీసంగతి పైకి వస్తే పదిమందీ మిమ్మల్ని బ్రతుకనిస్తారా? ఈరోజుల్లో యింత చప్పని ఆలోచన మేము చేస్తామా?

లింగ:- ఆట్లయిన, నీకమ్మని యాలోచనయేమో కాసింతచెప్పుము.

పేర:- అదిగో అల్లా అడగండి, ఆసొమ్మూ, ఆ భూమీ దక్కించుకోవాలంటే ఆ రెండోపిల్ల నెల్లాగయినా చేసుకోవడమే సాధనము. మఱియే దారి త్రొక్కినా మర్యాద పోక మానదు.

లింగ:- అందుల కాయన యంగీకరించుట లేదని విన్నానే.

పేర:- అది నిజమే. అయినా, నన్ను ప్రయత్నం చెయ్యమంటే చేస్తాను.

లింగ:- ప్రయత్నము చేయుట కాదు. పనియే చేసికొని రావలయును.

పేర:- సరే నాశక్తి యావత్తూ ధారవోస్తాను. శలవు.

(నిష్క్రమణ)

లింగ:- ఇంటను బయటను గూడ నల్లరి పడుటకన్న నిదే మంచి పని. పోయెనా దానితో పాటుగ నిది గూడ పోనే పోవును. లేదా అది యున్నది; నే నున్నాను.

[తెర పడును]

రెండవ రంగము

ప్రదేశము : పురుషోత్తమరావుగారి కచేరి చావడి.

ప్రవేశము : క్రిందఁ గూర్చుండి యొకవంక పురుషోత్తమరావుగారు, పేరయ్య, మఱియొక వంక కమలను ముందిడుకొని భ్రమరాంబ.

పురు:- చివరకు దేలిన యంశమేమి?

పేర :- ఏం తేలిందని మనవి చేయను? మీరు నాన్‌కోపరేటర్లనీ, కోర్టుకు వెళ్ళరని ఆయనకు బాగా తెలుసును. అందుచేత అంత మొండి కెత్తి కూర్చున్నాఁడు.

పుర:- అందులకిప్పుడు మన మాచరించవలసిన పని యేమిటి?

పేర:- నేనేం మనవి చెయ్యను? కోటి వరహాలు పోయినా మీరు కోర్టుకు వెళ్ళడం ధర్మము కాదు. అకారణంగా అంత సొమ్ము పోగొట్టు కోవడం అంతకన్నా ధర్మం కాదు. ఈ చిక్కులన్నీ ఆలోచించే చిన్న మ్మాయి నా చిన్నవాడికే యిస్తే తీరిపోతుందని మనవి చేశాను.

పుర:- అయిదువేల యేదువందలు నా బ్రాహ్మణుఁడు హరించినను సరియే కాని యిక నాయనతో సంబంధము నాకిష్టము లేదు.

చ. పరువుఁ బ్రతిష్టయుం గనక, పాపభయంబను మాటలేక యి
క్కరణి ధనంబె జీవితముగా దలపోసెడు వానితోడఁజు
ట్టరికముచేసి, నిత్య మకటా! యని చింతిలుకంటె, గౌరవా
దరుపరు లౌ గృహస్థుల పదంబులపైఁ బడవైచుటే తగున్!

పేర:- బాబూ! యీ విషయములో మీరిల్లాటి పట్టుదల పెట్టుకోవల సిన పనిలేదు. ఆయన మీద రోతచేత ఆయన పిల్లవాణ్ని పోగొట్టుకోవడం వా యభిప్రాయము కాదు. ఏబయ్యేళ్ళ ముండాకొడుకు ఎన్నాళ్ళుబ్రతుకు తాడు. ఆ తరువాత పెత్తనమంతా అమ్మాయిదే. అవన్నీ అటుండఁగా అంత సొమ్ము ఆయన చేతులలో చిక్కుబడ్డప్పుడు అదుసు త్రొక్కడమా అని సందేహించడం ఆలోచన తక్కువ పని కాదూ? అమ్మా! మీరల్లా వలపోస్తూ ఏమీ చెప్పకపోతే యెలాగ ? యేదో విధంగా మరచిపోవాలి కాని యెల్లకాలం అదేపనిగా విచారిస్తూ వుంటే యెల్లా సాగుతాయి వ్యవహా రాలు ?

భ్రమ:- (కన్నీటితో) అయ్యా పేరయ్యగారూ!

ఉ. ఆ మనుబెక్కు, లా పెదవు, లా మొగ మా మురిపెంపు
భ్రూయుగం
బానొాస, లా శిరోరుహము, లా మృదువాక్యము, లా మృదుస్వరం
బా వయనంబుఁ, లా నడక, యా వినయం బకటా! సుషుప్తియం

దేనియు సాధ్యమే మఱువ నీ దురదృష్టపు జీవితంబునన్

సీ. ఎన్నడుఁ నామాట కెదురు చెప్పఁగలేదు
తండ్రి గీచిన గీటు దాటలేదు!
బడియన్న నెన్నఁడు బ్రాలుమాలఁగ లేదు!
రాట్నంబు నెడలఁ బరాకు లేదు!
అది నాకుఁ గావలె నని యెన్నఁడనలేదు!
కుడుచున్నప్పుడుఁ గూడ గొడవ లేదు!
ఆటలయందైన నలుక యెన్నఁడు లేదు!
పొరిగింటి కేనియుఁ బోకలేదు!
కలికమున కేనియును నోటఁ గల్లలేదు!
మచ్చునకు నేనియుం బొల్లుమాట లేదు!
అట్టి బిడ్డను బ్రతికియున్నంత వరకు
మరువ శక్యమె! వెఱ్ఱి బ్రాహ్మణుఁడ నాకు!

పురు:- అహర్నిశము లిట్లు వలపోయుచు ఆ బిడ్డ నడలఁగొట్టెదవా ?

తే. గీ. ఎంత చెప్పిన విన విది యేమి వెఱ్ఱి
యెవరి పనియైన తరువాత నెవ్వరుండ్రు ?
నాటకములోని వేషగాండ్రకును మనకు
నించుకేనియు భేదమందేని గలదె!

పేర:- అంతేనమ్మా! అంతె. బొమ్మలాటకాడేంచేస్తాడు? ఏ బొమ్మ పనికి వచ్చినప్పుడా బొమ్మను తెరమీది కెక్కిస్తాడు. ఆ బొమ్మ పని కాగానే అడుగున పారేస్తాడు. అలాగునే భగవంతుడూను! ఇంతెందుకూ? ఇరవయేళ్ళ నుంచి వున్న పొడుంకుండు మొన్ననిట్టె పగిలిపోతే, నేనేమి చెయ్యగలిగాను? ఏడిస్తే వచ్చేలాగుంటే యెన్నాళ్ళేడవమన్నా యేడుస్తును.

పురు:- ఏమే? యీ విషయమునందు నీ అభిప్రాయమేమిటి ?

భ్రమ :- (కన్నులు తుడుచుకొని) మన యభిప్రాయములకు ఫలితముగా మనకు జరగవలసిన శాస్తి జరగనే జరిగినది. యింకను మన యభిప్రాయముల మీదనే నడిచినచో ఈ యమ్మ కేమి బుద్ధిపుట్టునో

యెవరు చెప్పగలరు? కావున, దాని యభిప్రాయము తెలుసుకొని దాని యిష్టమెట్లో యట్లే జరిగింపుడు.

పేర:- అదీ బాగానే వుంది. అమ్మాయి! నీ యభిప్రాయమేమిటో చెప్పమ్మా! నీకా చిన్నవాణ్ణి నిశ్చయించమంటావా? లేక అయిదువేలా అయిదు వందల పది రూపాయలూ- ఆ బ్రాహ్మడికి అర్పితముచేసి వూరుకోమంటావా!

కమ:- [తనలో] ఇప్పుడు నా కర్తవ్యమేమిటి? అక్క సిద్ధాంతమునే యనుసరింపదగునా? అందులకు భిన్నము గావించి తలిదండ్రులకుఁ దాత్కాలిక మనశ్శాంతిని గలిగింపదగునా: అక్క చెప్పిన వాక్యములన్నియు నాణెముత్తెము కోవలు. కట్నాలరాయలచేఁ గళ్యాణ సూత్రము గట్టించుకొనుటకంటె గతిమాలినపని మఱిలేదనుట నిశ్చయము. అట్టి వివాహము నాకును నంగీకారము లేదన్నచోఁ దలిదండ్రులు నన్నుఁ బలవంతపెట్టరనుటయు నిశ్చయమే. కాని. దానివల్లఁదేలు పర్యవసానమేమి? అయిదువేల యైదువందలు నా దుర్మార్గుని పొట్టను బెట్టించుట తప్ప మరేమియు లేదు. అందువల్లఁ నా దారి విడిచిపెట్టి యా సంబంధమునే యంగీకరించి, పణమునకుం దగిన ప్రాయశ్చిత్తము చేయఁగలిగినచో వీరిచ్చిన ద్రవ్యము వినియోగములోనికిఁ దెచ్చినదాన నగుటయేగాక అక్క కసితీర్పఁగలిగినదాననై ప్రపంచమున కొక పాఠము నేర్పినదానను గూడ నగుదును. అయితే అట్టి ప్రతీకార మే విధముగాఁ జేయగలుగుదును. (ఆలోచించి) సరే కానిమ్ము.

గీ. కట్టె మధియంప యింపఁ గలుగు నిప్పు;
భూమి త్రవ్వంగఁ ద్రవ్వంగఁ పుట్టు నీరు;
పెరుగుఁ తరువంగఁ దరువంగఁ పేర్చు వెన్న;
కన్పడదె దారి యోజింప గార్యములకు?

పురు:— అమ్మాయి! ఆయన యడిగిన మాటకు బదులుచెప్పవేమి? సందేహ మక్కరలేదు. నీ యభిప్రాయమేమో స్పష్టముగా జెప్పు. నిన్నిమే మించుకయు నిర్బంధించువారము కాము.

కమ:— [తలవంచుకొని] మీ యిష్టము.

పురు:- మా యిష్టము కొరకుఁ జూడవలదు. నీ యిష్టమే మా యిష్టము. నిశ్చయముగా నీ యిష్ట ప్రకారము జరిగింతుము.

కమ:- [కొంచెమాలోచించి] ఈ వివాహమునకు సంబంధించిన యితర విషయములలోఁ గూడ నా యిష్టానుసారముగా నడువనిత్తురా ?

పురు:- సందేహమేమి. సర్వత్రా నీ యిష్టమే మా యిష్టము. ఈ మాటకు నే నిసుమంతయు దప్పిపోవువాఁడను గాను.

కమ:- అట్లయిన నా కంగీకారమే !

భ్రమ:- [తలనిమురుచు] అమ్మా! ఆనక మా గొంతుక కోయక ఆలోచించిఁ మర్రీచెప్పుము!

కమ:- ఆలోచించియ్యే చెప్పినాను. అనుమాన మక్కఱలేదు.

పేర:- సెభాసు తల్లీ! నా మనస్సుకిప్పుడు నచ్చావు. సమయానికి లేకపోయింది. కాని వుంటే, వుద్దరిణెడు పంచదార నోట్లో పోస్తును.

పురు:- పేరయ్యగారూ! పెడయాలోచనము లింక నెందులకు ? సాయంకాలము మీరు వెళ్ళి సంగతి యాయనతోఁ జెప్పి, సరే యనిపించు కొని రండు [మెల్లగా] ఇంకొకటి; కార్య మీ నెలలోనే కావలెను, యేమ నెదరా? యీవిడగారీ సందడిలోఁ బడి ఇప్పటి వ్యసనమును, గొంతయిన మఱచిపోగలదు. [అని నిష్క్రమించును]

పేర:- బాగుంది బాబూ! బాగుంది. శలవు పుచ్చుకొని వెళ్ళి శెటిల్ చేసుకొని చక్కావస్తాను. అమ్మా! శలవు.

పురు:- [లేచి కమలనెత్తి యక్కునఁ జేర్చుకొని] తల్లీ!
ఆ ఏండ్ల కన్నఁ జాల హెచ్చగు బుద్ధి నీ
కిచ్చి మమ్ముఁదేర్చె నీశ్వరుండు
అక్క యట్లు చేసినందుల కిపైన
మాకు కనుల యెదుట మనఁగదమ్మ!

కమ:- [కొంచె మీవలకు వచ్చి తనలో]

ఉ. అక్కరొ! నీ మతంబునకు నడ్డముగాఁ జనుచున్న నా యెడన్
మక్కువ పీడబోకు మభిమానము లేనికతాన గాదు నే
నిక్కరణిం భ్రమించుట మఱేమన దేవుఁడు మధ్యవర్తిగా
నిక్కము దెల్పుచుంటి నిటు నీ కసి తీర్ప మదిం దలంచితిన్.

ఇది షష్ఠాంకము [తెర పడును]

స ప్త మాం క ము

మొదటి రంగము

ప్రదేశము: లింగరాజుగారి పడక గది

ప్రవేశము: కుర్చీ మంచముపై గూర్చుండి లింగరాజుగారు,
చేరువను నిలుచుండి సుభద్ర.

సుభ:- సరేగాని, నలుగురు నట్టింటికి వచ్చునప్పుడైన నా నగలు నా కీయఁగూడదా? ఇంట శుభకార్య మగునప్పుడు గూడా నేనిట్లు యుండవలయునా?

లింగ:- ఎందులకే యింత తొందర? ఎల్లుండి రాత్రికి గదా వివాహము? అకారణముగా నీ రెండు దినములు నలిగిపోవుటయే గదా?

సుభ:- అబ్బబ్బ! యెప్పుడు చూచినా నగ తఱిగిపోవుననియు, బట్టలు చిఱిగిపోవుననియు, బియ్యము తఱిగిపోవుననియు నిదే గోల కద! ఎందుకీ భాగ్యమంతయు?

గీ. స్వారిచేయని గుఱ్ఱంబు, చదువనట్టి
పుస్తకంబును, సేవింపఁబోని మందు,
నారగింపని వంటక, మనుభవింప
నట్టి ధనమును వ్యర్థంబు లనుట వినరె?

లింగ:- ఓసీ; యెందుల కేడిపించెదవు ? రేపిచ్చెద యూరకుండుము

సుభ:- రేపు శుక్రవారమని సున్న చుట్టుటకా?

లిం:- నేడు గురువారము, బొత్తిగా గూఁడనిది.

సుభ:- ఈ వన్నెవారిఁకఁ గోడలి కేమి నగలు పెట్టుదురు?

లింగ:- ఇక్కడికి నీ సంగతి యేమైనది? ఇఁకఁ గోడలి సంగ

తియా! అబ్బాబ్బా ఆఁడువాండ్రకీ యాభరణాల పిచ్చి ఎవడు మప్పినాఁడో కాని యేయింట జూచిన నిదేగోల గదా! ఏడు వారముల నగలుఁగల యిల్లాలు కూడ ఎదురింటి ముత్తమ్మ ముక్కుపుడక యెరవు తెచ్చుకున్న దాఁక నిద్రపోదు. తాలూకాలఁట, జిల్లాలఁట, లోలకులఁట, డోలకులఁట-వాచీ గొలుసులఁట, పేచీ గొలుసులఁట, అటుకుల గాజులఁట, యిటుకుల గాజులఁట, యెప్పటికప్పుడు ఏమేమో రకములలో దిగుమతియగుచున్నవి. కమసాలులకుఁ కావలసినంత పని. షరాబులకు జాలినంత బేరము.

సుభ:- మీవంటి భర్తలకు మాత్రము ప్రాణసంకటము!

లింగ:- సరేకాని చెప్పవచ్చిన మాటలు పూర్తిగా జెప్పనిచ్చినావే కావు, అనుదినము మన యింటికి వారు అరిసెలు, సున్ని, అప్పడము, వడియాలు, విధవల కని పిండి, స్వయంపాలకులకని యుప్పు, పప్పు, బియ్యం నేయి, అల్లము, బెల్లము, చింతపండు, మిరపకాయలు, కూరలు, నారలు, తలంట్లకని నూనె, నలుగుబిండి, కుంకుడు కాయలు, షీకాయ, కట్టెలు, పిడుకలు, సబ్బు, సాంబ్రాణి, పసుపు, కుంకుమ మున్నగున వన్నియును బంపుదురు. అన్నియు జాగ్రత్తగా నందుకొని ప్రక్కగదిలో భద్రపఱచి అరవనాఁడు నా కప్పగించవలయును.

సుభ:- ఎందు నిమిత్తము?

లింగ:- ఏకముగ బజారునఁబెట్టి యమ్మించుటకు.

సుభ:- రామ రామా! నలుగురు నవ్వరా?

లింగ:- నవ్వుట కేమున్నది? ఉమామహేశ్వరరావుగారు మొన్న నుప్పుతోఁ గూడ నూరను త్రిప్పి యమ్మించలేదా?

సుభ:- అట్లయిన సదస్యసంభావన కూడ ఆయన యిచ్చినట్లే యిచ్చెదరు కావలయును.

లింగ:-ఆయన కాని కానియైన నిచ్చినాడు. నే నఱగాని గూడా నీయను. పదిరూపాయలు పోలీసువారి మొగమునఁగొట్టి పందిటిచుట్టు పారావేసినచో పయిన సంభావన పనియుండదు.

సుభ:- చివరకు నా చీరల సంగతి కూడ నింతియేనా యేమిటి?

లింగ:- వెఱ్ఱి మొగమా నీకుఁ చీరల కేమిలోటు! అయిదురోజులు

నైదు చీరలు. అప్పగింతచీరతో నాఱు. ఆఱుచీరలు నారేండ్లు కట్టవచ్చును. ఒక్కచీరలేనా? నీకు రావలసిన లాంఛనములింకనూ లక్ష యున్నవి, అయిదు రోజులు అయిదు మొహిరీలు, అయిదు కాసులు, అయిదు వెండి పలుదోము పుల్లలు, అయిదు బంగారు తాటియాకులు, అయిదు వెండి పలుగుట్లు పుల్లలు, అయిదు వెండి కాఫీ కప్పులు, అయిదు వెండి యుప్మా ప్లేట్లు, అయిదు కుర్చీలు, అయిదు కాలిపీటలు, అయిదు మెత్తలు, అయిదు బాలీసులు, అయిదు బొట్టుపెట్టెలు, అయిదు అద్దములు, అయిదు దంతపు దువ్వెనలు, అయిదు కుంకుమ భరిణెలు, అయిదు కాటుకకాయలు, అయిదు గంధపు గిన్నెలు, అయిదు తలనూనె బుడ్లు, అయిదు సెంటు బుడ్లు, అయిదు సబ్బు పెట్టెలు, అయిదు పవుడరు డబ్బీలు, అయిదు చేతిరూమాళ్ళు అయిదు గంధపు చెక్కలు, అయిదు జేనా విసనకఱ్ఱలు, భోజనములో వెండిచేపలు, ఫలహారములో పసిఁడిపీతలు ఈలాంటి వింకను, నెన్నియో వచ్చును. అవన్నియు జాబితా వ్రాసియుంచినాను. సాఁగదీసి సకలము రాబట్టుకో. ఆ యైదునాళ్ళును నీ యధికారమున కడ్డన్న మాటలేదు.

గీ. గ్రామదేవత కొకనాఁడె కానుకలును
గొలుపులు న్వేటపోతులును గుంభములును;
బింకముగ నైదు దినములు పెండ్లికొడుకు
తల్లికొలు పక్క కొలువును దాసి కొలుపు?

సుభ:-సరేకాని పెండ్లికైన క్షౌరము చేయించుకొనెదరా లేదా?

లింగ:- అదిగో మొదలుపెట్టితివా!ఆ మాట మాత్రము మఱచిపోవు. అవల నాకుఁ జాలపనియున్నది పోయెద! (నిష్క్రమించును)

సుభ:- ఔరా! సృష్టివైచిత్ర్యము

చ. కనికరమా కనంబడదు కన్పడఁబోవదు ప్రేమ పొట్ట చీ
ల్చినఁ గనుపట్ట దెయ్యెడను సిగ్గున నట్టిది పాపభీతి మ
చ్చునకును గానిపింప డిఁక సూనృతమన్నది లేనే లేదు లో
భిని భువి నే పదార్థములు పెట్టి విధాత సృజింపఁ గల్గెనో?
అన్నిటికంటెను జిత్రమేమా!

గీ. ప్రాయకంబుగ రాజు దుర్మతినె పెంచు

మగువ తుంటరినే తన మది వరించు
అంబుదంబులు కొండలయందె కురియు,
లచ్చి పెనులోభి యింటికే వచ్చి తనియు

అయినను వీరి ననవలసిన పనిలేదు. ఐశ్వర్యమునఁ గాలచక్రమువలె నదే పనిగఁ దిరుగుచుండునది కాని యొకచోటనే యుండెడిది కాదు!

గీ. బేదదాని కొడుకు పెనులోభియై కూడ్చు
నతని కొడుకు త్యాగియై చరింతు,
త్యాగి కొడుకు మరల దారిద్ర్యయుతుఁడగు;
సిరులు చక్రమట్లు తిరుగుచు నిట్లు

(తెరపడును)

రెండవ రంగము

(ప్రదేశము : పురుషోత్తమరావుగారి పెరటిలోని పెండ్లి పందిరి)

పురు:- (కన్యాదాత వేషముతోఁ బ్రవేశించి) ఈ ప్రొద్దు మూడవ దినము ఇఁక రెండు దినములు గడుపవలెను. ఆడుపిల్లలకుఁ బెండ్లి చేయుట కంటె అశ్వమేధయాగము సేయుట సులభము.

సీ. తెల్లవాఱఁగనె బిందెలతోడ నీళ్ళను
పలుదోము పుల్లలఁ బంపవలయు
కావిళ్ళతో వెన్న, కాఫీయు, దోసె, లి
డ్డెనులు, నుప్మాయు నడిపింపవలయు
తరువాత భోజనార్థము రండు రండని
పిలిచినవారినే పిలువవలయు
కుడుచునప్పుడు పంక్తి నడుమ నాడుచుం బెండ్లి
వారి వాంఛలు కనిపెట్టవలయు
నొకఁడు రాకున్న వానికై యోర్పుతోడ
మంచినీరైన ముట్టక మాడవలయు

నిన్నిటికి సైచి, వలు వ్యయించి, గా

వించినను నిష్ఠురముతె ప్రాప్తించు దుదకు!

ఘంట:- (ప్రవేశించి) అయ్యా! వియ్యపురాలుగారు లేచే వేళ య్యింది, అమ్మగార్నింకా పంపించారు కారేం?

పురు :- యెందు నిమిత్తము?

ఘంట :- యెందునిమిత్త మంటారేమిటి? వియ్యపురాలు గారికీ తెలివిరాగానే కండ్లు తుడవాలి; కాళ్ళు మడవాలి; కోక సర్దాలి; కిందకు దింపాలి; పెరట్లోకి పంపాలి; నీళ్ళచెం బందివ్వాలి; రాగానే కాళ్ళుగడగాలి; పండ్లు తోమాలి; మొహం తొలివాలి; నీళ్ళు పొయ్యాలి; పళ్ళు తుడవాలి; తలదువ్వాలి; కొత్తచీర కట్టాలి; కుర్చీ వెయ్యాలి; కూర్చోబెట్టాలి, పారాణి రాయాలి; గంథం పుయ్యాలి; అత్తర్లివ్వాలి; పన్నీరు చల్లాలి: మొహాన్ని మొహరీలద్దాలి; కళ్ళకు కాసులద్దాలి; వంటిని వరహాలద్దాలి; వెండి పలుపు వెనుకకు కట్టాలి; బంగారు ఖలుపు పక్కకు చుట్టాలి; దిష్టి తియ్యాలి; హారతివ్వాలి; అద్దాన్న మివ్వాలి; యిల్లాంటి వింకా నా తలవెంట్రుక లన్ని వున్నాయి. ఆలశ్యమయితే అలక కట్నం చెల్లించవలసి వస్తుంది. త్వరగా పంపించండి.

[అని నిష్క్రమించును]

పురు :- యెన్నడూ వినలే దివెక్కడి పద్ధతులు దేవుడా! దాని యవస్థతో బోల్చి చూచిన నా యవస్థయే మెఱుగు! ఓసీ ఎక్కడ?

భ్రమ :- [ప్రవేశించి] ఎందులకు బిలచినారు?

పురు :- వియ్యపురాలు లేచువేళ యైనదట. వర్తమానము వచ్చినది.

భ్రమ :- ఇదిగో వెళ్ళుచున్నాను. మొహిరీ లెక్కడ నున్నవి?

పురు :- నా చేతిపెట్టెలో నున్నవి ఇవిగో తాళములు.

భ్రమ :- (తాళములు తీసికొని నిష్క్రమించును)

పేర :- (ప్రవేశించును)

పురు :- వచ్చినారా! ఇక రెండుదినములున్నవి. ఈ రెండు దినములుం కూడా దాటించితిరా యీ జన్మమునకే శిక్ష చాలును.

పేర :- ఇది గడ్డురోజు! ఈ రోజు గడిచిందంటే యిక భయవే లేదు. లింగరాజుగారు సంచులు కోసి సంభావనలిస్తారని పై వూళ్ళనించి కూడా బ్రాహ్మలు కూడా వచ్చిరట. ఆయనేమో పోలీసువార్ని అరేంజి మెంటు చేస్తున్నారట, విన్నారా?

వీర:- (ప్రవేశించి) అయ్యా! ఫలహారాల కావిళ్ళింకా పంపించినారు కారు. పెళ్ళివా రెంతసేపు ఆగుతారు? ఎవరిమటుకు వాళ్ళు కాఫీ హోటళ్ళకు ప్రయాణమవుతుంటే, పరుగు పరుగున నేను చక్కావచ్చాను. మగ పెండ్లి వారినిలా చూస్తే మర్యాద దక్కుతుందా?

పురు:- ఇదుగో యిప్పుడే పం పెద. ఈ పాటికి సిద్ధమయ్యేండును

వీర :- ఏమి కావడమో! నిన్నటి ఉప్మాలో నిమ్మపండ్ల రసమే లేదట. ఇడ్డెన్లలో అల్లము ముక్కలు లేవట, కాఫీలో పంచదారలేదట. ఈ పూటయినా కాస్త యింపుగా వుండకపోతే పట్టుకు వచ్చిన వాళ్ళ మొహాన్ని పెట్టికొట్టాలని పదిమంది ఆలోచిస్తున్నారు. ఖారాకిల్లీలు కాస్త ఎక్కువగా పంపండి. చుట్టలు, సిగిరెట్లు,బీడీలూ కాస్త శుభ్రమైనవి చూడండి. నిన్న పంపిన చీట్ల పేకలు నిన్ననే చిరిగిపోయాయి. ఈ పూటింకోనాలుగెక్కువ పంపండి. మదరాసు నశ్యము మాట మరచిపోకండి శలవు, మఱి యాలస్య మైతే మాటదక్కదు. (అని నిష్క్రమించును)

పురు :- ఏమి నిరంకుశాధికారము! ఏమి మిలటరీ ఫోర్సు! మగ పెండ్లి వారన మరిడీ దేవతలు కారుగదా (అనుచు లోనికేగును)

పేర :- ఎనిమిది వేలకూ, యేభయ్యో, వందో వుంటాయి. ఇంత వరకూ నాచేతిలో పైసా పడలేదు. యిప్పుడే నాది నేను వడుక్కోవాలి కాని ఆనక వీరిచ్చేదేమిటి చచ్చేదేమిటి? ఆనక వీరి కన్నముంటెగద ఈరోజుల్లో ఆడపిల్ల పెండ్లి చేశాక యింకా వుండేదేమిటి, వుద్దరి! తొలినా డడావిడి మలినా డాయాసం; మూడు మంగళాష్టకాలు: నాలుగు సిగపట్ల గోత్రాలు: అయిదు అప్పగింతలు; ఆరు అంపకాలు; ఏడు వంట బ్రాహ్మల తగవు; ఎనిమిది ఋణదాత నోటీసు; తొమ్మిది జవాబు; పది దావా; పదకొండు సెటిలుమెంటు; పన్నెండు విచారణ;పదమూడు డిక్రీ; పద్నాలుగట మటమా పదిహేను వేలము; పదహారు చిప్పం ఈ రోజులలో యిదే పదహారురోజుల పండుగ. కాబట్టి వెళ్ళి కదిపి చూస్తాను. (నిష్క్రమించును)

మూడవ రంగము

ప్రదేశము : పురుషోత్తమరావుగారి భోజనముల పందిరి.

పుర : ఇప్పుడు రెండు గంటలైనది. ఇంతవరకొక్కరును రాలేదు. వంటలు చల్లారిపోవుచున్నవి. వంటవారు కస్సుమనుచున్నారు..

సీ. పిలిచిన పలుకక బిగఁదన్నుకొని లోన
ముసుఁగు పెట్టెడు శుద్ధ మూర్ఖుఁడొకఁడు
ఇదె వత్తు మీ వెన్కనే మీరు పొండని
చుట్ట ముట్టించెడు శుంఠ యొకఁడు
ఒగిఁ దనకై వేచి యుంద్రో లేదో చూత
మని జాగుసల్పెడి యల్పుఁడొకఁడు
ముందువచ్చినఁ బర్వు ముక్కలౌ ననుకొని
కదను రాఁజూచు ముష్కరుఁ డొకండు.
కుడిచి యింటను హాయిగా గూరుచుండి
వత్తురానని చెప్పని వాఁడెయొకఁడు
వచ్చి కోపించిపోవు నిర్భాగ్యుఁ డొకఁడు
ఆఱు వేల్వారి నిందుల తీరు లివ్వి.

పేర : (వగర్చుచుఁ బ్రవేశించి) బాబూ! యీ పూట నా మచ్చ మాసింది, తిరిగి తిరిగి కాళ్ళు విరిగాయి (అని కూలబడునుఁ.

పుర : ఏమన్నారు? పెండ్లి వారెవరైనా వచ్చుచున్నట్లా!

పేర : ఏం పెళ్ళివారు! ఏం రావటం? పోలీసు వారిచేత పొడిపించినందుకు బయటకువస్తే బ్రాహ్మణులు చంపేస్తారని, ఈ పూట లింగరాజుగారింటిలోనే అత్తిసరు వేయించుకొని ఆరగించారు.

పుర : కదమవారు!

పేర : ఇదిగో వస్తున్నా! లింగరాజుగారి మొదటిభార్య మేనమామ బావమరిది తోడల్లుడు తమ్ముడట, ఆయనకీ పూట యిడ్డెన్లలో అల్లం ముక్కలు తక్కువైనాయట, అందుకోసం అలిగి కూర్చున్నాడు. పెళ్ళి కొడుకు జనక సంబంధము బాపతు పినతండ్రిగారి సవతితల్లి తమ్ముడు బావమరిదికి వేలువిడిచిన మేనమామ కొడుకట. ఆయనకు రాత్రి చిన్న

పీట వేశారట. అందుకోసం భీష్మించి కూర్చున్నాడు. విద్యాపురాలిగారి అన్న పిన్నత్తగారి ఆడపడుచు తోడికోడలు సవతితల్లి తమ్ముడు మేనమామగారి మేనత్త కొడుకు మేష్టరుగారితో వచ్చిన స్నేహితుఁడు గారఁట ఆయన్ను రాత్రి మీ రందరితోపాటాదరించ లేదట, అందుకోసం రైలుకు పోతానని రంకెలు వేస్తున్నాడు. స్టూడెంట్లకు రాత్రి బంగాళాదుంపల కూరా, పకోడీల పులుసూ చేయించారు కారట. అందుకోసం వారీపూట వెళ్ళడం మానేద్దామా అని ఆలోచిస్తూ యున్నారు. వారంతా రానిది మే మెలా వస్తామని కదంవాళ్ళు కాళ్ళు చాచుకొని కూర్చున్నారు. ఇక తమరు వెళ్ళి తంటాలు పడవలసినదే కాని నా వల్ల కాదు.

పురు : ఊరువారు?

పేర : పూరువారు మామూలు పాటే "యిదుగో వస్తున్నాము–పదండి"

పురు : రామమూర్తిగారు రాలేదేమి?

పేర : పట్టుబట్ట, మరచెంబూ తేవడానికి బ్రాహ్మడు దొరకలేదట బ్రాహ్మణ్ణి వెతికించడానికి కూలిమనిషి కోసం బయలుదేరారు.

పురు : చైనులుగారో?

పేర : నిన్న తలవెంట్రుకలున్న పూర్వసువాసిని ఎవరోవంటశాల వైపునకు వచ్చినదంట. పాప మందుకోసం ప్రాయశ్చిత్తం చేయించు కుంటున్నారు. ఈ పూట శాక పాకాలేమిటని అడిగితే, పనసకాయ కూర పులిహోరా, బొబ్బట్లు, బూంది, మిఠాయి అని చెప్పినాను. అయితే ఐదు నిముషాలలో వస్తాను పదమన్నారు.

పురు : అచ్యుతరామయ్యగారో!

పేర : ఈ మధ్య బ్రహ్మసమాజిగా డెవరో పై అధికారిగా వస్తే ఆయనకోసం యజ్ఞోపవీతాలు తీసిపారవేశారట. నిన్న చొక్కాతో వస్తే నలుగురూ నవ్వారట. సాయంకాలానికి జంధ్యము సంపాయించుకొని వస్తానన్నారు.

భ్రమ : (కోపముతో ప్రవేశించి) పేరయ్యగారూ! ఏరి ఏరి చివర కెంతచక్కని సంబంధము సంపాదించినారండి! వారి లాంఛనములు వారు

పుంజలు తెంపి పుచ్చుకొనుచున్నారు! మన కీయవలసి వచ్చినప్పుడు "మా కానవాయితి లే" దనుచున్నారు. మన మిచ్చిన కట్నమునుబట్టి మంగళ హారతిలో మన కైదు నూటపదహారులు రావలెను గదా? వారు వరహాకంటె వేయరట?

పురు:- ఈ మాట చెప్పుటకేనా నీ విపుడు వచ్చినది?

భ్రమ:- ఇది కాదు. ఈపూట వియ్యపురాలి పినతల్లి కూతురు తోడికోడలి యక్క యాఁడబిడ్డ సవతి మొగమున నద్దిన మొహిరీ మోటుగా నున్నదఁట. అందులకై యామె యలిగినదఁట. వియ్యపురాలు విచారించుచుఁ గూర్చున్నదఁట. అమ్మలక్కలందఱుఁ జుట్టునుమూఁగి యామెకుఁ బురెక్కించుచునారఁట.

పురు:- సరే వెళ్ళికాళ్ళమీదఁబడి కటాక్షింపుమని వేడుదము పద? పేరయ్యగారూ! నేను వచ్చువరకును మీరిచ్చట నుండుడు. [అని భార్యతోఁ బరిక్రమించి, ఆకసమువంకఁ జేతులు జోడించి]

గీ. ఆఁడుబిడ్డ పెండ్లి అతి లోభితోఁడఁ జు
ట్టఱిక మెముకలెల్ల గొరుకు లౌక్య
జాతి కింట విందు సర్వేశ్వరా? పగ
వారికి న్విధింప వలదు, వలదు.

[తెరపడును]

ఇది సప్తమాంకము

...o...

అష్టమాంకము

మొదటి రంగము

ప్రదేశము:- వెత్రీబుత్రల వెంగళప్పగారి కచేరి చావడి.

వెంగ:- [పడక కుర్చీలోఁ బరుండి] అదిగో! పదికూడా అయినది. ఇప్పటికొక పార్టీ రాలేదు. ఇంకా వచ్చేదేమిటి? ఈవిధంగా వున్నది. వ్యాపారము! పదికొట్టేసరికి పాగా, కోటూ తగిలించుకొని సాయల వాళ్ళలాగు చక్కాబోయి కచేరి కాంపౌండులలోనూ, రైలు స్టేషనుల వద్దను, ఘాటీ పాకలవద్ద కూడా కాచి మనిషి కంటబడేసరికి మరిడీ దేవతవలె పట్టుకుంటూ వుంటే యెందరికని యేడుస్తవి కేసులు! ఈ రోజులలో నాలుగే వృత్తులు. ఒకటి సిగరెట్ల దుకాణము, రెండు కాఫీహోటలు, మూడు మెడికల్ ప్రాక్టీసు, నాలుగు ప్లీడరీ, ఏ సందులోకి వెళ్ళి ఏ గుమ్మంవంక చూచినా ఏ సిటీ సిగరెట్ స్టోర్స్ బోర్డులో, ఏ "మైసూర్ మహలక్ష్మి విలాస్ కాఫీక్లబ్ బోర్డో, యే "ఎ.డి. రాజు, యల్.యమ్.యస్." మెడికల్ ప్రాక్టీషనర్ బోర్డో, యే "టి.వి. రాఘవాచారి బి.ఎ.బి,యల్." హైకోర్టు వకీలు బోర్డో ప్రత్యక్షం. ఈ నాలుగు వృత్తులలో కాఫీహోటల్ ఫస్టు; ప్లీడరీ లాష్టు! నాన్ కో-ఆపరేషను కొంత నాశనం చేస్తే స్టాంపుడ్యూటీ పెరిగి సర్వ నాశనం చేసింది. ఈ తాలూకా బోర్డు ప్రెసిడెంటుపదవే రాకపోతే యీపాటి కీ బీరువా అమ్ముకొని పోవలసినదే! దీని తల్లి బొడ్డు పొక్క! దీనికి వచ్చాయిప్పుడు తిప్పలు. పోయిన సంవత్సరం అమాంబాపతలా అయిదువేలు గిట్టాయి. యీ సంవత్సరము టి.ఎ. ఫిక్సెడుచేసి మా నోటిలో మన్నుకొట్టారు! ఇదిపోతే ఇక కంట్రాక్టర్ల కమీషను, యీ సంవత్సము వాళ్ళివ్వాల్సింది కూడా నిరుడే వాడుకున్నాను. ఇక వాళ్ళిచ్చేదేమిటి, చచ్చేదేమిటి? పోతే, యిక. చచ్చుముండా స్కూలు టీచర్లున్నారు. ఫయినులు వేసి, ఐదిలీలు చేసి భర్తరఫులు చేసి,గోలయెత్తించితే ఒక్కొక్కనెల జీతం

పూడిపడేసరికి చుక్కలు రాల్తాయి. పయివాళ్ళను తగ్గించి, బంధువులను తెచ్చిపెట్టుకోవడం మొదలు పెట్టాక అది అఘోరంగానే వుంది! ఈ కాకి పిండాలయినా ముట్టకుండా స్వరాజ్య పార్టీ వారిక్కడ కూడా సన్నాహాలు మొదలుపెట్టారు. ఎలక్షను రోజులు దగ్గిర పడుతున్నాయి! వెనుకటిలాగే ఓట్లు కొందామంటే వెనుకటి ఋణమే యిప్పటికింకా తీరలేదు. బాగా వచ్చేటప్పుడు వొళ్లు తెలియక బ్రాంది దగ్గరనుంచి అలవాటు చేసుకున్నాను. ప్రాతఃకాల మయ్యేసరికి బాటిల్ కావాలి. ఈ తిప్పలకు తోడు యింటిదాని బాధొకటి పట్టుకొన్నది! ఫస్టు తారీఖున రెండు పెద్ద కాసులూ చేతిలో పెట్టకపోతే చెప్పుదెబ్బలు తప్పవు ఆ రాత్రి దాని కంటపడడం చేత ఆ విధంగా రాజీ చేసుకోక తప్పింది కాదు ఎవరో వచ్చుచున్నారు!(అని లేచి గంభీరముగా గూరుచుండును.)

ఒక టీచరు:- (చేతులు కట్టుకొని ప్రవేశించి నమస్కరించి) అయ్యా! నేను అచ్చన్న పేట స్కూలు తాలూకు అయిదో టీచర్నండి.

వెంగ:- అయితే యేమంటావు? ఆ నంగినంగి వేషాలేమిటి?

టీచ:- వల్లూరులో నా భార్య కనలేక మూణ్నాళ్ళనుంచి కష్ట పడుతూ ఉన్నదండి. రెండు రోజులు సెలవిప్పించితే వెళ్ళివస్తానండి.

వెంగ:- నీ భార్య కష్టపడుతూ వుంటే నీ వెందుకు యేడవనూ? నీవు కనిపిస్తావా? లేక వకాల్తానామా పుచ్చుకొని నీవే కంటావా?

టీచ:- డాక్టరు దొరసానిగార్ని తీసుకువెళతానండి.

వెంగ:- అబ్బో! నీ మొహాని కదికూడానా! యినస్పెక్టరుగారిని చూచావా?

టీచ:- చూచానండి. చూస్తే తమతో మనవి చేసుకోమన్నారు.

వెంగ:- అయితే ఆ పిడతను ముందుచూసి ఆ పిడత వెళ్ళమంటే అప్పుడు వచ్చావన్నమాట. ఫో! సెలవూ లేదూ! గిలవూ లేదు ఫో!

టీచ:- [దైన్యముతో] అయ్యా! కటాక్షించాలి. కష్ట సమయం.

వెంగ:- పొమ్మంటే పొయ్యావు కావు గనుక రెండు రూపాయలు ఫైను.

టీచ:- మహానుభావులు:- దైవస్వరూపులు మన్నించాలి.

వెంగ:- ఫయినన్న కదలలేదు గనుక పదిహేను రోజులు సస్పెండు.

టీచ:- అధికార్లు ఆగ్రహపడితే నే నాగలేను, అనుగ్రహించాలి.

వెంగ:- సస్పెండన్నా జంకావు కావు కనుక డిస్మిస్ చేశాను ఫో.

టీచ:- ఆరి చండాలుడా! ఆ మాటకూడా అనేశావా; సరే ఇంతేనా యింకేమయినా చెయ్యగలవా? ఈ మూడేళ్ళముష్టి పదవిపోగానేఁ ఇంటింటా అడుక్కుతినే యోగం నీకుగాని యీపాటి కాటికాపరి పని మాకు దొరకక పోదు. అదిగాక నీవంటి అధమాధముని కాలంలో, అదలిపోతూ నవుకరీ చెయ్యడం కంటే యాయవార మెత్తుకున్నా మంచిదే! శేషాద్రిగారి చెప్పులు మోసి, కామరాజుగారికి కాళ్ళు గుద్ది మాలవాడికి వంటింటిలో మంచంవేసి వారికి సాధ్యంకాని ఓట్లకు వందలకు వందలు సమర్పించీ ఈ సామ్రాజ్యం సంపాదించావు! అయితే యేమీ ఆ పడ్డపాట్లన్నీ అప్పుడే దులిపేశావు. అల్పున కధికారం పట్టినా, ఆడదానికి వైధవ్యము వచ్చినా "యెద్దు కప్పు పోసినా, యేనాదికి పెత్తనమిచ్చినా క్షణంలో స్వరము మారుతుందన్న వాఁడు వెఱ్ఱివాఁడా, ఏమి విపరీతకాలం వచ్చిందో! యెక్కడ చూచినా మునిసిపాలిటీలూ, లోకల్ బోర్డులూ నిరక్షరకుక్షులతోనో, నీవంటి నీచాతి నీచులతోనో నిండిపోతున్నాయి. అయిందాకా అడ్డమైన గడ్డి కరవడం! అయిందనగానే ఆకాశం ముట్టడం? యిదీ యిప్పటి మర్యాద? అయినా మీ యీపదప్రెముక్కలు నమ్మి మీలాంటి వాళ్ళకు వోట్లిచ్చేవారి ననాలి గాని మిమ్ముల ననవలసిన పనిలేదు! మీకు వోట్లివ్వడం వలన మీపాపాలలో భాగం పంచుకోవలసివుంటుందన్న సంగతి తెలిస్తే ఒకరయినా మీకు వోటిస్తారా? నీకూ కాలం దగ్గరపడ్డది! కాకపోతే కళ్ళింతమూసుకుపోవు. ఇన స్పెక్టరుగారి మీద నీకింత కడుపుమంటెందుకు? నీతో గలిసి నీ పాటకు తాళం వేశారు కారనేనా? ఆయన చెప్పులు మొయ్యడానికయినా నీ కర్హత వున్నదా? నీవు చేసిన దారుణాలకు నీ గుండెలలో గునపం లాగు ఆ మహారాజు కాస్త అండగా వుండబట్టే యింత అన్నం తిన్నాం! ప్రతివారిని పిడత పిడతం టావు పిడతేమిటి? నీ పిండాకూడు! ఎంతమంది నీ జీవానికి పడి యేడ్చు

చున్నారో యెందరి వుసురు నీ యింటావంటా చుట్టుకొంటూ వుండో యెరక్క ఇంత పొంగి బోర్ల పడుతున్నావు! భగవంతుడు మా మొర వినకాపోడు. పటుక్కున నీ దుంపతెంపకాపోడు! ఈసారి నిన్నెలాగు ఈడ్చి పారేస్తారు. ఈ మాటలు మాత్రం మనస్సులో వుంచుకో! ఇక సెలవు

(నిష్క్రమించును)

వెంగ:—హమ్మా! హమ్మా! ఎంతలేసి మాటలన్నాడు! ఆ వెధవ అలా దులిపేస్తూవుంటే పాడునోరు పైకి లేచింది కాదేం? ఇదే కామోసు గిల్టీకాన్షస్ అంటారు. నిజంగా యింత నిర్భాగ్యపు వెధవను నేనిదివర కెన్నడూ కాలేదు. నా ధూంథాంలు చూచి. నలుగురు టీచర్లునా యంతవాడు లేడనుకునేవారు. ఈ సంగతి తెలిస్తే ఇకనన్నెవడైనా లక్ష్యపెడతాడా! సమయానికి చాకలి వెధవకూడా లేకుండా పోయాడు. అవసరానికి లేక పోయినందుకా వెధవను డిస్మిస్‌చేసి తీరుతాను. అదెవరు?

లింగ:— [ప్రవేశించి] ఈ పూట పంతులుగారింత తీరికగా నున్నారేమి?

వెంగ:— దయచెయ్యండి యేమి తీరిక ! యేమిలోకం! పార్టీ లంతా యిప్పుడే బసలకు పోయారు ఎవరో టీచరు వచ్చి యేదో చెప్పుకుంటుంటే వింటున్నాను. ఏమిటి సమాచారము? కూర్చోండి.

లింగ:— [కూర్చుండి] పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులు గారి కుమార్తెను మా పిల్లవానికిచ్చిన సంగతి మీ రెఱిగినదేగదా? వివాహ కాలమున నాలుగువేల రూపాయల నగలుంచినారు. వివాహమై మూడేండ్లు కావచ్చినది. పిల్లను గాపురమునకు బంపరు. మా నగలు మా కిమ్మన మాటాడను మాటాడరు. అసలు రహస్యమేమా? ఆ నగలు మనవి కావు. తరువాత జూచుకొందమని తాకట్టు వస్తువులు తీసి తగిలించాను. తాకట్టు పెట్టిన వారిపుడు నన్ను తాటించుచున్నారు.

వెంగ:— కార్యంకాగానే చల్లగా సంగ్రహించుకోకపోయారా?

లింగ:— అప్పటి నా యభిప్రాయమదే కాని సాగినది కాదు. ఆ పిల్ల ఎలాగునో నా యభిప్రాయము కనిపెట్టి అందుల కవకాశము చిక్కనివ్వనది కాదు.

వెంగ:- ఆ పిల్లకిప్పుడెన్నో యేడు?

లింగ :- పదునాఱవ యేడు ప్రవేశించినది

వెంగ:-ఐతే మైనార్టీ వదలలేదన్నమాట. అబ్బాయికో?

లింగ:- పందొమ్మిది.

వెంగ:- సరే దానికేం! ముందో నోటీసుముక్క వ్రాసిపారేసి అబ్బాయి పేరుతో తక్షణం తండ్రిమీద దావా దాఖలు చేదాం!

లింగ:- తండ్రిమీఁదనే కాదు దానినిగూడఁ గోర్టునకీడ్చి తెప్పించి నలుగురిలో నగ లూడదీయించినగాని నా కసి తీఱదు.

వెంగ:- అదెంతపని? పసిపిల్లను నగలతో పరారీ చేయడానికి సిద్ధముగా యున్నారని చెప్పి యింజెక్షన్ ఆర్డర్ పుచ్చుకొని యిట్టే ఈడ్పించుకొని రావచ్చును. కోర్టులో మనమాటంటే ఇపుడు కోటి రూపాయల క్రింద చెలామణి అవుతుంది.

లింగ:-ఇంకొకటి, మనకు మనోవర్తి బాధ లేకుండా ఈ సంబంధ మింతటితోఁ దప్పిపోవు దారికూడఁ జూడవలెను.

వెంగ-: దానికేముంది? ప్రతిరాత్రీ మునసబుగారు పేకాటకు మన ఇంటికి వస్తూనే యుంటారు. ఇది నా స్వంత వ్యవహారము వంటిదని చెప్పితినా, ఆయన స్వంత కార్యము క్రింద చూచెదరు.

లింగ:-సరే, సాయంకాల మబ్బాయినిఁగూడిఁ దీసికొని వచ్చెదను. మీరు కోర్టునుండి రాగాఁనేనోటీసు వ్రాయుఁడు. (అని లేచును)

వెంగ:-వచ్చేటప్పుడు ఫీజేమయినా తెచ్చి జమకట్టిస్తారు గాదూ?

లింగ:—అయ్యో దానికేమి? ఆ మాట మీరు చెప్పవలెనా? (కొంచెము పరిక్రమించి) ప్లీడరింటఁగాలుపెట్టగానే, ఫీజుగోల సిద్ధము? ఫీజు ముట్టు వఱకుఁ ప్లీడరు పిశాచమే!

గీ. రోగి చావనీ బ్రతకనీ రొక్క మెటులో
లాఁగ జూచును వైద్యుఁడు లాఘవముగ
వ్యాజ్య మోడనీ, గెల్వనీ, వాటమెఱిఁగి
పిండుకొనఁజూచు ప్లీడర్లు ఫీజు ముందె!

...o...

రెండవ రంగము

[ప్రదేశము : కమల గది]

కమ:- [నూలు వడకుచు] కనుకనే పెద్దలు కదురు తిరిగినను కవ్వము తిరిగినను కాటకముండదని చెప్పుదురు.సందియ మేమి!

గీ. రాట్నపుం జక్ర మిటు లహోరాత్రములును
గాలచక్రంబు కైవడిఁ గదిలెనేని
విష్ణుచక్రంబువలె క్షామ విదళనంబు
చేసి, భూచక్రమెల్లను జెతనిడదె?

ఎందుకు (జెపుమా నాన్నగారు వచ్చుచున్నారు! [అని లేచును]

పురు:- (కాగితము చేతఁబట్టుకొని ప్రవేశించి) అమ్మా! వియ్యం కుఁడుగారు చివరకు పీధి కెక్కినారు. ఇదిగో నోటీసు.

కమ:-ఏమని?

పురు:- చదివెద వినుము (అని యిట్లు పఠించును)

బి.యే. బి. యల్. హైకోర్టు వకీలు వెర్రిబుర్రల వెంగళప్పగారి వద్ద నుంచి పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారికి, అయ్యా! మా క్లయింటు సింగరాజు బసవరాజుగారికి మీ కుమార్తె కమలను యివ్వడం మూలకంగా వివాహము కబడ్డట్టున్నూ, వివాహ కాలములో మా క్లయింటు మీ పిల్లకు నాలుగువేలు రూపాయల కిమ్మతు గల నాణెమైన బంగారపు నగలు వుంచబడ్డట్టున్నూ సదరు నగలను మీరు హరించడానికి దురుద్దేశముతో, సదరు చిన్నదాన్ని కాపురానికి పంపకుండా వుండబడ్డట్టున్నూ, మీపైన దావా వగైరా చర్య జరిగించేదిగా మాకు సమజాయిషీ ఇవ్వబడివున్నారు. ఈ నోటీసు అందిన ఇరువది నాలుగు గంటలలోగా సదరు వస్తువులు సహితం పిల్లను కాపురానికి పంపబడి మావల్ల క్రమమైన రసీదును పొందకుండా వుండబడే యెడల మీ వగైరాలపైన దావా చెయ్యడమే కాకుండా మీవల్ల యావత్తు ఖర్చులున్నూ రాబట్టుకోబడదం యిందుమూలముగా తెలియజేయడమైనది. ఈ నోటీసు తాలూకు ఖర్చులు కూడా పిల్లతో పంపబడేది కాబడుతుందని చిత్తగింపవలెను.

—వెర్రిబుర్రల వెంగళప్ప

కమ:- సరే దీనికి సమాధానమేమియుఁ వ్రాయవలదు. దావా కూడా దాఖలు కానిండు:

పురు:-అమ్మా! నీ అభిప్రాయమేమో నాకు బోధపడలేదు. "నన్నిపుడేమియు నడుగవలదు. సమయము వచ్చినప్పుడు సర్వముదేటఁ పడఁగల"దని నీ వాదిలోఁ జెప్పియుండుట చేత నిన్నేమియు నిరోధించి యడుగలేదు. కానీ ఏమి యపకీర్తి వచ్చునో యను నాందోళన మాత్రము లేకపోలేదు. అదిగాక.

గీ. పతులకుం దాస్య మొనరించి పరువు మాలి
బ్రతుక జూచుటకంటెను బస్తు మేలు.
సరస మెఱుఁగని వారితో జగడమాడి
కోర్టు కెక్కుటకంటెను గొఱత మేలు?

కమ:-అది నిజమే కాని యీ వ్యవహార మట్టిది కాదు. దీని కై మీ రించుకయు దిగులు పడవలసిన పనియు లేదు. సర్వము నాకు విడిచి పెట్టి మీరు శాంత మనస్కులరై యుండుడు.

పురు:- సరే కానిమ్ము, నీ మాటయే నాకు నిట్టాట. (నిష్క్రమించును.)

కమ:- (ఆకసమువంక చేతులు జోడించి) ఓ సర్వేశ్వరా!

ఉ. గట్టిగ నిన్నె నమ్ముకొని కష్టము లోర్చినవారి నేరి చే
పట్టి భరించు కేవల కృపామయమూర్తి వటంచు నెట్టనం
బట్టితి నీదు పాదములు, బాలను, బేలను, దీనురాల న
న్నెట్టులు తేల్చెదో! తరుణ మిప్పది యే సుమి డాయ వచ్చెడున్.

(తెర బడును)

(ఇది అష్టమాంకము

౦——౦

నవమాంకము

ప్రదేశము : న్యాయస్థానము

[న్యాయపీఠమున గూర్చుండి, అభియోగ పత్రము చదువుకొనుచు న్యాయాధిపతి. యెదుటఁ గుర్చీలో వెంకళప్ప, అతని వెనుక నిలబడి లింగరాజుగారు, బసవరాజు. రెండవవైపునఁ పురుషోత్తమరావు, కమల].

పురు:- (తనలో) నిజమే, కోర్టెక్కుటకంటెఁ గొఱత యెక్కుటే మేలు.

చ. మనుజుని ముంగట న్మొరకు మాదిరిగా మనుజుఁడు నిల్చి వే
ర్మనుజుఁడు బల్ల గ్రుద్దుచును మాటికి మాటికి నేమి ప్రశ్న వే
సినఁ దలయొగ్గి యుత్తరము చెప్పుచు,నూర్పులు పుచ్చుచుంట కం
టెను నవమాన మింకొకటి నిక్కముగా మహిలోన నున్నదే.

సీ. ధనలోభమో, పట్టుదలయో, దురాశయో
వేధింప నిలువెల్ల వెఱ్ఱి యెత్తి
కూటసాక్ష్యములను గూర్చికొని యిండ్లు
వాకిళ్ళు ముదుసళ్ళ వశమొనర్చి
ప్రోకర్లసేయు దుర్బోధలు మది నమ్మి
ప్లీడర్లు కోరిన ఫీజు లిచ్చి
పూఁటకూళ్ళిండ్ల నూడ్పులు నాకి, వారి పం
చల దాటియాకు; జాపలఁ బరుండి
కోర్టే దేవాలయంబుగా కోర్టు నెదుటి
మఱ్ఱులుం గంగరావులె మండపాది
కములుగా, జడ్జీ దైవంబుగాఁ నిరంత
రంబుఁ దిరుగుదురేమి కర్మంబొ ప్రజలు.

ఇంతకును...

సీ. కరణము తొలి మరి కట్నాల క్రిందను
కూటసాక్షుల గొఱుగుడుల క్రింద
వెంట దోడ్తెచ్చు నేజంటు ఖర్చుల క్రింద
ప్లీడర్లు లాగెడు ఫీజు క్రింద
చల్లఁగాఁ బెరిగిన స్టాంపుడ్యూటీ క్రింద
తెమలని సాక్షి బత్తెముల క్రింద
కోర్టు గుమాస్తాల కొల్లు ముడ్పుల క్రింద
కడలేనియట్టి నకళ్ళ క్రింద
రైళ్ళ క్రిందను, కాఫీ హోటేళ్ళ క్రింద
కొంపలుం గోడలును మాపుకొనుచు, నోడు
వాఁడు బయటను, గెలిచినవాఁడు లోన
నేడ్చుటెగాక, లాభ మింతేని గలదె.

బస - (తనలో) పెంపుడు తండ్రి చివరకు నన్నెంత పేలవ పఱచెను?

గీ. పెండ్లి కాఁగానె చదువు మాన్పించెఁ బ్రజలు
కేరడము సేయఁ గోర్టు కెక్కించె నేఁడు
ధనమె బ్రతుకైన పెఁపుడు తండ్రి కంటె
సవతి తల్లియె మేలు నిశ్చయముగాను!

న్యాయా:- (కాగితములు బల్లపై నుంచి) వెంగళప్పగారూ! యీ వ్యవహార మింతవఱకు రావలసినది కాదండీ! ఉభయులకును రాజీ చేయుట యుక్తమని నా యభిప్రాయము.

వెంగ:- (లేచి) కోర్టువారలా సెలవిస్తే కొంప మునిగిపోతుంది. మాక్లయింటు వంటి మర్యాదస్థుడు మద్రాసులో కూడా లేడండి. ఆయన పెళ్ళికి అయిదువేల అయిదువందల కరకులు కట్నము యిచ్చారు!

లింగ:- (వెనకనుండి మెల్లఁగా) అయ్యయ్యో! ఆ సంగతి మన మొప్పుకొనఁగూడ దయ్యా బాబూ! ఆయన తండ్రికని దిద్దుకోండి!

వెంగ:- అన్నట్లు పొరపాటు మనవిచేశాను. ఆయనకుగాదు కట్నం ఆయన కొడుక్కు. కాదు, కాదు తండ్రికి? ఆయన తండ్రి లక్షాధికారండి.

మూడు పెండ్లిండ్లయినాయి. ముప్పయి వేలు కట్నాలు వచ్చాయి. మునిసిపల్ మెంబరీకోసము మూడుసార్లు స్టాండైనాడు.

న్యాయ:- (నవ్వి) ఆయన చరిత్ర ఇప్పుడవసరము లేదు కాని రాణీ మాట రవంత యాలోచింపుడు!

వెంగ:- ఈ విషయంలో యీశ్వరుడు చెప్పినా మాక్లయింటు వినదండి. దావా మా పక్షం కావడానికిపట్టెడు రికార్డుంది బోలెడు సాక్ష్యము వుంది. అలహాబాదు ట్వంటీ త్రీలో అత్తవారు పెట్టిన నగలుమ హరించ కూడదని అయిదు పేజీలు వ్రాసాడు! కలకట్టా ట్వంటీ ఫోర్‌లో పిల్లను కాపరానికి పంపి తీరాలని వుంది!

న్యాయ:- మీ తీర్పులన్నియు దీరిక సమయమున జూచెదను. ఏమి లింగరాజుగారూ! మీ అబ్బాయిని మీ రొప్పించరేరా?

లింగ:- చిత్తము చిత్తము. కోర్టువారి చిత్తమట్లున్నప్పుడు కోటి రూపాయలు పోయిన బోవుగాక? మా నగలు మాకిచ్చి, మా ఖర్చులు మాకిచ్చి, వారికిని, మాకును సంబంధము లేకుండ జేసికొనుటకు వారు ఇష్టపడిన యెడల, మా అబ్బాయిని నే నొప్పించెద.

న్యాయ:- (ఫకాల్న నవ్వి) ఏమీ, కోడలేల పనికి రాదు?

లింగ:- ఆ పిల్ల మా యింట నణకువతో కాపురము సేయదండి.

న్యాయ:- ఏమి పురుషోత్తమరావుగారు! అమ్మాయికి నచ్చజెప్పి అత్తవారి యిష్టానుసారముగ నడుచుకొనునట్లు చేయలేరా?

పురు:- అయ్యా! నే నసహాయవాదిని. అందువల్ల మీ ప్రశ్నమున కుత్తర మొసంగుటకు నా కవకాశము లేదు.

న్యాయా:- న్యాయాధిపతిగాఁ గాక గృహస్థుడుగా నడుగుచున్నాను.

పుర:- ఇది న్యాయస్థానము కాని తమ గృహము కాదు.

న్యాయా:- అట్లయిన నీ వ్యవహారమిఁక నిరుపక్షములకు అనుకూలముగా నిర్వర్తించుట కవకాశము లేదన్న మాటయే.

వెంగ:- ఆ సంగతి నే నాదిలోనే మనవి చేశాను.

కమ:- [తనలో]

మ. మనసూ! జంకకు, ధైర్యమా చెడకుమీ మానంబు! నీమానశో
ధనకాల మిదె, దైవమా! యిపుడె చెంతంజేరి సాయంబు స
ల్పి ననుం దేల్చు ముహూర్త మిత్తఱిని దల్లీ! భారతీ నాదు వా
క్కున నిల్వంబడు మక్కరో కదిసి నాకుం దోడుగా నుండుమీ!

న్యాయా:- అందుచేతనే మీరు వకీలును బెట్టుకొనలేదన్నమాట.

కమ:- (కొంచెము ముందునకు వచ్చి) అయ్యా! తామధిష్ఠించినది ధర్మపీఠము, తాము ధర్మదేవతకుఁ బ్రతినిధులు. తమ కాఁడు బిడ్డయున్న యెడల నాబిడ్డయే యీ బిడ్డ యనుకొని తమ సన్నిధానమున ధర్మము విన్నవించుకొనుటకు నా కనుజ్ఞ దయచేయుడు!

వెంగ:- [చివాలున లేచి] నో! నో! నో! ఆ చిన్నది మాటలాడడము అశాస్త్రీయం. అందుకు లా యెంతమాత్రం వప్పదు. ఏదీ సివిల్ ప్రొసీజరు కోడెక్కడుంది [అని బల్ల మీఁద వెదకును]

న్యాయా:- ఏమీ? ఏల మాటలాడఁగూడదు?

వెంగ:- ఆ పిల్లకు మైనారిటీ వెళ్ళలేదండి. మైనారిటీ వెళ్ళని వాళ్ళు మాటలాడ గూడదని బోలెడు బొంబాయి తీర్పులున్నాయి.

కమ:—అయ్యా! చట్టము వేఱు, సందర్భము వేఱు. సందర్భములను బట్టి చట్టములు మారునుగాని, చట్టములనుబట్టి సందర్భములు మాఱవు

నా తండ్రిగా రసహాయవాదులు. నాకు వకీలును బెట్టుకొనుట కవకాశము లేదు. చట్టమునందుఁ జెప్పఁబడిన యీడు రాకపోయినను స్వవిషయమును సమర్థించుకొనుటకుఁ జాలిన జ్ఞానమును సర్వేశ్వరుఁడు నాకుఁ బ్రసాదించి నాఁడు. ఇట్టి స్థితిలో నా మాట వినకుండుట నా కన్యాయము చేయుట కాదా?

న్యాయా:- చెప్పమ్మా, చెప్పు? నీవు చెప్పిన మాటలు రికార్డు చేయఁ గూడదనవచ్చును గాని నమ్మ వినఁగూడదనుటకు వీరెవరు?

కమ:- చిత్తము, చిత్తము. దావా సారాంశములు రెండు. మొదటిది నా తల్లిదండ్రులు నా నగలు హరింపఁదలఁచినారని, రెండవది అందులకై వారు నన్నుఁ గాపురమునకుఁ బంపలేదని, (నగలు మూట తీసి) ఇవిగో వారడిగిన వస్తువులు, వీనిని వారు నా వివాహ కాలమున నాకు బహూకరించి నారు. బహూకరించిన వస్తువులు దిరుగఁ సంగ్రహించుటకు దాతకు హక్కు లేదు.

వెంగ:-కావలసినంత హక్కుంది. కలకత్తా తీర్పులు లక్ష చూపిస్తాను. ఏదీ నంబరు యైట్ వాల్యూమ్. (అని వెదకును)

న్యాయా:-ఆగవయ్యా నీ యల్ల లాటకాల? అమ్మాయి! రెండవ సారాంశమును గూర్చి యేమి చెప్పెదవు?

కమ:-ఇదియే తామించుక శ్రద్ధతో వినవలసిన విషయము. నా భర్త నా యింటికివచ్చి, నా యాజ్ఞానుసారము నడుచుకొనవలసి యున్నది గాని, ఆయన యింటికి నన్ను రప్పించుకొనుట కాయన కావంతయు నధికారము లేదు.

వెంగ:-కావలసినంత అధికారముంది. కలకత్తా ట్వంటీ సిక్స్‌లో కాళ్ళూ, చేతులూ కట్టి తీసుకొనిపోవచ్చునని కూడా వుంది.

న్యాయా:- అబ్బబ్బా! నీ వాఁగవయ్యా! ఎందుల కధికారము లేదమ్మా?

కమ:-ఆయనను మేము వేలములో అయిదువేల యైదువందల రూపాయలకుఁ గొన్నాము.

న్యాయా:-[ఆశ్చర్యముతో] అదెట్లు?

కమ:—నాకు కాళింది యను నక్కగారుండెడిది. ఆమెకై మా తండ్రిగారీ సంబంధము కొరకు యత్నించుచుండగా ముక్కిగవారు పోటీకివచ్చి నారు. అప్పుడు పెండ్లికొమరుని వేలము జరిగి, ఆ వేలములో అయిదు వేల యైదువందలకు మా సొత్తయినారు.

లింగ:- అయ్యా! వట్టిది వట్టిది! అట్టిదేమియు జరుగలేదు. [వెంగళప్పను చూచి] నీ బొడ్డు పొక్క! నిజము కాదని చెప్పవేమయ్యా

వెంగ:-[ఉలిక్కిపడి లేచి] అయ్యా?అయ్యా!అంతా అబద్ధమండి. కావలిస్తే మా క్లయింటు గంగలో దిగి ప్రమాణము చేస్తాడు.

కమ:- (రెండు కాగితములు తీసి) అయ్యా! యిదిగో యిది మొదటి అగ్రిమెంటు. ఇది సొమ్ము ముట్టినప్పటి రసీదు (అని ఇచ్చును!)

న్యాయా:- (చదివి) ఏమయ్యా! యీ రశీదులు మీరిచ్చినవేనా?

లింగ:—(గొల్లున) కావు కావు! మహాప్రభో! కల్పించినారు.

వెంగ:-నిశ్చయముగా ఫోర్జరి అండి! నిలువునా ఫోర్జరీ, ఇండి యన్ పీనల్ కోడ్ నాలుగువందల అరవయ్యేడో సెక్షన్ ప్రకారము ఆ పిల్ల మీద ప్రాసిక్యూషనుకు ఆర్డరు దయచేయించక తప్పదు.

న్యాయా:-ఐతే అమ్మాయి! అగ్రిమెంటు ప్రకారము ఆ సంబం ధము మీ యక్కకేల జరుగలేదు?

కమ:—కొనితెచ్చిన వరుని పెండ్లియాడుట గౌరవహీనమని మా యక్క బావిలోపడి మరణించినది. ఇదిగో యీ పత్రికఁ జిత్తగించినచో దమ కీ యంశము విశదము కాగలదు [అని పత్రిక యిచ్చును.]

న్యాయ:- [చదివి] హరహరా? యెంతపని జరిగినది. ఆ కారణముచే ఆ చిన్నవానికి నిన్నుఁ జేసినారన్న మాట.

కమ:- చేయక తప్పినది కాదు. చేజిక్కిన సొమ్ము మరలచేపుటకు వారు నిరాకరించినందున ఆ క్రయము నా క్రింద మార్చవలసి వచ్చింది.

లింగ:- అయ్యా! వాదము నిమిత్తము, వారు సొమ్ము ఇచ్చినట్లే నిశ్చయింపుఁడు. అయిన నది కట్నమగును గాని క్రయధన మెట్లగును?

కమ:- కట్నమునకును, క్రయధనమునకును గాసింతయు భేదము లేదు. ఉన్నదన్నను కట్నములు వివాహకాలమున నిచ్చుట గలదు. గాని వేలము, బజానా, అగ్రిమెంటు, ముందు చెల్లించుట యిట్టి యాచారమెచ్చటను లేదు. అందువల్ల నిది క్రయధనమగుట కాక్షేపణ మేమియు లేదు. అది యటుండనిండు! శుభలేఖలలో సర్వత్ర "వారి కుమారునకు వీరి కొమార్తెనిచ్చి" అని కదా యుండును. వీనిని జిత్తగింపుడు (అని రెండు శుభలేఖ లిచ్చును)

న్యాయ :- (ఒక శుభలేఖనెత్తి) "నా కొమార్తె చి॥ సౌ॥ కమలకు బ్రహ్మశ్రీ సింగరాజు లింగరాజుగారి కుమారుఁడు బసవరాజు నిచ్చి" (అని పఠించి ఫక్కున నవ్వి) ఇది పురుషోత్తమరావుగారి శుభలేఖ, లింగరాజుగారి శుభలేఖలో నెట్లున్నదో (అని రెండవ దాని నెత్తి)నా కుమారుఁడు చి॥ బసవరాజును బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులు గారి కొమార్తె చి॥ సౌ॥ కమలకు ఇచ్చి" సరే ఇకనేమి స్పష్టముగానే యున్నదే! ఏమి లింగరాజుగారూ! మీ కుమారు నామె కిచ్చివేసినట్లు మీరొప్పుకొనియే యున్నారే?

లింగ:-అయ్యా! అన్యాయ మన్యాయము. మీ శుభలేఖలతో పాటు మాకు గూడఁ గొన్ని యచ్చువేయించి పెట్టుఁడని బుద్ధిగడ్డితిని పురుషోత్తమరావుగారిని కోరగా ఈ ద్రోహము ఆయన చేసినారు.

వెంగ:- ఇదో ఫోర్జరీ, యిందుకోసం యీయన మీద కూడా వ్రాసి కూర్యేషనుకు ఆర్డరు దయచేయించాలి. ఇక వూరుకోవడానికి వీల్లేదు.

కమ:- అయ్యా! ఆయనేమియు నెఱుంగరు, నాకుఁగల హక్కును బట్టియుఁ న్యాయమును బట్టియు నేనే ఈ విధముగా మార్చినాను. అందులకు వారప్పుడేమి నభ్యంతరము చెప్పి యుండలేదు. తామీ సందర్భము లన్నియుఁ జక్కఁగా నాలోచించి నాపై నా భర్తకే యధికారము గలదో, నా భర్తపై నాకే యధికారము కలదో! నిర్ణయింపుఁడు.

బస :- [తనలో] నా యవజ్ఞచేతనే యీ వ్యవహారము యింత వఱకు వచ్చినది. ఇంకను నేనిట్లు మొరడునై యుండఁదగునా?

చ. పరువు నశించెఁ! బండితులు పామరులు న్విని యింట నింట నా
చరితమె చెప్పుకొంచు నెకసక్కెములాడు నవస్థపట్టె! ము
ష్కరమునఁ దండ్రి కిప్పటికి గల్గకపోయె నుదార బుద్ధి! యీ
తరుణము నందు మూర్ఖుని విధంబున నుండుట నాకుఁబాడియే.

గీ. ఆమె చెప్పినదెల్ల యదార్థ మీతఁ
డాచరించినదెల్ల నా యాత్మ యెఱుఁగు
నిట్టిచో న్యాయమున కేను గట్టుపడక
యున్న దేవుఁడు నను జూచి యోర్చువాఁడె.

న్యాయా:-ఏమి వెంగళప్పగారూ! మీరేమి చెప్పెదరు?

బస:- [యింతలో ముందునకు వచ్చి] అయ్యా! యిప్పుడు మాటాడవలసినవాఁడను నేను గాని, ఆయన గాదు. ఈ దావాకు సంబంధించిన కాగితములపై నేను సంతకములు చేసినది, నా తండ్రి బలత్కారముచేఁగాని, నా స్వబుద్ధిచేఁ గాదు. అందువల్ల నా దావాను నేను రద్దు చేసికొనుచున్నాను. ఆ చిన్నది చెప్పిన మాటలలో నణువంతయు నసత్యము లేదు. నా తండ్రి మాటలలో నలుసంతయు నిజము లేదు ఈ వ్యవహా

రములో నా తండ్రి చేసిన దుస్తంత్రములన్నియు నిచ్చట వెల్లడించుట నా కిష్టము లేదు. పెక్కు మాటలేల?

ఉ. అమ్మెను నన్ను నా జనకుఁడాయన నన్గొని రొక్కమిచ్చి! యీ
కొమ్మకు నేను భృత్యుఁడను గొంకక యే పని సేయు మన్న ని
క్కముగఁ జేయువాఁడ, నిటు కట్నములం గొనువారు రాథిగా
నమ్మెదుకాండ్రె కాక, మగలంటకు నర్హులుకారు లేశమున్.

న్యాయ:- సెబాసు నాయనా సెబాసు! చెప్పవలసిన రీతిగాఁ చెప్పితివి? కాని చెప్పినది చెప్పినట్లు చేయుట గూడ జరిగెనేని లోకమున కొక శ్రేష్ఠమైన పాఠము నేర్పినవాఁడ వగుదువు?

బస :- అయ్యో! తమకా సందేహమేల? (అని కమల వంకకు నడచును)

లింగ:- (ఆవేదనతో) ఆఁ, ఆఁ, ఆఁ, ఓరి నిర్భాగ్యుఁడా? నిర్భాగ్యుడా, నీకేమి వినాశకాలమురా యిది. అయ్యో? అయ్యో? ఇంకేమున్నదింకేమున్నది? (అని గుండె బాదుకొనును)

బస:- (తిరిగి చూడకయే కమలను సమీపించి) ఓ సుగుణవతీ!

చ. ధనము గణించి నీ యెడల దారుణవృత్తి మెలంగియుండె మ
జ్జనకుడు, దాని నించుకయు స్వాంతమునందిడఁబోక నన్ను దా
సునిగా గ్రహించి యిష్టమగు చొప్పున నానతుఁలిమ్ము నీవు చె
ప్పిన పనిచేయు దెల్లపుడు భృత్యుఁడనై పడియుండు నీకడన్.

కమ : (మందహాసముతో) యిదిగో యీ నగల మూటయు నీ కాగితముల కట్టయుఁబట్టుకొని నా వెంట రండు.యిరువురమును గలిసి ఈ వరవిక్రయ దురాచారమును రూపుమాపుటకై పాటుపడుదుము (అని మూటయు, గట్టయు నిచ్చును.)

బస:- (తీసుకొని తలపై నిడుకొనును)

లింగ:- ఓరి నీచుడా! చివరి కెంత నైచ్యమునకు సిద్ధపడితివిరా? ఇదిగో, నా యాస్తినుండి నీకు నలుసంత ముట్టనిచ్చితినా, నా మెడలోనిది యజ్ఞోపవీతము కాదు. (అని చనుచుండగా)

[తెరపడును]

ఇది నవమాంకము

...—...

దశమాంకము

ప్రదేశము : రాజవీధి

ప్రవేశము : పురుషోత్తమరావుగారు, బసవరాజు, భ్రమరాంబ, కమల.

పురు:-

సీ. కొసరి కట్నములందు కొంటయే గౌరవ
మని తలపోసెడి యజ్ఞులార!
వచ్చి ముద్దుగఁ బిల్ల నిచ్చెద మనఁ గట్న
ములకు బేరములాడు మూర్ఖులార!
అబ్బాయి పెండ్లితో నప్పు పప్పులు తీర్చి
నిలువ సేయఁగ జూచు నీచులార!
ముడుపులు గొనితెచ్చి ముంగల నిడుదాఁక
పల్లకి యెత్తని పశువులార!
ఏమి యన్యాయమిది! పూర్వ మెన్నఁడేని
వరుల నిటు విక్రయించిన వారు గలరె?
పూజ్యతరమైన మన పుణ్యభూమియందుఁ
గటగటా! నరమాంస విక్రయము తగునె!

బస:-

సీ. కట్నాలకై పుస్తకములు జేఁగొని పాఠ
శాలల కేగెడు చవటలార!
పిలిచి కాళ్ళు కడిగి పిల్లనిచ్చినవారి
కొంప లమ్మించెడి కుమతులార!
అలగ్గి పొన్నుల నెక్కి యవి యివి కావలె
నని శివమాడెడి యధములార?
ఎంత పెట్టినఁ దిని యెప్పటికప్పుడు

నిష్ఠురోక్తులు పల్కు నీచులార!
కట్నమును పేర నొక చిల్లి గవ్వ గొనిన
భార్య కమ్ముడువోయిన బంటు లగుచు
జన్మ దాస్యంబు సలుపుడు సలుపకున్న
నత్తవారింటఁ గుక్కలై యవతరింత్రు

భ్రమః-

సీ. మగబిడ్డ పుట్టిన మఱునాఁడె మొదలు శు
ల్కమువలె లెక్కించు రాక్షసులార!
మర్యాద కై చూడ మరల గట్నాలకై
రేపవల్ వేధించు రేచులార!
అయిదు ప్రొద్దుల రాణులై, చీటికిని మాటి
కలిగి కూర్చుండు గయ్యాళులార!
లాంఛనంబుల పేర లక్ష చెప్పుచు నిల్లు
గుల్ల సేయు దరిద్రగొట్టులార.
ఆఁడుపుట్టువు పుట్టరే ఆఁడువారి
నిట్టు లవమానపఱచుట కించుకేని
సిగ్గుపడకుండఁ దగునె ఛీ? ఛీ ధనంబె
పావనంబుగఁ జూచుట పరువె మరువె.

కమ :-

సీ. వెల పుచ్చుకొని వచ్చు వెడఁగులచేఁ బుస్తె
కట్టించు కొనియెడు కన్నెలార
కట్నాల మగలతోఁ గలిసి పల్లకిలోనఁ
గూరుచుండెడు పెండ్లి కూతులార
కోరిన వెల యిచ్చి కొని తెచ్చుకొన్న దా
సానుదాసులకు దాస్యము సేయు సుదతులార
మీ వివాహములకై మీవారు ఋణముల
పాలౌట గని యోర్చు పడతులార
ఎంచిచూడఁగ స్త్రీజాతి కింతకన్న

గౌరవము లేమి యిల మఱి కలదె? చాలుఁ
జాలు నీకన్నైన బౌరుష జ్ఞానములను
గలిగి మెలఁగుడు సత్కీర్తిఁ గనుఁడు.

ఒక బ్రాహ్మణుఁడు:-[ప్రవేశించి]అయ్యా! కట్నపు సొమ్ముకంటె కాలకూట విషము మేలు. దానివల్ల నే నాకీ దరిద్రరోగము పట్టినది.

సీ. తగిన బేరము వచ్చుదాఁక నబ్బాయిని
పాఠశాలకు తన్ని పంపినాను
పోటీలపై వెల పొసఁగించి నాలుగు
సంచుల వఱకు కక్కించినాను
మాటిమాటికి బోట్లాటకు సిద్ధమై
లాంఛనాలని వేయి లాఁగినాను
అద్దుల కీవచ్చునని యున్న సొమ్మెల్ల
పెట్టి పెంకుటి యిల్లు కట్టినాను
ఇల్లు కాలిపోయె నింటిది చనిపోయె
పిల్లవాఁడు వెఱ్ఱి పీనుఁగాయె
గోడ తొకనిఁ దగలుకొని లేచియే పోయె
నాకు ముష్టిచెంబె లోకమాయ [నిష్క్రమించును]

ఒక కమ్మ:- (ప్రవేశించి) అయ్యా! నా సొద కొంతాలకించండి.

సీ. వొడ్డికి వొడ్డీలు వొంతున పెంచేసి
మంచి మాన్యాలు గడించినాను
పది పుట్ల బూఁవితో పందంటి బిడ్డ నొ
యెదవ కుక్కల కొడుక్కిచ్చినాము
అలక పానుపుకాడ అసలైన శంగలి
బీ దాడి కడుపునఁ పెట్టినాను
అన్ని తిన్న యెదవ అమ్మాయి నొదిలేసి
యింకొర్తి పక్కలో యిచిడినాడు

నాకు కూడు లేదు నా బిడ్డ కిప్పుడు
కూడు, గుడ్డ కొంపకూడ లేవు
అయినవెల్ల సేర్చి అల్లుడోళ్ళకు పెట్టు
కమ్మ సచ్చినోళ్ళ కర్మమింతె. (నిష్క్రమించును)

ఒక సెట్టి:-(ప్రవేశించి) నా కతగూడా సెపుతాను నవ్వకండేం.

సీ. పెసలలో, జోళ్ళలో బెడ్డలు కలిపేసి
పెజల నెత్తులు గొట్టి పెంచినాను
మేనల్లుడింట్లోను మిడుకుతుంటే పిల్ల
నింకొక సిన్నోడి కిచ్చినాను
గళ్ళున పదివేలు పళ్ళెవులోఁ బోసి
సకల మరేదలూ జరిపినాను
గుంటూరు మేళవూ గూడూరి సుందరి
పీకపాటా పిలపించినాను

అయిదు రోజులు జుట్టివ్వు కాడినాను
తెలక రెండు దివాలాలు తీసినాను
యెల్లి యిరసాలుమెంటు కోర్టెక్కినాను
వచ్చి పెసరట్లు జంగిడి పట్టినాను. [నిష్క్రమించును]

లింగ :- [చటాలున ప్రవేశించి] బావగారు! చివరకుఁ బందిని బొడిచి బంటనిపించుకొన్నారు! మీ ప్రబోధము వినుచుఁ, ప్రచ్ఛన్నముగా నేనును మీ వెనుకనే వచ్చుచున్నాను. ప్రజలలో మిమ్మును, మీ కొమార్తెను; మీ యల్లునిఁ బ్రశంసింపని వారును; నన్నును, నా భాగ్యమును బరిహసింపని వారును లేరు.

సీ. కట్టిక ముట్టిక కడుపునకేనియుఁ
గుడువక యొక కొంత కూర్చినాను!
వడ్డికి వడ్డీలు వంతునఁ బొడిగించి

పెనకువపైఁగొంత పెంచినాను!
పద్దులు పత్రముల్ దిద్ది, దీపము లార్పి
వంచించి కొంత గడించినాను!
కాయమ్మి కసరమ్మి కడుగమ్మి వోట్లమ్మి
చిల్లరగాఁ గొంత చేర్చినాను!

అతిథి చుట్టము గురువును యాచకుండః!
దేవుఁడను మాట లేక వర్తించినాను!
కడకుఁగట్నంబునకు గడ్డి కఱచినాను!
కలదె నావంటి ఖలుఁడు లోకంబునందు?

పురు:- బావగారూ! గతజల సేతుబంధనమువల్లఁ గార్యమేమున్నది ప్రస్తుతము తాము దయచేసిన పని ఏమో సెలవిండు!

లింగ:- ఇఁక నాకేమి పనియున్నది? అబ్బాయిని, గోడలిని ఇంటికిఁ దోడుకొనిపోయి ఆస్తి అంతయు వారి వశముచేసి హాయిగా మీతో హరి నామ స్మరణ చేసికొనుచు, గూర్చుండవలెనని వచ్చినాను.

పురు:- ఈ మాటలు మీరు మనస్ఫూర్తిగా నన్నవేనా?

లింగ:- సందియమేమి? నా కోడలిని సమాధానపఱచి,నా కుమారుని మరల నా వానిఁగ జేసికొన్న రేపు వాడు నాకు గర్మ చేయుటకుగాని, వాడు చేసిన కర్మ నాకు ముట్టుటకుఁగాని యవకాశ మెక్కడిది? అప్పు డాలోచనములేక పాడు కట్నము కొఱకన్నిపాట్లు పడినాను! ఆ పాప మును బరిహరించుకొనువరకు నా యంతరాత్మకు శాంతి గలుగదు!

పురు:- అట్లయిన మీ యిష్టానుసారమే యగుఁగాక; మన మందఱ మును గలసి యొకసారి మంగళాశాసనము కావించి పోవుదము.

సీ. ఆడుబిడ్డల వివాహములకై తండ్రులు
పడుబాధ లెల్లను బాయుఁ గాక!
లింగ:- కట్నాల కోసము గడ్డికఱచువారి
కెల్ల నా పాట్లె పట్టిల్లుఁగాక
బస:-పణములు గొనువారు భార్యల కేప్రొద్దు
నూడిగంబులు సేయుచుండ్రుగాక
కమ:— వెలమగల్ మెడలఁబుస్తెలు కట్టు దౌర్భాగ్య
దశ కన్నియల కింకఁ దప్పుఁగాక!
భ్రమ:— కట్నముల నందుకొంటయే గౌరవమను
వెడగుఁదనమ మాడువారిని వీడుఁగాక!
అందరు:- ఉర్వి నన్నిటఁ గాళింది కుద్దియైన
వెలదులే యెప్పుడును బ్రభవింత్రుగాక!

స ం పూ ర్ణ ము

...)(....

విజ్ఞాన వికాసాలకు

గ్రీక్ తత్త్వవేత్త సోక్రటీస్ జీవితం—తాత్త్వికత	15-00
స్వాప్నికుడు, ఆదర్శవాది ప్లేటో జీవితం—తాత్త్వికత	15-00
విజ్ఞానఖని అరిస్టాటిల్ జీవితం-తాత్త్వికత	15-00
షహీద్ భగత్‌సింగ్	9-00
విప్లవసేనాని చంద్రశేఖర ఆజాద్	10-00
స్వాతంత్ర్య సమరంలో సుభాష్‌చంద్రబోస్	8-50
విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు	7-50
దళితజాతుల వైతాళికుడు అంబేద్కర్	12-50
కామ్రేడ్ స్టాలిన్	7-50
రెండవ ప్రపంచ యుద్ధంలో స్టాలిన్‌పాత్ర	7-50
ఆర్థిక సమస్యలు	6-00
అండమాన్ జైలులో విప్లవకారులు	25-00
నేను-నా దేశం	25-00
దేశం కోసం	20-00
కొడుకులూ-కూతుళ్ళు	25-00
కౌటిల్యుని అర్థశాస్త్రం	13-00
ప్రపంచ రాజ్యాల సంగ్రహ చరిత్ర	20-00
ఆరోగ్యం సమస్యలు పరిరక్షణ	22-00
ఇంటింటా విజ్ఞాన సర్వస్వం (4 భాగాలు)	40-00
వైజ్ఞానిక గాథాశతి	30-00
కవిరాజ దర్శనం	15-00
చలం శ్మశాన సాహిత్యం	15-00
యుగకర్త వీరేశలింగంపై నీలాపనిందలు!	7-00

అడవి బాపిరాజు రచనలు

నారాయణరావు	30-00
గోనగన్నారెడ్డి	25-00
హిమబిందు	33-00
కోనంగి	35-00
తుపాను	25-00
అడవి శాంతిశ్రీ	20-00
నరుడు	12-00
జాజిమల్లి	12-00
రాగమాలిక	12-00
శైలబాల	12-00
అంజలి	12-00
అంశుమతి	7-50

తెలుగు విశ్వవిద్యాలయము
నమోదు సంఖ్య 4578
తేది 22-2-96

నోరి నరసింహశాస్త్రి చారిత్రక నవలలు

మల్లారెడ్డి	32-00
ధూర్జటి	25-00
నారాయణ భట్టు	22-00
కవిద్వయం	13-00
కవి సార్వభౌముడు	15-00

ఉన్నవ లక్ష్మీనారాయణ

మాలపల్లి (2 భాగాలు)	60-00

ప్రేమచంద్ రచనలు

కర్మభూమి	30-00
మనోరమ	30-00
సేవా సదన్	25-00
నిర్మల	16-00